ఆంధ్రభూమి

సంపుటి 59 సంచిక 96 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | శనివారం 5 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

FAR EAST MEGA SALE
3Country - 7Nights / 8Days
3N Kuala Lumpur / 3N Singapore / 1N SriLanka.
INR 66,599* per person.
4 Country - 11Nights / 12Days
2N Pattaya / 2N Bangkok.
3N Kuala Lumpur / 3N Singapore / 1N SriLanka.
INR 77,599* per person.
*Terms & Conditions Apply :
MIN 2 PAX travel together / Visa charges & Gst Extra.
Bkk to Kul flight charges extra.
Booking before 09JAN/ Travel 31MAR'19.
Rates are subject to change as per availability.
For Further Details :
Contact us @ Hyd Office :
040 23311495 / 9553304546
SriLankan Holidays
A world of memories

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
దక్షిణాయనం, హేమంతఋతువు,
మార్గశిరమాసం, కృష్ణపక్షం
తిథి: బహుళ అమావాస్య రా.తె.5.41
నక్షత్రం: మూల మ.2.57,
వర్జ్యం: మ.1.14 నుండి 2.57,
తిరిగి రా.1.20 నుండి 3.03 వరకు
విశేషాలు: అమావాస్యోపవాసం
దుర్ముహూర్తం: ఉ.06.00 నుండి 07.36వరకు
రాహుకాలం: ఉ.09.00 నుండి 10.30 వరకు

రాఫెల్‌పై హోరాహోరీ

నిర్మలా సీతారామన్, రాహుల్ గాంధీ మధ్య మాటల యుద్ధం

- దేశ భద్రత కోసమే యుద్ధ విమానాల కొనుగోలు
- ఒప్పందంలో ఎలాంటి అవినీతి జరగలేదు
- లోక్‌సభలో తేల్చిచెప్పిన నిర్మలా సీతారామన్

- మోదీ మాత్రమే అవినీతికి పాల్పడ్డారు
- విమాన ధరలు ఎవరు పెంచారు?
- ప్రశ్నల వర్షం కురిపించిన రాహుల్‌గాంధీ



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో అవినీతి జరిగిందే ఆరోపణలపై గురువారం లోక్‌సభలో రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మధ్య హోరాహోరీగా మాటల యుద్ధం కొనసాగింది. చుట్టుపక్కల ఉన్న శత్రువుల నుండి దేశానికి భద్రత కల్పించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికపై రాఫెల్ యుద్ధవిమానాలు కొనుగోలు చేస్తోందని, ఈ ఏడాది సెప్టెంబర్ మాసంలో ఈ విమానాలు వస్తున్నాయని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో తమ ప్రభుత్వం ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, తమకు దేశ భద్రతే ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు. ముడుపులు ముట్టలేదు కాబట్టే అప్పట్లో యూపీఏ ప్రభుత్వం యుద్ధ విమానాలు కొనుగోలు చేయకుండా దేశ భద్రతకు ముప్పు తెచ్చారని నిర్మలా సీతారామన్ దుయ్యబట్టారు. యుద్ధ విమానాల కొనుగోలు విషయంలో రాహుల్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. కాగా, నిర్మాలా సీతారామన్ వ్యాఖ్యలపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. ఆయన ఎదురు దాడి చేస్తూ, రాఫెల్ ఒప్పందంలో నరేంద్ర మోదీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆయన స్వయంగా అనీల్ అంబానీ పేరును రాఫెల్ ఆఫ్‌సెట్ ఒప్పందంలో

- మిగతా 6వ పేజీలో



ఇకనుంచి దేశంలోనే తయారీ

యుద్ధ విమానాలపై రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: దస్సాల్ట్ నుండి 36 రాఫెల్ యుద్ధ విమానాలను ఫ్లైఅవే పద్ధతిలో కొనుగోలు చేసిన తరువాత, మిగతా 90 రాఫెల్ యుద్ధ విమానాలను మన దేశంలోనే ఉత్పత్తి చేస్తామని, మేక్ ఇన్ ఇండియాను వదులుకోలేదని రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో వెల్లడించారు. శుక్రవారం లోక్‌సభలో రాఫెల్‌పై జరిగిన చర్చలో ఆమె ఒక ప్రశ్నకు స్పందిస్తూ, ఈ 90 విమానాలను హెచ్‌ఏఎల్‌లో ఉత్పత్తి చేయాలా? లేక మరోచోట ఉత్పత్తి చేయాలా? అనేది ఇంకా నిర్ణయించలేదని పేర్కొన్నారు. శత్రు దేశాల నుండి ప్రమాదం ఉన్నందున మన వాయు దళం సామర్థ్యాన్ని వెంటనే పెంచేందుకే ఫ్లైఅవే పద్ధతిలో 36 రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తున్నామని ఆమె వివరించారు. మిగతా 90 విమానాలను మన దేశంలో తయారు చేసేందుకు సంబంధించిన చర్చలు ఇంకా ప్రారంభం కాలేదని ఆమె తెలిపారు.

‘అయోధ్య’పై 10న ధర్మాసనం ఏర్పాటు

- అదేరోజు విచారణ తేదీ ప్రకటిస్తాం: సుప్రీం
- 30 సెకన్లలో ముగిసిన విచారణ

న్యూఢిల్లీ, జనవరి 4: అయోధ్య రామ మందిర భూమి వివాదంపై ఈ నెల 10వ తేదీన ధర్మాసనం ఏర్పాటుపై సముచిత నిర్ణయం వెలువరిస్తామని సుప్రీంకోర్టు ప్రకటించింది. కొత్తగా ఏర్పాటు చేయనున్న ధర్మాసనం ఈ వివాదాన్ని విచారిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ అన్నారు. ఈ కేసును ఎప్పుడు విచారించే విషయమై కొత్త ధర్మాసనం తేదీలను ఖరారు చేస్తుందన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్‌య, జస్టిస్ ఎస్‌కే కౌల్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో వేరువేరు పార్టీల తరఫున సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, రాజీవ్ ధావన్‌లు వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యే లోపలనే కోర్టు పై విధమైన ఆదేశాలు ప్రకటించింది. వారికి

- మిగతా 6వ పేజీలో

జగన్‌పై హత్యాయత్నం కేసు ఎన్‌ఐఏకు

- ఏపీ హైకోర్టు ఆదేశాలు
- అప్పీలు యోచనలో ప్రభుత్వం

విజయవాడ (క్రైం), జనవరి 4: ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)కు బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌వి భట్, జస్టిస్ విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం జగన్ కేసును ఎన్‌ఐఏకి బదిలీ చేయడంతో ఇక హైకోర్టులో జగన్ కేసుకు సంబంధించిన విచారణ మూసేసినట్టేనని కోర్టు స్పష్టం చేసింది. జగన్ కేసుకు సంబంధించిన విచారణ ఇక జాతీయ దర్యాప్తు సంస్థ చేపడుతుందని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు

- మిగతా 6వ పేజీలో



పంచాయతీ ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి

కొత్త పథకాలకే కోడ్

- గ్రేటర్, కార్పొరేషన్లకు వర్తించదు
- ఖర్చు మీరితే ఉపేక్షించొద్దు
- బలవంతంగా ఏకగ్రీవం చేసినా చర్యలు
- పంచాయతీ పరిశీలకులకు నాగిరెడ్డి దిశా నిర్దేశం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: పంచాయతీ ఎన్నికల కోడ్ గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఇతర మున్సిపల్ కార్పొరేషన్లకు వర్తించదని రాష్ట్ర ఎన్నికల అధికారి నాగిరెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే అమలులో ఉన్న పథకాలకు కోడ్ వర్తించదని స్పష్టం చేశారు. అయితే కొత్త పథకాలను ప్రకటించడం కోడ్ ఉల్లంఘన కిందకి వస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సాధారణ, వ్యయ పరిశీలకులతో శుక్రవారం నాడిక్కడ రాష్ట్ర ఎన్నికల అధికారి సమావేశమయ్యారు. ఎన్నికల నిర్వహణతో పాటు ఎన్నికల కోడ్‌పై పరిశీలకులకు అవగాహనపై దిశానిర్దేశం చేశారు. పరిశీలకులకు ఈ సందర్భంగా జిల్లాలను కేటాయించారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి పరిమితులు విధించామని, పరిమితికి మించి ఖర్చు చేస్తే కఠిన చర్యలు తప్పవని నాగిరెడ్డి హెచ్చరించారు.గత ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల ఖర్చులను సమర్పించకపోయినా ఈ ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటిస్తామన్నారు. బలవంతంగా కానీ, బెదిరించికానీ ఎన్నికను ఏకగ్రీవం చేసినా చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. చర్యల విషయంలో పరిశీలకులకు పూర్తి స్వేచ్ఛ ఉందని, వారిదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. అవసరమైతే రీ పోలింగ్‌కు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పోలీసు బలగాలను మోహరింపు ఉంటుందని, అవసరమైతే అదనంగా కూడా పంపిస్తామన్నారు.

రాఫెల్ వివాదాన్ని తేల్చండి

జేపీసీ ఏర్పాటు చేయాల్సిందే ❖ సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాగా జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదిస్తున్న ఫెడరల్‌ఫ్రంట్ విషయం తనకు తెలయదని ప్రధాని నరేంద్రమోడీ చెప్పడం ఆశ్చర్యంగా ఆయన అన్నారు. ఫెడరల్ ఫ్రంట్ తెలియదని చెప్పడం 2019 సంవవత్సరంలో పెద్ద అబద్ధమని ఆయన విమర్శించారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని సీపీఐ ఆఫీసు మఖ్దూమ్ భవన్‌లో సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డితో కలసి సురవరం సుధాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఫెడరల్ ఫ్రంట్ గురించి పత్రికల్లో పతాకస్థాయిలో వచ్చిన వార్తలు ప్రధాన మంత్రి చూడలేదా? అని నిలదీశారు. పత్రికలు చదివే అలవాటు ప్రధాన మంత్రికి లేదేమో అంటూ ఆయన వ్యంగోక్తులు విసిరారు. నరేంద్రమోదీ ప్రధాని బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక్క మీడియా సమావేశం ఏర్పాటు చేసిన పాపానపోలేదన్నారు. ఢిల్లీలో ప్రధాన మంత్రిని, ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదన అంశం చర్చకురాలేదంటే నమ్మవచ్చా?అని ఆయన అన్నారు. కాగా దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న రాఫెల్ వివాదాన్ని తెల్చడానికి జాయింట్ పార్లమెంట్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తన ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణలపై నిగ్గు తేల్చడానికి ప్రధాన మంత్రి జేసీపీని ఏర్పాటు చేయక తప్పదని ఆయన చెప్పారు.



విలేఖరులతో మాట్లాడుతున్న సురవరం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

కేరళలో జరుగుతున్న మారణకాండకు ప్రధాన మంత్రి మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రధాని నరేంద్రమోదీ వెనకేసుకురావడం ప్రమాదకరం అన్నారు.

మతం ముసుగులో పక్క మతాన్ని కించపరచడం గర్హనీయమన్నారు. తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను కుదించడం పట్ల చాడ వెంకటరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉన్న రిజర్వేషన్లలో కోత విధించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు.

సార్వత్రిక సమ్మెకు

'లెఫ్ట్' సన్నద్ధం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 8 ,9 తేదీల్లో దేశ వ్యాప్త సమ్మె జరగనుంది. ఈ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడానకి వామపక్షాలు సన్నద్ధమవుతున్నాయి. 'మోదీ హఠావో దేశ్‌కా బచావో' అనే నినాదంతో వామపక్షాలు సమ్మెకు దిగుతున్నాయి. సార్వత్రిక సమ్మె మద్దతుగా వామపక్షాల అనుబంధ సంఘాలు, కార్మిక సంఘాలు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాయి. సమ్మెలో కార్మక సంఘాలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చాయి. జిల్లాల్లో ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కేడర్‌కు ఆదేశాలు ఇచ్చాయి. ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు అమలు చేస్తున్న వివిధ పథకాను రద్దు చేయడానికి ప్రధాన మంత్రి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సార్వత్రిక సమ్మెకు తమ పార్టీ పూర్తి మద్దతునిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి వెల్లడించారు. కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘ ఫెడరేషన్లు ఐక్యంగా సమ్మెకు సిద్ధం అవుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. మోదీ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించడానికే సమ్మెకు పిలుపు ఇచ్చామని సీపీఐ ఎంఎల్ (ఎన్‌డీ) రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సమ్మెకు మద్దతుగా ధర్నాలు, నిరసనలు చేపట్టడం జరుగుతోందని ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి తాండ్రకుమార్ చెప్పారు. భద్రతకు భరోసా కల్పించాలని ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధి కల్పన, కనీస వేతనాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల అమ్మకాలు నిలిపివేయాలని సీపీఐఎంఎల్ (ఎన్‌డి) ఎస్ వెంకటేశ్వ రావు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు వ్యవస్థ రద్దు, కార్మిక చట్టాల సవరణను ఆపాలని ఎస్‌యుసీఐ రాష్ట్ర కార్యదర్శి మురారి రావువిజ్ఞప్తి చేశారు.

ఖాతాదారులకు మరింత సేవలో ఎస్‌బీఐ

చీఫ్ జనరల్ మేనేజర్ మణి పల్వేసన్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: ఖాతాదారులకు విభిన్న మార్గాల్లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చేరువ అవుతోందని ఈ క్రమంలో రోజురోజుకూ బ్యాంకింగ్ వినియోగదారుల సంఖ్య విపరీతంగా పెరుగుతోందని ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ మణి పల్వేసన్ చెప్పారు. ఎస్‌బీఐ అమరావతి స్థానిక హెడ్ ఆఫీసు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన వార్షిక పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకు కార్యకలాపాలను వివరించారు. ఎస్‌బీఐ 'యోనో' పేరుతో యాప్ రూపొందించిందని, దీని ద్వారా తమ ఖాతాలను పరిశీలించుకోవడమేగాక, టాక్సీ, రైల్వే, విమాన టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని, ఆన్ లైన్‌లో షాపింగ్‌కు ఎంతో తేలికగా ఉంటుందని పేర్కొన్నారు. యోనో యాప్ విడుదల చేసి ఏడాది అవుతోందని చెప్పారు. యోనో ప్లాట్‌ఫారం ద్వారా 60 కంపెనీలు ఇ- కామర్స్ సేవలు అందిస్తున్నాయని తెలిపారు. సంప్రదాయ మొబైల్ సేవలను కూడా ఈ యాప్ ద్వారా పొందవచ్చని, ఖాతాదారులు బ్యాంకులకు రాకుండానే ఆన్‌లైన్‌లో తమ సెల్‌ఫోన్ నుండి అన్ని సేవలు పొందే అవకాశం దక్కిందని అన్నారు. ఎస్‌బీఐ 35 దేశాల్లో తన ఉనికి ప్రదర్శిస్తోందని, 207 ముఖ్య కార్యాలయాలున్నాయని, 3.05 కోట్ల మంది మొబైల్ బ్యాంకింగ్ వినియోగదారులు, 4.79 కోట్ల ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ వినియోగదారులున్నారని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో కూడా ఎస్‌బీఐ ఖాతాదారులకు చేరువగా ఉందని, ఫేస్‌బుక్, యూట్యూబ్ , లింకిడిన్, పింట్‌రెస్టు తదితర మాధ్యమాల్లో ఎస్‌బీఐ వినియోగదారులకు సేవలు అందిస్తోందని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో అనుసరిస్తున్న వారి సంఖ్య ప్రపంచంలోనే అత్యధికంగా ఎస్‌బీఐకే ఉన్నారని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ మణి పల్వేసన్

తెలంగాణలోనే అతి చిన్న

పంచాయతీ

18 ఓట్లు వస్తే సర్పంచ్ అయినట్లే

ఆంధ్రభూమి బ్యూరో

ఖమ్మం, జనవరి 4: పంచాయతీ ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో విభిన్న పరిస్థితులు నెలకొంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతన పంచాయతీలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో తక్కువ మంది ప్రజలు నివసిస్తున్న గ్రామాలు కూడా అక్కడి పరిస్థితులకు అనుగుణంగా గ్రామ పంచాయతీలుగా రూపాంతరం చెందాయి. దీంతో ఈసారి చిన్న చిన్న పంచాయతీలకే ఎన్నికలు జరపాల్సిన పరిస్థితి నెలకొన్నది. అతితక్కువ జనాభాతో నూతన పంచాయతీగా ఏర్పడిన గ్రామాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేకం ఉన్నాయి. ఈ పంచాయతీలన్ని ఏజన్సీ ప్రాంతంలో ఉన్న నేపథ్యంలో అక్కడ పదవులన్నీ ఎస్టీలకే రిజర్వు అయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆళ్ళపల్లి మండల పరిధిలోని దొంగతోగు గ్రామ పంచాయతీలో కేవలం 45మంది జనాభా కాగా ఇందులో 34మంది మాత్రమే ఓటర్లు ఉన్నారు. అందులో 17మంది పురుషులు, మరో 17మంది స్త్రీలు ఉన్నారు. ఈ గ్రామంలో 4వార్డులను కూడా ఏర్పాటు చేశారు. ముఖాముఖి పోటీ జరిగితే ఉన్న 34మందిలో 18ఓట్లు తెచ్చుకున్న వారు విజేతగా నిలిచే అవకాశం ఉంది. అలాగే ముఖాముఖి పోటీ జరిగితే ఐదు ఓట్లు తెచ్చుకుంటే వార్డు సభ్యునిగా, ఆ తరువాత ఉప సర్పంచ్‌గాను ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఈ గ్రామానికి మధ్యలో కిన్నెరసాని నది ఉన్న నేపథ్యంలో నదికి అవతల ఉన్న ప్రాంతమంతటినీ ఆళ్ళపల్లి గ్రామంలో చేర్చగా ఇవతల ప్రాంతాన్ని కొత్త పంచాయతీగా ప్రకటించారు. ఈ గ్రామానికి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో మరో గ్రామం లేకపోవడంతో తప్పని పరిస్థితిలో పంచాయతీ ఏర్పాటు చేయవల్సిన పరిస్థితి నెలకొన్నది. అందరూ ఈ గ్రామం ఏకగ్రీవం అవుతుందని భావిస్తున్నప్పటికీ సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీకి గట్టి పట్టు ఉన్న ఈ ప్రాంతంలో ముగ్గురు అభ్యర్థులు పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం పది లక్షల రూపాయలు ఇస్తుందని, వాటితో గ్రామాన్ని పూర్తిగా అభివృద్ధి చేసుకోవచ్చని సమీప గ్రామాలకు చెందిన పార్టీల నేతలు చెబుతున్నప్పటికీ స్థానిక పరిస్థితుల దృష్ట్యా అక్కడి ఓటర్లు పోటీకే సిద్ధమవుతుండటం గమనార్హం. ఇదే మండల పరిధిలోని అడవిరామారం గ్రామంలో 64 ఓట్లు మాత్రమే ఉన్నాయి.

ఎన్‌ఐఏ దర్యాప్తుతో

కుట్రదారులు బయటపడతారు

కోడి కత్తి కాదది నారా కత్తి ❖ వైకాపా మాజీ ఎంపీ మిథున్ రెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై కత్తితో దాడి జరిగిన ఘటనపై విచారణకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కు హైకోర్టు అప్పగించినందున, అసలైన కుట్రదారులు బయట పడతారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. కత్తితో దాడి చేసిన కేసును కేంద్రం ఎన్ఐఏకు అప్పగించడాన్ని హైకోర్టు ధృవీకరించిందని మిథున్ రెడ్డి శుక్రవారం విలేఖరుల సమావేశంలో తెలిపారు.

ఘటన జరిగిన ప్రాంతం ఎన్ఐఏ పరిధిలోకి వస్తుంది కాబట్టి కేసును ఎన్ఐఏకు అప్పగించాలని హైకోర్టు ఇదివరకే కేంద్రానికి సూచించిందని ఆయన చెప్పారు. ఎన్ఐఏ విచారణతో నిజాలు వెలుగులోకి వస్తాయని తాము విశ్వసిస్తున్నామని ఆయన చెప్పారు. విశాఖ విమానాశ్రయంలో గత ఏడాది అక్టోబర్ 25న శ్రీనివాస్ అనే యువకుడు దాడి చేస్తే అరగంటలోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తే దాడి చేశారని, జనంలో సానుభూతి కోసం డ్రామా చేశారని, అరగంటకే టీడీపీ నాయకులు విమర్శించారని ఆయన గుర్తు చేశారు. టీడీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘటన పట్ల విచారం వ్యక్తం చేయకుండా ఎగతాళి చేశారని ఆయన విమర్శించారు. పైగా అది కోడి కత్తే కదా? అని వ్యాఖ్యానించారని, 'కోడి కత్తి కాదది నారా కత్తి' అని ఆయన విమర్శించారు.

ఆ రోజు విశాఖ విమానాశ్రయం వీఐపీ లాంజ్‌లో మధ్యాహ్నం ఘటన జరిగితే, సాయంత్రం వరకూ కేసు నమోదు చేయలేదని ఆయన చెప్పారు. శ్రీనివాస్‌నే నిందితునిగా చూపించారని, అసలైన వారు ఎవరో బయట పెట్టలేదన్నారు. అంతేకాకుండా కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆయన విమర్శించారు. తమకు ఉన్న సమాచారం మేరకు శ్రీనివాస్ టీడీపీ నాయకుడు హర్షవర్ధన్ వద్ద పని చేస్తున్నాడని ఆయన చెప్పారు. ప్రభుత్వం, పోలీసుల విచారణపై తమకు నమ్మకం లేకే కోర్టును ఆశ్రయించామని మిథున్ రెడ్డి తెలిపారు.

వచ్చే ఎన్నికలకు సమాయత్తం

❖ పది రోజుల్లో పీసీసీకి కొత్త కమిటీలు ❖ ఎన్నికల కోసం ఐదు కమిటీలు

❖ పోటీ చేసిన అభ్యర్థులు పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల బాధ్యులు

❖ త్వరలో 33 జిల్లాల డీసీసీ అధ్యక్షుల నియామకం ❖ ఈ నెల 15 లోగా బూత్, మండల, బ్లాక్ కమిటీలు

❖ గాంధీభవన్‌లో 6 లోక్‌సభ స్థానాలపై సమీక్షా సమావేశం ❖ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: పది రోజుల్లో పీసీసీకి కొత్త కమిటీలను నియమించడంతో పాటు పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలకు ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులే నియోజకవర్గాలకు బాధ్యులుగా వ్యవహరిస్తారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. అలాగే ఈ నెల 15 వరకు పీసీసీ, డీసీసీ, నగర, బ్లాక్ కమిటీలను నియమిస్తామన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్, కరీంనగర్, జహీరాబాద్, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాలపై పార్టీ నేతలతో సమీక్షా సమావేశాన్ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ ఆర్‌సి కుంతియా, ఏఐసీసీ కార్యదర్శి శ్రీనివాసన్, పార్టీ సీనియర్ నేత షబ్బీర్ అలీ తదితరులు ఎన్నికలకు పార్టీ వ్యూహంపై చర్చించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు త్వరలో 33 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను నియమించనున్నట్టు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సంస్థాగత నిర్మాణం కోసం ఏఐసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ జేడీ శీలం పీసీసీలకు పంపించిన షెడ్యూల్ ప్రకారం కమిటీల నియామకాన్ని పూర్తి చేస్తామన్నారు. పది రోజుల్లో టీపీసీసీకి కొత్త కమిటీలను వేయడంతో పాటు పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రత్యేకంగా ఐదు కమిటీలను నియమించనున్నట్టు వివరించారు. ఈ నెల 8 వరకు ఎన్నికల కోసం పీసీసీ కమిటీలు, 15 లోగా డీసీసీ, నగర, పీసీసీ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీల నియామకాన్ని పూర్తి చేస్తామన్నారు. అయితే బూతు కమిటీలను మాత్రం జనవరి 30 లోగా నియామించనున్నట్టు చెప్పారు. అన్ని కమిటీలకు ఫిబ్రవరిలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. బూతు కమిటీలు మొదలుకొని పీసీసీ కమిటీల వరకు సమగ్ర సమాచారాన్ని ఫిబ్రవరి 5 వరకు ఏఐసీసీకి పంపిస్తామన్నారు. ఓటర్ల జాబితాను లోతుగా అధ్యయనం చేసి మార్పు, చేర్పుల కోసం బూతు స్థాయి ఏజెంట్లను నియమించి జనవరి 25 వరకు ఎన్నికల సంఘానికి సమర్పించాలని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేయడానికి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యాక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు ప్రత్యేకంగా పని విభజన చేసే బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించినట్టు చెప్పారు. పీసీసీ కమిటీలో ఐదుగురితో ఎన్నికల మేనేజిమెంట్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఈ నెల 15న పీసీసీ స్థాయిలో సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు.



గాంధీ భవన్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కుంతియా, పొన్నం తదితరులు

అధికారంలోకి రాగానే..

అగ్రి గోల్డ్ బాధితులను ఆదుకుంటాం

వైకాపా నేత, మాజీ మంత్రి బొత్స భరోసా

ఆంధ్రభూమి బ్యూరో



హైదరాబాద్, జనవరి 4: తాము అధికారంలోకి రాగానే అగ్రి గోల్డ్ బాధితులను ఆదుకుంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ భరోసా ఇచ్చారు. అగ్రి గోల్డ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల చొప్పున ఇవ్వాలని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి రాగానే ఆదుకుంటామని ప్రకటించడంతోనే రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు చొప్పున ఇవ్వాలని భావిస్తున్నదన్నారు. అగ్రి గోల్డ్ భూములు కాజేయాలన్న ప్రయత్మమూ జరుగుతున్నదని ఆయన విమర్శించారు. అగ్రి గోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. అగ్రి గోల్డ్ బాధితులను ఆదుకునేంత వరకూ తమ పోరాటం ఆగదని అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కోసం, కుటుంబం కోసం, తాబేదార్ల కోసం పని చేయకుండా ప్రజల కోసం పని చేయాలని అన్నారు. చంద్రబాబు చెబుతున్న అబద్దాలు కొత్త రికార్డు సృష్టిస్తున్నాయని ఆయన విమర్శించారు. హైటెక్ సిటీ శంకుస్థాపన లోగడ రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న నేదురుమల్లి జనార్ధన్ రెడ్డికి చేసిన సూచన మేరకే జరిగిందని ఇటీవల టీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు చెప్పారని ఆయన గుర్తు చేశారు. అయితే టీడీపీ నాయకులు మాత్రం రాజీవ్ ప్రధానిగా ఉన్న సమయంలో నేదురుమల్లి సీఎంగా లేరని చెప్పడాన్ని బట్టి చూస్తే వారికి జ్ఞాపకశక్తి ఎంత ఉందో అర్థమవుతున్నదని బొత్స అన్నారు. అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాల ఉసురు మీకే తగులుతుందని ఆయన అన్నారు.

రైతుబంధు ఆగదు

పంచాయతీ కోడ్ అడ్డు రాదు ❖ స్పష్టం చేసిన ప్రభుత్వం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: రైతుబంధు చెక్కుల పంపిణీ యథాతథంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పంచాయతీరాజ్ ఎన్నికల కోడ్ దీనికి అడ్డుకాదని స్పష్టం చేసింది. పంచాయతీ ఎన్నికల కారణంగా రైతు బంధు పథకం 27వ తేదీ వరకు నిలిచి పోతుందంటూ కొన్ని మీడియాల్లో వార్తలు వచ్చినందున రాష్ట్ర ప్రభుత్వ అధికారి ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు. అమలులో ఉన్న పథకాలకు కోడ్ వర్తించదని ఎన్నికల నోటిఫికేషన్ విడుదల సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి జవాబిచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతు బంధు పథకాన్ని యథావిధిగా కొనసాగించిన సంగతి తెలిసిందే. అమలులో ఉన్న పథకాలన్నీ యథావిధిగా కొనసాగుతాయని రాష్ట్ర ఎన్నికల అధికారి (సిఇవో) రజత్ కుమార్ అప్పట్లో చెప్పారు. ఇలా ఉండగా రైతు బంధు పథకాన్ని నిరాటంకంగా కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రబీ సీజన్‌కు రూ.600 కోట్లు విడుదల చేసింది. పాస్ పుస్తకాలు ఉన్న రైతులకు ఇప్పటికే రూ.200 కోట్ల రూపాయల వరకు విడుదల చేశామని, మిగతా రూ.400 కోట్లను ఈ నెలాఖరులోగా రైతుల బ్యాంకు అకౌంట్లకు బదిలీ చేసే విధంగా క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణ అధికారులు చర్యలు చేపట్టారని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి ఆంధ్రభూమి ప్రతినిధికి చెప్పారు.

రూ.5 వేలు ఎప్పుడు?

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎకరానికి రూ.5 వేలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు కూడా కాలేదు కాబట్టి త్వరలోనే దీనిపై ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

దేవాలయాల్లో కోటి దీపోత్సవం

శబరిమల పవిత్రత కాపాడాలంటూ వీహెచ్‌పీ పిలుపు


ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: శబరిమల పవిత్రత కాపాడాలంటూ దేవాలయాల్లో శనివారం నాడు కోటి దీపోత్సవాన్ని నిర్వహించాలని వీహెచ్‌పీ పిలుపునిచ్చింది. ఈ విషయాన్ని వీహెచ్‌పీ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ వివరిస్తూ, అన్ని దేవాలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి అయ్యప్ప స్వామి కోటి దీపోత్సవ ప్రతిజ్ఞతీసుకోవాలని వీహెచ్‌పీతో పాటు శబరిమల సంరక్షణ సమితి, శబరిమల అయ్యప్ప సేవా సమితి, శబరిమల ఐక్యవేదిక తదితర ఆధ్యాత్మిక ధార్మిక సంస్థలు పిలుపునిచ్చినట్టు పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని, ఇస్లామిక్ తీవ్రవాద భావజాలంతో పనిచేస్తున్న ఎస్‌డీపీఐ , హిందూ వ్యతిరేకతతో పనిచేస్తున్న చర్చిలతో కలిసి కుట్ర జరుగుతోందని, స్వయంగా ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోనే శబరిమల ఆలయ సంప్రదాయాలను దెబ్బతీస్తూ కేరళలో హిందువులపై అత్యంత పాశవికంగా దాడులకు పాల్పడుతున్న హిందువులను హత్య చేస్తున్న కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని వెంటనే రద్దు చేయాలని దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహించాలని వీహెచ్‌పీ పిలుపునిచ్చింది.

తెలుగు రాష్ట్రాల అయ్యప్ప స్వాములు తీవ్రంగా గాయపడుతున్నా సెక్యులర్ ముసుగు ధరించిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటని ఆయన అన్నారు.

నియామకాలపై గవర్నర్‌కు నివేదిక

టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ గంటా చక్రపాణి



గవర్నర్ నరసింహన్ కలసిన కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: తెలంగాణ రాష్ట్రంలో గత ఏడాది పబ్లిక్ సర్వీసు కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్లు, ఎంపిక ప్రక్రియపై కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌కు ఒక నివేదిక అందజేశారు. సర్వీసు కమిషన్ పనితీరుపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని హితవు పలికారు. వేగంగా ఫలితాలు ఇవ్వాలని ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని గవర్నర్ చెప్పారు. సర్వీసు కమిషన్ చైర్మన్ వెంట సభ్యులు కూడా ఉన్నారు.

గురుకుల విద్యాసంస్థల నియామకాలు షురూ

9 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: గురుకుల విద్యాసంస్థల్లో లెక్చరర్ల నియామకాలకు సంబంధించి ఈ నెల 9వ తేదీ నుండి సర్టిఫికేట్లను పరిశీలించనున్నట్టు తెలంగాణ రెసిడెన్షియల్ విద్యాసంస్థల రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. 960 టీజీటీలు, 1972 పీజీటీను నియమించబోతున్నట్టు ఆయన తెలిపారు. వివరాలను టీఆర్ఈఐబీ డాట్ తెలంగాణ డాట్ జీవోవీ డాట్ ఇన్ అనే వెబ్‌పోర్టల్‌ను చూడాలని సూచించారు.

వైవిధ్యంగా పంచాయతీ ఎన్నికల గుర్తులు

సర్పంచ్ అభ్యర్థులకు 30..వార్డు సభ్యులకు 20 వంతున ఖరారు • ప్రతి బ్యాలెట్ చివరన నోటా • తెలుగు వర్ణమాల ప్రకారం కేటాయింపు

ఆంధ్రభూమి బ్యూరో


ఆదిలాబాద్, జనవరి 4: గ్రామపంచాయతీ ఎన్నికలకు రెండు రోజుల క్రితమే షెడ్యూల్ జారీ కాగా ఎన్నికల సంఘం సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి గుర్తులను ఖరారు చేయడంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. తెలుగు వర్ణమాల ఆధారంగా క్రమపద్ధతిలో గుర్తులు కేటాయించగా సర్పంచ్ స్థానాలకు 30, వార్డు సభ్యులకు 20 గుర్తులను ఖరారు చేయడం గమనార్హం.

గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానానికి దగ్గరగా ఉండి ప్రతి ఒక్కరూ గుర్తుపట్టే విధంగా వివిధ రకాల గుర్తులను ఖరారు చేయడం గమనార్హం. సర్పంచ్ స్థానాలకు పోటీచేసే అభ్యర్థుల ఫొటోలను మాత్రం బ్యాలెట్‌లో ముద్రించడం జరగదు. కేవలం గుర్తులు మాత్రమే ఖరారు చేస్తూ తొలిసారిగా పంచాయతీ ఎన్నికల్లో నోటా గుర్తును కూడా ముద్రించనున్నారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద నమూనా బ్యాలెట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు.

సర్పంచ్ స్థానానికి గులాబీ రంగు, వార్డు సభ్యులకు తెలుపు రంగుతో కూడిన బ్యాలెట్ పత్రాలు ముద్రించడం జరిగిందని, ఇప్పటికే అన్ని మండలాలకు బ్యాలెట్ బాక్సులు సైతం పంపిణీ చేయడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా తెలిపారు. పోటీలో నిలిచే వ్యక్తుల పేర్లను అనుసరించి వరస క్రమ పద్ధతిలో తెలుగు వర్ణమాల ఆధారంగా ఎన్నికల చిహ్నాలు కేటాయిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా జరిగే ఎన్నికల నేపథ్యంలో గుర్తులు కూడా పార్టీలతో సంబంధం లేకుండా సహజసిద్ధంగా ఉన్నాయని వివరించారు.

సర్పంచ్ గుర్తులు ఇవే...

సర్పంచ్ స్థానాలకు ఖరారు చేసిన గుర్తులను ఎన్నికల సంఘం ప్రకటించింది. వీటిలో వరసగా ఉంగరం, కత్తెర, బ్యాట్, కప్పు సాసర, విమానం, బంతి, షటిల్, కుర్చి, వంకాయ, నల్ల బోర్డు, కొబ్బరికాయ, లేడి పర్సు, మామిడికాయ, సీసా, బకెట్, బుట్ట, దువ్వెన, అరటి పండు, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, క్యారెట్, గొడ్డలి, గాలి బుడగ, బిస్కెట్, వేణువు, ఫోర్క్, స్పూన్ ఇలా 30 గుర్తులు కేటాయించనున్నారు. అదే విధంగా వార్డు సభ్యులకు కేటాయించిన గుర్తుల్లో వరసగా జగ్గు, గౌన్, గ్యాస్‌స్టవ్, స్టూల్, గ్యాస్ సిలిండర్, గాజు గ్లాస్, బీరువా, ఈల, కుండ, డిష్ యాంటెన్నా, గరిట, మూకుడు, కేటిలి, విల్లూబాణం, పోస్టల్ కవర్, హాకీ బంతి, నెక్ టై, కటింగ్ ప్లేయర్, పోస్టు డబ్బాతో కూడిన 20 గుర్తులను కేటాయించనున్నారు. నోటా గుర్తుకు చివరణ ముద్రించనున్నారు.



కంచెలో చిక్కుకున్న చిరుత

★ తప్పించేందుకు అటవీ శాఖ అధికారుల విఫల ప్రయత్నం
★ స్వయంగా నేర్పుతో బయటపడిన చిరుత

మాక్లూర్, జనవరి 4: పంట సంక్షణ కోసం ఓ రైతు ఏర్పాటు చేసుకున్న కంచెలో చిక్కుకున్న చిరుత పులిని పట్టుకోవడానికి అటవీ శాఖ అధికారులు చేసిన ప్రయత్నాలను చిరుతపులి చిత్తు చేస్తూ అత్యంత చాకచక్యంగా తప్పించుకున్న సంఘటన శుక్రవారం మాక్లూర్ మండలం గుత్ప అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, మాక్లూర్ మండలం గుత్ప గ్రామానికి చెందిన ఓ రైతు తమ పంట పొలాన్ని అడవి పందులు, ఇతర జంతువుల భారీ నుండి కాపాడుకునేందుకు వైరుజాలితో కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. ఇదే క్రమంలో గురువారం రాత్రి సమయంలో ఆ కంచెలో చిరుతపులి చిక్కుకోగా, శుక్రవారం ఉదయం పంట పొలానికి వెళ్లి సదరు రైతు కంచెలో చిక్కుకున్న చిరుతను చూసి భయాందోళనకు గురయ్యాడు. వెంటనే విషయాన్ని అటవీ శాఖ రేంజ్ అధికారులకు తెలియజేయగా, అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కంచెలో చిక్కుకున్న చిరుతను చూసిన నిజామాబాద్ అటవీ శాఖ అధికారులు వెంటనే హైదరాబాద్ రేంజ్ అధికారులకు సమాచారం అందించారు. అయితే కంచెలో చిక్కుకున్న చిరుతపులిని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు సుమారు 5గంటల పాటు విశ్వప్రయత్నాలు చేసినా, వారి ప్రయత్నాలను చిత్తు చేస్తూ చిరుతపులి తప్పించుకుని అడవిలోకి వెళ్లిపోవడంతో అటవీశాఖ అధికారుల 7గంటల శ్రమ వృథా అయ్యింది. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు 5గంటల వరకు ఎంతో ఉత్కంఠ రేపిన చిరుతపులి సంఘటనలో చిరుత తప్పించుకుని అడవిలోకి పారిపోవడంతో చేసేదేమీ లేక అటవీ శాఖ అధికారులు రిక్త హస్తాలతో వెనుదిరిగి వెళ్లిపోయారు.



చిరుతను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు

నయీం ఆస్తుల
అటాచ్‌మెంట్‌కు ఐటీ శాఖ సంసిద్ధం

న్యాయం కోసం బాధితుల ఎదురుచూపులు

ఆంధ్రభూమి బ్యూరో



నల్లగొండ, జనవరి 4: గ్యాంగ్‌స్టర్ నయీం బతికున్న కాలంలో బెదిరింపులు, హత్యాకాండతో సంపాదించిన ఆస్తుల కేసు విచారణ పూర్తి చేసిన ఆదాయ పన్ను శాఖ వాటి అటాచ్‌మెంట్ దిశగా రంగం సిద్ధం చేస్తోంది. ఐటీ విచారణలో నయీం ఆస్తులన్నీ బినామీల మీద ఉన్నట్లుగా గుర్తించిన ఐటీ శాఖ బినామీ ప్రాపర్టీస్ ప్రొబిషనరీ యూనిట్ కింద ఆస్తుల అటాచ్‌మెంట్ చేసుకునే దిశగా చర్యలు ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. ఎలాంటి ఆదాయ మార్గాలూ లేకుండా వేల కోట్ల రూపాయల భూములను నయీం బెదిరించి సంపాదించాడని ఈడీ ఇప్పటికే కేసు నమోదు చేసింది. మార్కెట్‌లో నయిమ్ ఆస్తుల విలువ రూ.1200 కోట్ల మేరకు ఉంటుందని అంచనా వేస్తున్న ఐటీ శాఖ బినామీ ఆస్తులను అటాచ్ చేయాలని న్యాయస్థానంలో పిటిషన్ సైతం దాఖలు చేసింది. మరోవైపు నయీం అరాచకాలతో భూములు, ఆస్తులు కోల్పోయిన బాధితులు తమకు దర్యాప్తు సంస్థలు న్యాయం చేసి తమకు సంబంధించిన భూములను తిరిగి అప్పగించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

చెరువులు నింపేందుకే
గుత్ప, అలీసాగర్ జలాలు

ఆయకట్టు పంటలకు రబీలో నీరందించలేం • తేల్చి చెప్పిన ఇరిగేషన్ శాఖ • ఎస్సారెస్పీలో నీటి లభ్యత లేదని వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

నిజామాబాద్, జనవరి 4: ప్రస్తుత రబీ సీజన్‌లో గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద పంటలు సాగు చేద్దామని భావించిన రైతాంగానికి ప్రభుత్వ నిర్ణయం ఆశనిపాతంలా మారింది. ఇదివరకటి తరహాలోనే ఈసారి కూడా పంటలకు ఈ లిఫ్టుల ద్వారా సాగునీటిని సమకూరుస్తారని ఆశిస్తూ, పంటలు విత్తేందుకు అన్నదాతలు ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్న తరుణంలో, ఆయకట్టుకు నీరందించే పరిస్థితి లేదని ప్రభుత్వం కరాఖండీగా తేల్చి చెబుతూ చేతులెత్తేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా నీటి పారుదల శాఖ అధికారికంగా ప్రకటనను సైతం విడుదల చేసింది. గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల నీటిని కేవలం చెరువులు నింపుకునేందుకు మాత్రమే వదలడం జరుగుతుందని స్పష్టం చేశారు. అది కూడా ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిని పాటిస్తూ ఈ నెల 5 నుండి ఫిబ్రవరి 16వ తేదీ వరకు మూడు విడతల్లో రెండు టీఎంసీల వరకు నీటిని విడుదల చేయాలని ప్రణాళికలు రూపొందించారు. నిజానికి గత నెల 14వ తేదీన రాష్ట్ర రాజధానిలో జరిగిన శివం కమిటీలో అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల ద్వారా కూడా ఆయకట్టుకు నీరందించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇరిగేషన్ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించగా, ఆయకట్టు పంటలకు నీరందించే వెసులుబాటు లేనందున కేవలం చెరువులు నింపేందుకే విడుదల చేయాలని అనుమతించింది. శ్రీరాంసాగర్ రిజర్వాయర్‌లో తగినంత నీటి నిల్వలు లేని కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అధికారులు వెల్లడించారు. 1091 అడుగులు, 90టీఎంసీల పూర్తిస్థాయి సామర్థ్యం కలిగిన ఎస్సారెస్పీలో ప్రస్తుతం 1071.80, 32టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ అరకొర మిగులు జలాల నుండే ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని పంటలకు సాగు జలాలు అందించడంతో పాటు, మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి అవసరాల కోసం దాదాపు 6టీఎంసీల వరకు నీటిని అట్టి పెట్టాల్సి వస్తోంది. మరో ఐదు టీఎంసీలను డెడ్‌స్టోరేజీగా పరిగణిస్తారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టు పంటలకు నీరందించే పరిస్థితి ఉండదని అంచనాకు వచ్చిన ప్రభుత్వం, కేవలం చెరువులను నింపేందుకు మాత్రమే నీటిని విడుదల చేయాలని ఆదేశించినట్టు తెలుస్తోంది. దీంతో చెరువుల కింద పంట భూములు కలిగి ఉన్న కొద్దిమంది రైతులకు మాత్రమే లబ్ధి చేకూరనుండగా, మిగతా వేలాది ఎకరాల భూములు పడావుగానే మిగిలిపోయే దైన్య పరిస్థితి నెలకొంది. ఈ రెండు ఎత్తిపోతల పథకాల కింద సుమారు లక్ష ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. ఇదివరకు ఇది నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పరిధి కిందే ఉండేది. అయితే నిజాంసాగర్ నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పడిపోయి 17.8టీఎంసీలకే పరిమితం అవడం, అది కూడా ఈ జలాశయం పూర్తిస్థాయిలో నిండని కారణంగా ఆయకట్టు విస్తీర్ణం అంతకంతకూ పడిపోతూ 2లక్షల ఎకరాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో నిజాంసాగర్ ఆయకట్టును స్థిరీకరించాలనే ఉద్దేశ్యంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ తీరంలో గోదావరి నదిని ఆనుకుని అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. ఈ లిఫ్టులు అందుబాటులోకి వచ్చిన నాటి నుండి ప్రతీసారి ఖరీఫ్‌లో, అప్పుడప్పుడూ రబీలో కొద్దోగొప్పో ఆయకట్టు పంటలకు నీటిని అందిస్తూ వస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో మాత్రం ఎస్సారెస్పీలో నీటి నిల్వలు గణనీయంగా దిగువకు పడిపోవడంతో నీటి లభ్యత లేదనే సాకుతో ప్రభుత్వం పై రెండు లిఫ్టుల ద్వారా కేవలం చెరువులను నింపేందుకు నీరు విడుదల చేయాలని నిర్ణయించింది.

ప్రజల విశ్వాసాలను సుప్రీంకోర్టు ప్రతిబింబించాలి

ఏబీవీపీ జాతీయ కమిటీ తీర్మానం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: సిలబస్ నుండి మావోయిస్టుల పాఠ్యాంశాలను తొలగించాలని ఏబీవీపీ జాతీయ కమిటీ తీర్మానించింది. అహ్మదాబాద్ సబర్మతీ నదీతీరంలో జరిగిన ఏబీవీపీ జాతీయ మహాసభలు జరిగాయని జాతీయ కార్యదర్శి ఉదయ్, జాతీయ కార్యసమితి సభ్యుడు ప్రవీణ్‌రెడ్డి , రాష్ట్ర కార్యదర్శి కిరణ్ తెలిపారు. జాతీయ మహాసభల్లో ఐదు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించామని ప్రధానంగా 100 శాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని, అభివృద్ధి వైపు పయనిస్తున్న భారత్ ముందున్న సవాళ్లకు అనుగుణంగా గ్రాడ్యుయేట్ విద్యను మెరుగుపరచాలని, సుప్రీం కోర్టు ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా వ్యవహరించాలని తీర్మానించినట్టు చెప్పారు. జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్ సుబ్బయ్య, జాతీయ ప్రధానకార్యదర్శిగా ఆశిస్ చౌహాన్, ఎన్నికయ్యారని అన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడిగా ప్రొఫెసర్ ఆనంద్ పాలివాల్, చంగస్ భాయ్ పటేల్, ఉమా శ్రీవాస్తవ, వసంతకుమార్, రామన్ త్రివేదిలు ఎన్నికయ్యారని అన్నారు. జాతీయ కార్యదర్శిగా తెలంగాణ నుండి ఉదయ్ ఎన్నికైనట్టు వారు చెప్పారు. జాతీయ కార్యదర్శులుగా నరేంద్ర సపం, నిధి త్రిపాఠీ, హేమా ఠాకూర్, ఆవిలాశ్ పాండా, భూపిందర్ సింగ్ నాగి, శ్యాంరాజ్, జాతీయ సంఘటన కార్యదర్శిగా సునీల్ అంబేకర్, జాతీయ సహ సంఘటనా కార్యదర్శిగా రఘునందన్ , గుంతా లక్ష్మణ్, శ్రీనివాస్, ప్రపుల్ ఆకాంత్ నియమితులయ్యారు.

ఏకగ్రీవ నజరానాలపై అందని ఉత్తర్వులు!

ప్రచారంలో 'అదనపు' ప్రయోజనాలు ప్రకటిస్తున్న నేతలు

ఆంధ్రభూమి బ్యూరో

నల్లగొండ, జనవరి 4: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ సర్పంచ్‌లను సాధించి గ్రామపరిపాలన స్థాయి నుండి తమ ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తున్న అధికార టీఆర్‌ఎస్ పార్టీ సర్పంచ్‌ల ఏకగ్రీవాలపై తీవ్ర కసరత్తే చేస్తోంది. సర్పంచ్‌ల ఏకగ్రీవాల కోసం ఒకవైపు ప్రభుత్వం నుంచి అధికారికంగా అందించే నజరానాలతో పాటు తెరవెనుక ప్రయత్నాలతో సైతం ఏకగ్రీవాల కోసం టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, మండల, గ్రామశాఖల నాయకుల దాకా శ్రమిస్తున్నారు. ఏకగ్రీవాల దిశగా మరో అడుగుముందుకేసిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్.రవీంద్రకుమార్‌లు ఏకగ్రీవ సర్పంచ్‌లకు ప్రభుత్వ నజరానా 10 లక్షలకు తోడు ఎమ్మెల్యే, ఎంపీ కోటాల నుంచి మరో పది లక్షలు ఇస్తామంటూ ప్రకటించారు. ఇది ఇలాఉండగా ప్రభుత్వం నుంచి ఏకగ్రీవ పంచాయతీలకు నజరానాలకు సంబంధించి ఇప్పటిదాకా అధికారిక ఉత్తర్వులు వెలువడకపోవడం పంచాయతీ అధికారులను, పార్టీలను గందరగోళ పరుస్తుంది. 2013గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద పంచాయతీలకు 15లక్షలు, చిన్న పంచాయతీలకు 10లక్షల నజరానా ప్రకటిస్తు ఉత్తర్వులు జారీ చేసింది. సదరు ఉత్తర్వులు తెలంగాణ ప్రభుత్వం కొత్త పంచాయతీ చట్టంతో చెల్లిపోయాయని, కొత్తగా తెలంగాణ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీల నజరానాకు సంబంధించి జీవో విడుదల చేయాల్సివుందని జిల్లా పంచాయతీ అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటిదాకా తమకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఏకగ్రీవ పంచాయతీల నజరానాకు సంబంధించి ఎలాంటి జీవోలు అందలేదని డీపీవోలు వెల్లడించారు. 2013గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

వాటికి సంబంధించిన నజరానాలు వారికి పాలనకాలం చివరి దశలోగాని అందలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి ఏకగ్రీవ సర్పంచ్‌ల నజరానాల వ్యవహారం విస్తృత ప్రచారంలోకి రావడంతో ఈ దఫా ఎన్ని పంచాయతీలు ఏకగ్రీవానికి మొగ్గు చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది. అయితే తండాలకు పంచాయతీ హోదా దక్కడం, కొత్తగా పలు చిన్న పంచాయతీలు ఏర్పాటు కావడంతో ఈ దఫా 1720పంచాయతీల్లో తండాలు, చిన్న పంచాయతీల్లో 200సర్పంచ్‌ల వరకు ఏకగ్రీవం కావచ్చని అధికార పార్టీ వర్గాలు ఆశలు పెట్టుకున్నాయి.

కేరళ సీఎం తీరు కుట్రపూరితం

శబరిమలలో 200 ఏళ్ల నాటి ఆచారాలను అడ్డుకోవడమెందుకు? • శ్రీ విద్యాధరి క్షేత్ర వ్యవస్థాపకుడు చంద్రశేఖర శర్మ

గజ్వేల్, జనవరి 4: శబరిమల అయ్యప్ప క్షేత్రంలో మహిళల ప్రవేశంపై కేరళ సీఎం విజయన్ తీరు కుట్రపూరితంగా ఉందని, 200 సంవత్సరాల పూర్వం నుండే కొనసాగుతున్న నిషేధం ఆయనకు తెలియనిదికాదని కంచి కామకోటి పీఠం ప్రతినిధి, వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్ర వ్యవస్థాపకులు, ప్రముఖ వాస్తు సిద్ధాంతి యాయవరం చంద్రశేఖరశర్మ ఆక్షేపించారు. శుక్రవారం వర్గల్ క్షేత్రం వద్ద విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచార వ్యవహారాలకు ట్రావెంకోర్ దేవస్వం బోర్డు నిర్ణయం ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనని, అయితే, మహిళల ప్రవేశానికి బోర్డు వ్యతిరేకం కాదన్న విషయాన్ని గమనించాలని సూచించారు. హిందూ సమాజంలో మహిళలకు ఎంతో గౌరవం ఉండగా, కంటతడి పెట్టించే ఎలాంటి సంఘటనలు జరగవని తెలిపారు. కాగా, 10 సంవత్సరాల లోపు బాలికలు, 60 ఏళ్లు దాటిన మహిళలు నిరభ్యరంతరంగా శబరిమలైలోని శ్రీ అయ్యప్పస్వామిని దర్శించుకోవచ్చని, ఇందులో ఎలాంటి అనుమానాలు లేవని స్పష్టం చేశారు. హిందువుల మనోభావాలు, అయ్యప్ప భక్తులు కలత చెందే విదంగా వ్యవహరిస్తున్న కేరళ సర్కార్ తగిన మూల్యం చెల్లించుకుంటుందని తెలిపారు. మహిళలకు, అయ్యప్ప భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగవద్దనే లక్ష్యంతోనే ఈ నిషేదం కొనసాగుతుండగా, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మహిళలు అర్థం చేసుకోవాలని కోరారు. తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలను గౌరవించాల్సిన కేరళ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని, సంతానోత్పత్తి వయసులో ఉన్న మహిళల నిషేదంపై అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ నివేదికే తిరుగులేని ఆదారంగా నిలిచిందని చెప్పారు. ముఖ్యంగా 1991లో కేరళ హైకోర్టు మహిళల నిషేదంపై చట్టబద్దత కూడా కల్పించిన విషయాన్ని సీఎం విజయన్ గమనించాలని సూచించగా, రాజకీయ కోణంలో శబరిమలై క్షేత్రం పవిత్రతకు దెబ్బతీస్తే శ్రీ అయ్యప్పస్వామి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.



విలేఖరులతో మాట్లాడుతున్న చంద్రశేఖర శర్మ

నాణ్యమైన విద్యుత్‌లో మనమే నెంబర్ వన్

24 గంటల కరెంట్ ఘనత సిబ్బందిదే.. • జెన్‌కో, ట్రాన్స్‌కో చైర్మన్ ప్రభాకర్‌రావు

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 4: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన విధానాలకు అనుగుణంగా రాష్ట్రంలో గృహావసరాలకే కాకుండా వ్యవసాయం, కంపెనీలకు 24 గంటల కరెంటును అందించడంలో ప్రతి ఒక్క విద్యుత్ అధికారులు, సిబ్బంది కృషి ఉందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఆరు నెలలో 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించ గలిగామని రాష్ట్ర జెన్‌కో, ట్రాన్స్‌కో చైర్మన్ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అతిథి గృహ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన రోజున విద్యుత్ అంధకారమే అంటున్న సందర్భంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సలహాలు సూచనలతో ఖర్చుకు వెనకాడకుండా నాణ్యమైన ట్రాన్స్‌ఫార్మర్‌లను కొనుగోలు చేసి అధికారుల కృషితోనే నిరంతర విద్యుత్ సాధ్యమైందని అన్నారు. విద్యుత్ వినియోగంలో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ ఉందన్నారు. గతంలో కరెంటు లేకపోతే వార్త ఉండేదని నేడు కరెంటు పోతేనే వార్త అవుతుందని అన్నారు. ప్రతి నెల రూ. 2700 కోట్ల ఖర్చు ఉందని రూ.1935 కోట్ల ఆదాయం ఉందని రూ. 800 కోట్ల నష్టంతో ఉన్నా కరెంటు కష్టాలు ప్రజలకు తెలియకుండా చేస్తున్నామని అన్నారు. రఘుమా రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్‌కే ప్రథమ స్థానం ఇచ్చారని స్విచ్ వేస్తే కరెంటు, ప్రతి గ్రామంలో నిరంతర విద్యుత్‌ను అందించగలుగుతున్నామని అన్నారు. వ్యవసాయదారులకు 24 గంటల కరెంటు ఇవ్వడమే విద్యుత్ ఉద్యోగుల కృషికి నిదర్శనమని అన్నారు. గోపాల్ మాట్లాడుతూ విద్యుత్‌ను అందించడంలో ఎలాంటి రిమార్కు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను తెలంగాణ రాష్ట్రం నలుమూలా అందించగలుగుతున్నామని వినియోగదారులు విద్యుత్ ఉద్యోగుల పట్ల గౌరవంగా ఉంటున్నారని అన్నారు. రాష్ట్ర సెక్రటరీ జనరల్ బేసీరెడ్డి, డైరీ డైరెక్టర్ నరేష్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చెలపతిరావు, రాష్ట్ర సెక్రటరీ జనరల్ నర్సింహ్మలు పాల్గొన్నారు.



యాదగిరిగుట్టలో రాష్ట్ర పవర్ డిప్లొమా ఇంజనీర్ అసోసియేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెన్‌కో, ట్రాన్స్‌కో చైర్మన్ ప్రభాకర్‌రావు

ప్రమాణాలు పాటించని
కాలేజీలు మూసేయండి

ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: రాష్ట్రంలో కొత్తగా కాలేజీలకు అనుమతి మంజూరు చేయవద్దని, ప్రస్తుతం ఉన్న కాలేజీల్లో విద్యాప్రమాణాలను, నాణ్యతను పెంచేందుకు కృషి చేయాలని ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా పేర్కొన్నారు. 'విద్యారంగంలో నమూనా మార్పులు-నైపుణ్యాభివృద్ధి' అనే అంశంపై ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ , రాష్ట్ర ఐటీ శాఖ, ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అజయ్ మిశ్రా మాట్లాడుతూ విద్యాప్రమాణాల పెంపునకు కఠిన వైఖరి అవలంభించాలని వైస్ ఛాన్సలర్లకు పిలుపునిచ్చారు. అవసరమైతే ప్రమాణాలు పాటించని కాలేజీలను మూసివేయాలని, అన్ని విద్యాసంస్థలూ ప్రమాణాలు పాటించేలా చూడాలని పేర్కొన్నారు. విద్యారంగం మరింత శక్తివంతంగా పనిచేసేందుకు ఉన్న అంతరాలను పూడ్చాలని సూచించారు. ఈ సందర్భంగా ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటీ రంగంలో ప్రగతిపథంలో వడివడిగా అడుగులు వేస్తోందని అన్నారు. టాస్క్, స్టార్టప్‌లు, టీ హబ్ ఇందుకు ఉదాహరణగా చెప్పారు. ఎలాంటి నేపథ్యం లేకుండా వినూత్న ఆలోచనలతో యువత ముందుకు వస్తున్నారని, విజయం సాధిస్తున్నారని అదే విధంగా విద్యాసంస్థలు సైతం తమ విద్యార్థులను, బోధన సిబ్బందిని ప్రోత్సహించాలని చెప్పారు. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ సాంకేతిక విద్యారంగం ఎంతో మెరుగుపడాల్సి ఉందని అన్నారు. జేఎన్‌టీయూ హెచ్ వీసీ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాఠ్యప్రణాళికలతో పాటు పాఠ్యాంశాల్లో పెను మార్పులు రావల్సి ఉందని అన్నారు. బోధన సిబ్బందికి సైతం ఆధునిక బోధన పద్ధతులు, విధానాలపై శిక్షణ ఇవ్వాలని చెప్పారు. డిజిటల్ యుగంలో అంతా డిజిటల్ ప్రక్రియ సాగుతోందని ఆ నూతన ఒరవడిని విద్యా సంస్థలు అందిపుచ్చుకోవాలని చెప్పారు. మూక్స్, స్వయం ప్రభ తదితర రూపాల్లో ఆన్‌లైన్ కోర్సులున్నాయని పేర్కొన్నారు. టాస్క్ సీఈఓ సంజీవ్ నాయర్ మాట్లాడుతూ టాస్క్‌లో ఇప్పటికే 550 స్టూడెంట్ గ్రూప్స్ ఉన్నాయని అన్నారు. ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ వర్శిటీల్లో ఉన్న లోపాలను గుర్తించి, ఎప్పటికపుడు వాటిని సవరించుకోవాలని చెప్పారు. ఉస్మానియా వీసీ ప్రొఫెసర్ ఎస్ రామచంద్రం మాట్లాడుతూ ఉపాధి కల్పన పెద్ద సవాలుగా మారిందని, జాతీయ విద్యాసంస్థల్లో సైతం 30 శాతం మేర పోస్టులు ఖాళీగా ఉన్నాయని , క్వాలిటీ టీచర్ల కొరత చాలా తీవ్రంగా ఉందని అన్నారు. మంచి టీచర్లు ఉంటే సరిపోదు, మంచి బోధన కూడా సాగాలి అని రామచంద్రం చెప్పారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి డాక్టర్ అశోక్ మాట్లాడుతూ భారత్ చైనాల్లో విద్యారంగం తీరుతెన్నులను వివరించారు. క్వాలిటీ అంశాలను ఇప్పటికైనా పట్టించుకోవాలని అన్నారు. ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ సీబీసీఎస్ విధానాన్ని అమలుచేయాలని సూచించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వర్చ్యువల్ లెర్నింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ జీలాని మాట్లాడుతూ విద్యారంగం నుండి కార్యక్రమ రూపకర్తలే కాకుండా విద్యార్థుల నుండి కూడా అభిప్రాయ సేకరణ చేయాలని చెప్పారు. గ్లోబల్ ట్రీ ప్రతినిధి సుభాకర్ ఆలపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో కమ్యూనిటీ కాలేజీలు రావాలని పేర్కొన్నారు.

నెలాఖరులోగా మరో 14 నోటిఫికేషన్లు

1521 పోస్టుల భర్తీ ★ ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ భాస్కర్ వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 4: వివిధ పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెలాఖరులోగా మరో 14 నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ పీ ఉదయ భాస్కర్ వెల్లడించారు. ఏపీపీఎస్సీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 14 నోటిఫికేషన్ల ద్వారా 1521 పోస్టులు భర్తీ చేస్తామన్నారు. సర్వీస్ నిబంధనలు, అర్హతలు, ఖాళీల వివరాలు, తదితర అంశాలపై ప్రభుత్వం నుంచి వివరాలు రావాల్సి ఉందన్నారు. ఈ వివరాలు అందిన వెంటనే నోటిఫికేషన్‌లు జారీ చేస్తామన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 21 నోటిఫికేషన్లు జారీ చేశామని గుర్తు చేశారు. దీని ద్వారా 3255 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఏఈఈ పోస్టులకు 47001 మంది, ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ల పోస్టులకు 16,130 మంది, హార్టికల్చర్ అధికారుల పోస్టులకు 1307 మంది, పంచాయతీరాజ్ సెక్రటరీ పోస్టులకు 56,621 మంది దరఖాస్తు చేశారన్నారు. వివిధ పరీక్షలకు తుది గడువు వరకూ వేచి ఉండకుండా నోటిఫికేషన్ వెలువడిన వెంటనే దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు. చివరి తేదీల్లో దరఖాస్తు చేయడం వల్ల సర్వర్‌పై ఒత్తిడి పెరిగి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అభ్యర్థులు దీనిని గమనించాలన్నారు. ఓటీపీఆర్‌లో తలెత్తే ఇబ్బందుల పరిష్కారానికి ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను, ఇతర సమస్య పరిష్కారానికి మరో రెండు హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు తమ మెయిల్ ఐడీ, మొబైల్ నెంబర్లు మార్చడం వల్ల ఓటీపీఆర్ పంపడం, సవరణలు చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. 2016లో 34 నోటిఫికేషన్లను విడుదల చేసి, విజయవంతంగా ఎటువంటి కోర్టు వివాదాలు లేకుండా నియామకాలు పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం స్క్రీనింగ్ పరీక్షకు కటాఫ్ మార్కులు నిర్ణయించి, 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను మెయిన్‌కు ఎంపిక చేస్తున్నామన్నారు. వివిధ కేటగిరిల్లో తగిన సంఖ్యలో అభ్యర్థులు ఎంపిక కాని పక్షంలో కటాఫ్ మార్కులను సడలించి, కొంతమందిని మెయిన్‌కు అనుమతిస్తున్నామన్నారు. అయితే వీరు క్యారీఫార్వర్డ్ అయ్యే పోస్టులకు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. యూపీఎస్సీ తరహాలో పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించి ఆర్కియాలజీ మినహా మిగిలిన 43 విభాగాల నియామకానికి ఎటువంటి కోర్టు అభ్యంతరాలు లేవన్నారు. గ్రూప్-2 1999 నోటిఫికేషన్‌కు సంబంధించి సబ్ కమిటీ తన నివేదికను సుప్రీంకోర్టుకు అందచేసిందని, తదుపరి ఆదేశాలు కోర్టు నుంచి తమకు రాలేదన్నారు.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
శనివారం, 5 జనవరి 2019

'మ్యాగీ' మాయ..

సీసపు విష రసాయన ధాతువులు కలసిన 'మ్యాగీ' సేమ్యాలను చిన్న పిల్లలు ఎందుకు తినాలన్నది సర్వోన్నత న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ గురువారం సంధించిన ప్రశ్న.. తినరాదన్నది న్యాయమూర్తి ప్రశ్నలో నిహితమై ఉన్న సమాధానం. కానీ 'మోనో సోడియం గ్లటుమేట్'- ఎమ్ఎస్‌జి- అన్న కృత్రిమ రసాయన 'సీసం'-లెడ్-తో సంకరమైన 'మ్యాగీ' సేమ్యాలను దశాబ్దుల తరబడి పిల్లలు తింటూనే ఉండడం 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థలు' కొనసాగిస్తున్న ఆర్థిక బీభత్సకాండకు ఒక ఉదాహరణ మాత్రమే.. ఈ వాణిజ్య బీభత్సకాండకు ఉదాహరణలు కోకొల్లలు. 'నెజల్'-నెస్‌లే-అన్న బహుళ జాతీయ వాణిజ్య సంస్థ ఉత్పత్తిచేసి మన నోళ్లకెత్తుతున్న అనేకానేక అనవసర కృత్రిమ ఆహార పదార్థాలలో ఈ 'మ్యాగీ' ఒకటి మాత్రమే. 'ఎమ్ఎస్‌జి' విష రసాయనం రుచిని పెంచడమేకాక ఈ 'మ్యాగీ' సేమ్యాలు- నూడుల్స్- అతి త్వరగా 'ఉడికి'పోయి ఆవురావురమని 'ఆబ'గా ఆరగించడానికి వీలైన ఆహారంగా రూపొందడానికి దోహదం చేస్తోందట. అందువల్ల 'మ్యాగీ' సేమ్యాలను చూసి పిల్లల కంటె ముందు పెద్దలకు 'ముక్కులు ఊరడం' ఆరంభమైంది. కృత్రిమ రుచుల సౌరభాలను నాలుక కంటె ముందు 'ముక్కు' ఆఘ్రాణిస్తుందట! అందువల్ల అనారోగ్యాన్ని పెంచే ఆహారాలను 'ఆబ'గా తినడంలో నోటికంటె ముందు 'ముక్కు' పనిచేస్తుందని కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 1959లో వ్రాసిన తన 'దమయంతీ స్వయంవరం' అన్న నవలలో వివరించి ఉన్నారు. ఆ వివరణకు వాస్తవ రూపమైన దృశ్యాలు చిత్ర విచిత్రంగా ఆవిష్కరణమౌతుండడానికి 'మ్యాగీ' సేమ్యాల వంటి 'అమిత రుచికరమైన' కృత్రిమ రసాయన విషాలు దోహదం చేస్తున్నాయి. 'కల్తీకి రుచి ఎక్కువ..' అన్నది ఆధునిక నాగరిక జీవన వాస్తవం! దాదాపు నాలుగేళ్ల క్రితం ఈ 'నెజల్'కంపెనీ వారి సీసపుగుట్టు రట్టయినప్పుడు 'మ్యాగీ' సేమ్యాలు 'అమిత రుచి'ని కుక్కలు సైతం అసహ్యించుకున్నాయి. కుక్కలు సైతం తినడానికి నిరాకరించిన 'మ్యాగీ' సేమ్యాల 'గుట్టలు' మురికి కాలువల పక్కన దర్శనమిచ్చాయి. 'భారత ఆహార భద్రత, ప్రమాణాల సాధికార సంస్థ'- ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా'- ఎఫ్ఎస్ఎస్ఏఐ- ఫ్సాయ్- వారు 2015 జూన్‌లో ఈ 'మ్యాగీ' సేమ్యాల అమ్మకాలను నిషేధించారు. కొన్ని వారాలపాటు మూతపడిన మ్యాగీ సేమ్యాల విక్రయాలు ఆ తరువాత 2015 నవంబర్ నుంచి యథావిధిగా పుంజుకున్నాయి. ప్రభుత్వాల నిర్లక్ష్యం, నత్తనడకతో పోటీపడుతున్న న్యాయప్రక్రియ ఇలా పుంజుకొనడానికి కారణం.. వీటికంటె అతి ప్రధానమైన కారణం మన దేశంలోని వినియోగదారుల 'ముక్కులు ఊరడం..'

ఈ 'సేమ్యా'లను మాత్రమే గాక విష రసాయనాలతో కల్తీ అయిన అన్నిరకాల 'డబ్బాల' 'సీసాల' 'పొట్లాల' నిలువ ఉన్న ఆహారాలను మనం, ప్రధానంగా మధ్య తరగతి జనం విపరీతంగా కొనుగోలు చేస్తుండడం 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థల'- చొరబాటు విస్తరించడానికి కారణం. 'నెస్లే' వంటి సంస్థలు తయారు చేస్తున్న 'ఐస్‌క్రీమ్'లు 'చాక్లెట్లు', కేకులు, పిజ్జాలు, బర్గర్‌లు, శీతల పానీయాలు ''మానవులు తినకూడని, తాగకూడని, చప్పరించకూడని'' రకరకాల కృత్రిమ రసాయన పదార్థాలతో కలుషితమై ఉండడం ప్రపంచమంతటా ప్రచారం అవుతున్న వాస్తవం! ఈ వాస్తవం దేశ విదేశాలలోను న్యాయస్థానాలలోను న్యాయస్థానాల బయట అనేకసార్లు ధ్రువపడింది. అయినప్పటికీ మన దేశంలోని 'పెద్దలు' ఈ అనారోగ్యకరమైన తిండి పదార్థాలను కొంటూనే ఉన్నారు, తింటూనే ఉన్నారు. దాదాపు ఐదు దశాబ్దుల క్రితం వరకు వేయించిన సెనగపప్పు, బఠాణీలు, మరమరాలు- బొరుగులు-, బెల్లం, కారం పట్టించిన రకరకాల పప్పులు, పల్లీలు, ఎండుద్రాక్ష, ఖర్జూరాలు, గోడంచి- జీడిపప్పు-, అటుకులు, పేలాలు, వంటి 'చిరు తిండి'ని పిల్లలకు పెద్దలు తినిపించేవారు, కొనిపించేవారు. కొబ్బరి నీళ్లు, రకరకాల పండ్లు, చెఱకు రసం, పానకం వంటి పానీయాలను సేవించారు. కానీ ఆధునికత పేరుతో పాశ్చాత్య నాగరికత పెరిగిన తరువాత ఇవన్నీ మూలపడినాయి. ఐస్‌క్రీమ్‌లు, బర్గర్‌లు, వేఫర్‌లు, సాండ్‌విచ్‌లు, కట్‌లెట్‌లు, జామ్‌లు 'కోకో', 'పెప్సీ' పానీయాలు పిల్లల కడుపులలో వారిని కొవ్వెక్కిస్తున్నాయి, లావెక్కిస్తున్నాయి! ఇళ్లలో సైతం ఆరోగ్యకరమైన సంప్రదాయపు వంటలు, పిండి వంటలు మూలపడినాయి. కృత్రిమ రసాయన విషాలు కలసిన రకరకాల రంగులు వేసిన వంటలు, పిండి వంటలు తయారవుతున్నాయి. ప్రజలు ప్రధానంగా మధ్యతరగతి వారు తమ పిల్లలకు మొదట ఈ కృత్రిమ పానీయాలను, తినుబండారాలను మప్పుతున్నారు, ఆ తరువాత పిల్లలు నిపుణులుగామారి నిరంతరం 'అంగడి పదార్థాలు' డబ్బాల ఆహారాలు తెగ మెక్కుతున్నారు.. నెస్లే వంటి సంస్థల విస్తరణకు ఇదీ నేపథ్యం..

శుద్ధిచేసి నిలువచేసే ప్రక్రియ పేరుతోనూ, ''కరకర''లాడించడం పేరుతోను, ఘుమ ఘుమ లాడించడం పేరుతోను ప్రతి తిండి పదార్థంలోను కొంత శాతం మేర కృత్రిమ రసాయనాలను కలపడానికి ప్రభుత్వం అనుమతిస్తుండడం మౌలికమైన వైపరీత్యం. ప్రపంచీకరణ వ్యవస్థీకృతమై ఇలా 'తిండి'లో రసాయనాలను కలపడం మరింతగా వ్యవస్థీకృతమైంది. ఇలా ప్రభుత్వం, ప్రభుత్వం ఏర్పాటుచేసిన సాధికార సంస్థలు అనుమతించిన పరిమాణం కంటె ఎక్కువ పరిమాణంలో ఆహార శుద్ధి ప్రక్రియ- ఫుడ్ ప్రాసెసింగ్- పరిశ్రమల వారు - రసాయనాలను ఆహారంలో కలపడం చట్టవిరుద్ధం. కానీ దాదాపు ప్రతి 'డబ్బా తిండి'- పాకేజ్డ్ ఫుడ్-లోను అనుమతించిన పాళ్లలోకంటె ఎక్కువ పాళ్లలో ఈ రసాయనాలను కలిపి వేస్తున్నారు. పట్టుబడిన నేరస్థులైన సంస్థల వారి పదార్థాలను కొన్ని రోజులపాటు నిషేధిస్తున్నారు. మళ్లీ యథాప్రకారంగా ఈ పదార్థాల ఉత్పత్తి, వినిమయం జరిగిపోతూనే ఉంది. ఘుమ ఘుమలాడే నెయ్యికి అది సహజ పరిమళం కాదు, రసాయనాలతో కల్పించిన కృత్రిమ సుగంధం అది. ఈ రసాయనాలు మన కడుపులలో చేరి క్రమంగా శరీరాలను విష పూరితం చేస్తున్నాయి. 'నెజల్' సంస్థవారు ఇలా ప్రభుత్వం అనుమతించిన 'శాతం'కంటె ఎక్కువ శాతం 'సీసాన్ని' మ్యాగీ సేమ్యాలలో కలిపినట్టు 2016లో బయటపడింది. ఇలా కొంత శాతం మేర రసాయనాలతో ఆహారాన్ని 'కల్తీ' చేయడానికి ప్రభుత్వం అనుమతించడం ఏమిటి? ఎలాంటి రసాయన విషాలను కలుపకుండా ఆహారాన్ని శుద్ధిచేసి నిలువ ఉంచలేమా?? అన్న ప్రశ్న అనేక ఏళ్లుగా వినబడుతోంది. సర్వోన్నత న్యాయమూర్తులు డి.వై.చంద్రచూడ్, హేమంత గుప్తా ఈ ప్రశ్నను మరోసారి సంధించారు.. ప్రభుత్వం సమాధానం చెప్పాలి!

ఆర్భాటం లేకుండా 'శుద్ధిప్రక్రియ' మన ఇళ్లలోను, కుటీర, గ్రామీణ పరిశ్రమలలోను వేల ఏళ్లుగా కొనసాగడం చరిత్ర. ఇలా ఆహారాన్ని సంప్రదాయ పద్ధతిలో శుద్ధిచేసి నిలువ ఉంచడానికి భారతీయులు ఎలాంటి కృత్రిమ రసాయనాలను వాడలేదు. కొన్ని సందర్భాలలో ప్రకృతి సిద్ధమైన అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే ఆహారాన్ని శుద్ధిచేసి నిలువ ఉంచడానికి ఉపయోగించారు. అప్పడాలు, వడియాలు, ఒరుగులు, ఉప్పేరి, పచ్చళ్లు, పిండి వంటలు, తాండ్ర, బెల్లం పాకం, ఔషధాలు... ఇలా వందల రకాలను సంప్రదాయ పద్ధతిలో- ఎలాంటి కృత్రిమ రసాయనాలు లేకుండా- శుద్ధిచేసి నిలువ చేయడం భారతీయ చరిత్రలో భాగం..

'పంచాయతీ పోరు'లో రాజకీయాల జోరు!

తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ పాలకవర్గాల ఎన్నికలకు నగారా మోగింది. అనాదిగా వర్గ రాజకీయాలతో ముడిపడినందున ఒక్కసారిగా పల్లెల్లో రాజకీయ పరిస్థితి మారిపోతోంది. ఎన్నికలకు తెర లేవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయంగా వేడి పుట్టించే వాతావరణం ఏర్పడిందని పేర్కొనవచ్చు. బడా రాజకీయ నేతలకు వ్యూహ,ప్రతి వ్యూహాలు రూపొందించుకోవడానికి, బలమైన అనుచరవర్గం తయారుచేసుకోవడానికి గ్రామ పంచాయతీ ఎన్నికలను ఆయుధంలా వాడుకొనే అవకాశం వుంటుంది.

ఒకప్పుడు గ్రామ సర్పంచులుగా ఎన్నిక కావడం అంటే- ఎంతో హోదా కింద, గౌరవ మర్యాదల కింద భావించేవారు. మొదట గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ఆ తరువాత అంచలంచెలుగా ఎదగాలని ఎందరో నిర్ణయించుకునేవారు. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూడంచెల పంచాయతీ వ్యవస్థ వుండేది. సర్పంచ్‌లుగా గెలిచిన వారిలో ఒకరు సమితి ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యేవారు. అప్పట్లో సమితి ప్రెసిడెంట్ హోదా ఎమ్మెల్యే హోదాకు సమానంగా వుండేది. దాదాపు ఒక అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లతో సమానంగా పంచాయతీ సమితి వుండేది. సమితి ప్రెసిడెంట్లుగా ఎంపికైన వారిలో ఒకరిని జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నుకునేవారు. ఏపీలో ఎన్టీ రామారావు అధికారం చేపట్టాక మండల వ్యవస్థ ప్రారంభమైంది. ఇప్పుడు ఒక సమితి స్థానంలో నాలుగైదు మండల ప్రజాపరిషత్తులు ఏర్పడ్డాయి. సర్పంచ్‌లుగా గెలిచిన వారిలో కొందరు రాజకీయ ప్రస్థానంలో అంచెలంచెలుగా ఎదిగి మంత్రుల స్థాయికి ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రులైన జలగం వెంగళరావు, కోట్ల విజయభాస్కర రెడ్డి లాంటి ప్రముఖులు మొదట సమితి ప్రెసిడెంట్లుగా ఎన్నికైనవారే.

ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు 1985లో 'నూతన పంచాయతీరాజ్ చట్టం' అమలులోకి తీసుకురావడంతో సమితులు రద్దయ్యాయి. చివరిగా సమితి అధ్యక్షుల ఎన్నికలు ఉమ్మడి రాష్ట్రంలో 1980లో జరిగాయి. ఎన్.టి.రామారావు తీసుకొచ్చిన కొత్త పంచాయతీ చట్టంలో కూడా మూడంచెల



పంచాయతీ పోరులో ప్రధాన రాజకీయ పార్టీలు తమ పట్టును నిరూపించుకునేందుకు తపన పడుతున్నాయి. కీలక పంచాయతీల్లో సర్పంచ్ పీఠాలను కైవసం చేసుకునేందుకు ఎంత డబ్బయినా ఖర్చు చేసేందుకు నేతలు వెనుకాడడం లేదు.

పంచాయతీ వ్యవస్థ (సర్పంచ్, మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ అధ్యక్షులు) వున్నప్పటికీ నేరుగా ప్రత్యక్ష ఎన్నికలు ఏర్పాటు చేశారు. వార్డు మెంబర్‌ను, సర్పంచ్‌ను, మండల అధ్యక్షుడిని, జిల్లా పరిషత్ అధ్యక్షుడిని నేరుగా ప్రజలు ఎన్నుకునే విధంగా చట్టంలో మార్పులు చేశారు. ఈ విధంగా 1986లో ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. అప్పట్లో దేవేందర్ గౌడ్ లాంటి నేతలు జిల్లా పరిషత్ చైర్మన్లుగా ఎంపికయ్యారు. ఆ తరువాత ఉమ్మడి రాష్ట్రంలోనే ఐదంచెల పంచాయితీ వ్యవస్థ 1995లో అమలులోకి వచ్చింది. సర్పంచ్‌లతో పాటు ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జిల్లాపరిషత్ చైర్మన్‌లు అంటూ ఐదు విభాగాల వ్యవస్థలు ఏర్పడ్డాయి. ఎంపీటీసీల నుంచి మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడిని, జడ్పీటీసీల నుంచి జిల్లాపరిషత్ చైర్మన్‌ను ఎన్నుకుంటున్నారు. జడ్పీటీసీలు మండల స్థాయిలో ఓటర్ల ద్వారా ఎన్నికవుతున్నారు. చిన్న పంచాయతీ అయితే ఒకరు, పెద్ద పంచాయతీ అయితే ఇద్దరు, ముగ్గురు చొప్పున ఎంపీటీసీలు (2000 నుంచి 3000 మంది ఓటర్లతో) ఎన్నికవుతున్నారు.

గతంలో పంచాయతీలకు ఒక పద్ధతి ప్రకారం కాకుండా ఆరేడు సంవత్సరాలకు ఇంకా పైబడి ఎన్నికలు జరిగేవి. ఇలా 11 సంవత్సరాల సుదీర్ఘ విరామం తరువాత 1980లో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 1987లో ఏడు సంవత్సరాల విరామం అనంతరం ఎన్నికలు జరిగాయి. ఇలా అస్తవ్యస్తంగా ఉన్న పంచాయతీ వ్యవస్థకు రాజ్యాంగ పరిధిలో చట్టభద్రత వుండాలని 1989లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ నూతన పంచాయితీ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలులోకి తెచ్చారు. గ్రామ పంచాయతీలకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎమ్మెల్యే, ఎం.పీ. ఎన్నికల తరహాలో క్రమం తప్పకుండా ఎన్నికలు జరిగే విధంగానూ, సర్పంచ్‌లకే నేరుగా చెక్‌పవర్ వుండాలని, కేంద్రం నుంచి వారి ఖాతాలోకి నేరుగా నిధులు వెళ్లాలని ఆయన భావించారు. ఆ కేటాయింపులకు 'పంచాయతీరాజ్ రోజ్‌గార్ నిధులు' అని పేరుపెట్టారు. రాజీవ్‌గాంధీ ఈ చట్టానికి నాంది పలికి మొదట ఆర్డినెన్స్ తీసుకొచ్చారు. 1992లో పీవీ నరసింహారావు ప్రధాన మంత్రిగా వున్నప్పుడు 73వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ భద్రత ఏర్పడింది.

మొదట్లో సర్పంచ్ పదవిని హోదా కింద భావించినవారు రానురానూ రాజకీయ, వ్యాపార, ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే విధంగా మారారు. ప్రపంచీకరణ ఫలితంగా పల్లెలకు ఆనుకుని జాతీయ రహదారుల వద్ద భూమి విలువ పెరగడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం వృద్ధిచెందడం, కొత్త కొత్త పరిశ్రమలు, కార్పొరేట్ కళాశాలలు రావడం వంటి మార్పులు వచ్చాయి. రియల్ ఎస్టేట్ వెంచర్లకు, పరిశ్రమల యజమానులకు తప్పనిసరిగా గ్రామ పంచాయతీ పాలకవర్గం అనుమతి అవసరం కావడంతో తద్వారా సర్పంచ్‌లకు, ఇతర పాలకవర్గ సభ్యులకు భారీఎత్తున కమీషన్ల రూపంలో ఆదాయం వస్తున్నది. ఇలాగే కొన్ని మేజర్ పంచాయతీల పరిధిలో ఈత, తాటి, చింత వనాలు వుండడం, చేపలు, రొయ్యలు పెంపకానికి కృత్రిమంగా చెరువులు ఏర్పడడం, వాటికి వేలం పాటలు నిర్వహించడంతో పంచాయతీలకు ఆదాయం బాగా పెరిగింది.

గ్రామాల్లో రోడ్లు, వాటర్ ట్యాంకులు, ఇతర సౌకర్యాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ నిధులు, వరల్డ్ బ్యాంక్ నిధులు వస్తుండడంతో వీటి కాంట్రాక్ట్ పనుల ద్వారా సర్పంచులకు, వార్డ్ మెంబర్లకు భారీగా ఆదాయం సమకూరుతున్నది. అందుకే కొన్ని మేజర్ పంచాయతీల్లో ఎన్నికల సందర్భంగా గెలుపుకోసం లక్షలు కోట్లు ఖర్చుపెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయి. గత పంచాయతీ ఎన్నికలు ఉమ్మడి రాష్ట్రంలో 2013లో జరిగాయి. 2007లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తిరుపతి సమీపంలోని తిరుచానూరు, రేణిగుంట, హైదరాబాద్ శివారులోని శంషాబాద్, విజయవాడ, గుంటూరు నగరాల మధ్య వున్న కొన్ని పంచాయతీల్లో, విశాఖ నగరం పరిసరాల్లోని గ్రామాల్లో సర్పంచ్ పదవుల కోసం నేతలు పోటాపోటీగా డబ్బు ఖర్చు చేశారు.

ఇపుడు తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ పోరులో ప్రధాన రాజకీయ పార్టీలు తమ పట్టును నిరూపించుకునేందుకు తపన పడుతున్నాయి. కీలక పంచాయతీల్లో సర్పంచ్ పీఠాలను కైవసం చేసుకునేందుకు ఎంత డబ్బయినా ఖర్చు చేసేందుకు నేతలు వెనుకాడడం లేదు. భవిష్యత్ రాజకీయాలకు పంచాయతీ పదవులు పునాది వంటివని భావిస్తూ గ్రామస్థాయి నాయకులు బరిలోకి దిగుతున్నారు. పంచాయతీల్లో ఎన్నికల కోలాహలం చూస్తుంటే.... జాతిపిత మహాత్మా గాంధీ ఆశించిన 'గ్రామ స్వరాజ్యం' సంగతేమే కానీ, రాజకీయాలు మాత్రం రసకందాయంలో పడ్డాయి.

-తిప్పినేని రామదాసప్ప నాయుడు
99898 18212

తాజా విజయాలతో రాహుల్ దూకుడు!

భారతీయ జనతాపార్టీ పాలనలో ఉన్న మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభు త్వాలను ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీలో ఒక విధమైన నూతన ఆత్మ విశ్వాసం కనిపిస్తున్నది. వాస్తవానికి ఈ మూడు రాష్ట్రాలలో కేవలం ఛత్తీస్‌గఢ్‌లో మాత్రమే కాంగ్రెస్ చెప్పుకోదగిన విజయం సాధించింది. అక్కడ మాత్రమే భాజపా తీవ్ర పరాభవానికి గురైంది. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో ప్రభుత్వాలు ఏర్పాటు చేయగలిగిన పూర్తి ఆధిక్యతను భాజపా పొందలేక పోయింది. ఇక తెలంగాణలో ఎన్నో ఆశలు పెంచుకున్నా, తెలుగు దేశంతో చేతులు కలిపినా కాంగ్రెస్‌కు ప్రయోజనం లేకపోయింది. 2014లో కాంగ్రెస్ పట్ల తీవ్ర వ్యతిరేకత నెలకొన్న సమయంలో కన్నా ఇప్పుడు సీట్లు తక్కువగా వచ్చాయి. మిజోరంలో పదేళ్ల కాంగ్రెస్ పాలనకు తెరపడింది. అయినప్పటికీ, కాంగ్రెస్ వ్యవహారాలపై రాహుల్ పర్యవేక్షణ ప్రారంభమైన తర్వాత- ఒకేసారి మూడు రాష్ట్రాలలో ఆ పార్టీ ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం చెప్పుకోదగిన పరిణామమే.

రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ దాదాపు ఒంటరిగా పోటీ చేసింది. ప్రజా కూటమి పేరుతో బద్ధ కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయాలకు పేరొందిన తెలుగుదేశంతో చేతులు కలిపినా తెలంగాణలో ఫలితం దక్కలేదు. ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన మూడు రాష్ట్రాలలో తాను కోరినన్ని సీట్లు ఇవ్వకపోతే కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లింపవలసి వస్తుందంటూ ఒక వంక బీఎస్పీ అధినేత్రి మాయావతి బెదిరిస్తూ వచ్చారు. అటువంటి సమయంలో ఒంటరిగా ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలగడం రాహుల్ నాయకత్వం స్థిరపడినదని చెప్పడానికి సంకేతం అని భావించాలి.

ఇదివరలో ఎక్కడ కాంగ్రెస్‌కు ఓటమి ఎదురైనా రాహుల్ నాయకత్వానికి పనికిరారని, ప్రియాంకా గాంధీ క్రియాశీల రాజకీయాలలోకి రావాలని ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట కొంతమంది యువకులు ప్రదర్శనలు చేస్తూ ఉండేవారు. కొందరు సీనియర్ నేతలు సహితం అందుకు వంత పాడుతూ ఉండేవారు. కానీ, ఈ పర్యాయం ఎవ్వరూ అటువంటి మాటలు అనకపోవడం గమనార్హం. వాస్తవానికి ప్రియాంకా గాంధీ గతంలో కన్నా ఇప్పుడు కాంగ్రెస్‌లో క్రియాశీల పాత్ర వహిస్తున్నారు. ముఖ్యంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ ముఖ్యమంత్రుల అభ్యర్థులను నిర్ణయించడంలో తల్లి సోనియా గాంధీతో కలసి ఆమె నిర్ణయాత్మక పాత్ర వహించారు. రెండు, మూడు రోజులపాటు వారిని ప్రతిఘటించి, చివరకు వారి మాటలకు రాహుల్ తల వంచవలసి వచ్చింది. గతంలో వలే ఏకపక్షంగా యువనేతలను పార్టీపై రుద్దే ప్రయత్నం రాహుల్ చేయకుండా పార్టీలో ఒక విధంగా ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నం చేస్తున్నారు.

అయిదు రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికల తర్వాత రాహుల్ స్వరంలో కూడా మార్పు వస్తున్నది. రాఫెల్ ఒప్పందంపై గతంలో అవిశ్వాస తీర్మానం సందర్భంగా ప్రధాని మోదీపై దాడి చేసిన రాహుల్, గతంలో కన్నా ఇప్పుడు మరింత దృఢంగా లోక్‌సభలో దాడి చేయడం గమనార్హం. భాజపా వ్యతిరేక పార్టీలతో పొత్తులు ఏర్పాటు చేసుకొనే విషయంలోనూ సమర్ధవంతంగా వ్యవహరిస్తున్నారు. బీజేపీ వ్యతిరేకతను ఓట్లుగా మార్చుకోవాలంటే ఆ పార్టీని ఎవరు ఓడిస్తారన్నది ప్రధానంగా ప్రజలు చూస్తారనే అభిప్రాయానికి ఆయన వచ్చినట్లు కనిపిస్తున్నది. ఇందుకు ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలే ఉదాహరణ. అక్కడ మాజీ సీఎం అజిత్ జోగితో మాయావతి చేతులు కలిపిన తర్వాత వారిద్దరూ కాంగ్రెస్ ఓట్లకు గండి కొడతారని, దాంతో భాజపా ఆ రాష్ట్రంలో సునాయానంగా గెలుస్తుందని అందరూ అంచనాలు వేశారు. అయితే ఆశ్చర్యకరంగా వారిద్దరూ కాంగ్రెస్ ఓట్లను కాకుండా భాజపా ఓట్లను చీల్చారు. భాజపాను ఓడించాలని చూసేవారిని సహితం ఆ పార్టీతో సమానంగా ప్రజలు జతకట్టే ప్రమాదం నున్నట్లు వెల్లడైనది. అందుకనే ఇప్పుడు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, జమ్మూ కశ్మీర్



రాఫెల్ ఒప్పందంపై గతంలో అవిశ్వాస తీర్మానం సందర్భంగా ప్రధాని మోదీపై దాడి చేసిన రాహుల్, గతంలో కన్నా ఇప్పుడు మరింత దృఢంగా లోక్‌సభలో దాడి చేయడం గమనార్హం. భాజపా వ్యతిరేక పార్టీలతో పొత్తులు ఏర్పాటు చేసుకొనే విషయంలోనూ సమర్ధవంతంగా వ్యవహ రిస్తున్నారు. బీజేపీ వ్యతిరేకతను ఓట్లుగా మార్చు కోవాలంటే ఆ పార్టీని ఎవరు ఓడిస్తారన్నది ప్రధానంగా ప్రజలు చూస్తారనే అభిప్రాయానికి ఆయన వచ్చినట్లు కనిపిస్తున్నది. ఇందుకు ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలే ఉదాహరణ. అక్కడ మాజీ సీఎం అజిత్ జోగితో మాయావతి చేతులు కలిపిన తర్వాత వారిద్దరూ కాంగ్రెస్ ఓట్లకు గండి కొడతారని, దాంతో భాజపా ఆ రాష్ట్రంలో సునాయానంగా గెలుస్తుందని అందరూ అంచనాలు వేశారు. అయితే ఆశ్చర్యకరంగా వారిద్దరూ కాంగ్రెస్ ఓట్లను కాకుండా భాజపా ఓట్లను చీల్చారు.

వంటి కొన్ని రాష్ట్రాలలో మినహా దేశం అంతా దాదాపుగా ఒంటరిగా కాంగ్రెస్ పోటీ చేస్తుందనే సంకేతాన్ని రాహుల్ ఇస్తున్నారు.

మొదటగా పశ్చిమ బెంగాల్ విషయంలో నెలకొన్న అస్పష్టతకు తెరతీశారు. అక్కడ మమతా బెనర్జీతో పొత్తు కోసం తీవ్ర ప్రయత్నం చేశారు. వాస్తవానికి ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు సిపిఎంతో పొత్తుకు సిద్ధపడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో సిపిఎంతో సీట్లను సర్దుబాటు చేసుకొని అతిపెద్ద ప్రతిపక్షంగా కాంగ్రెస్ నిలబడగలిగింది. అయితే కాంగ్రెస్‌కు ఒక్క లోక్ సభ సీటు ఇవ్వడానికి కూడా మమత ఇష్టపడటం లేదు. కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకోకుండా చేయాలని ఒక వంక మమతా బెనర్జీ, మరోవంక మాయావతి పట్టుదలగా ఉన్నట్లు స్పష్టం అవుతున్నది. ఎట్లాగూ బిజెపి పూర్తి మెజారిటీ సీట్లు పొందలేదని, కాంగ్రెస్ కూడా కోలుకోలేని పక్షంలో బిజెపి, కాంగ్రెస్‌లలో ఎవరో ఒకరు బయట నుండి మద్దతు ఇస్తే తాము ప్రధాన మంత్రి పదవి చేపట్టవచ్చని మమత, మాయావతి కలలు కంటున్నారు. అందుకనే వారిద్దరి పట్ల బతిమాలే ధోరణి అవసరంలేదని నిర్ణయానికి రాహుల్ వచ్చినట్లు కనిపిస్తున్నది.

జాతీయ స్థాయిలో నరేంద్ర మోదీని ఢీకొనగల నేతగా గుర్తింపు పొంద గలిగితే పలు రాష్ట్రాలలో మద్దతు పొందటం సులభం కాగలదన్న ఆలోచనలో రాహుల్ ఉన్నారు. దాంతో పశ్చిమ బెంగాల్ లో ఒంటరిగా అన్ని సీట్లకు పోటీ చేయడానికి సిద్ధపడమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు సూచించారు. అక్కడ సిపిఎం బాగా బలహీన పడిందని, ఆ పార్టీతో పొత్తు వల్లన ప్రయోజనం లేదనే అభిప్రాయానికి కూడా వచ్చారు. మరోవంక వామపక్షాలు కూడా కాంగ్రెస్‌తో పొత్తు కారణంగా తమ ఉనికిని కోల్పోతున్నామని భావిస్తున్నారు. సొంతంగానే ఎక్కువ సీట్లు గెలుపొందగలమనే విశ్వాసం ఇప్పుడు ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలలో వెల్లడి అవుతున్నది.

ఉత్తర ప్రదేశ్‌లో కూడా అటువంటి పరిస్థితులే నెలకొన్నాయి. రాహుల్ గాంధీ పట్ల అఖిలేశ్ యాదవ్ కొంత సానుకూలంగా ఉన్నప్పటికీ, మాయావతి మాత్రం మాట్లాడకుండా అతనిని కట్టడి చేస్తున్నారు. దాంతో ప్రస్తుతం సోనియా, రాహుల్ ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు నియోజకవర్గాలను మాత్రమే వదిలివేసి, మిగిలిన చోట్ల తామే పోటీ చేయాలని మాయావతి భావిస్తున్నారు. ఆర్ఎల్‌డీ అధినేత అజిత్ సింగ్‌తో పొత్తుకు సిద్ధమై మూడు సీట్లు వదలడానికి మాత్రం సిద్ధంగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలలో నిర్ణయాత్మక పాత్ర వహించగల ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ కు స్థానం లేకుండా చేయడం ద్వారా ప్రధాన మంత్రి పదవి పోటీలో రాహుల్‌కు అవకాశం లేకుండా చేయాలని మాయావతి భావిస్తున్నారు. కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తే బిజెపికి అండగా ఉంటున్న బ్రాహ్మణులు, మరికొందరు అగ్రవర్ణాల వారు కాంగ్రెస్ వైపు మారతారని, తద్వారా భాజపాను నిలువరించగలమని ఛత్తీస్‌గఢ్ లో వలే ఆలోచనలు చేస్తున్నారు. కానీ రాజకీయాలలో సాధారణ గణాంకాలు పనిచేయబోవని గ్రహించలేక పోతున్నారు. అందుకనే మౌనంగా మాయావతి, మమతలను దెబ్బకొట్టే విషయమై రాహుల్ ఆలోచనలు చేస్తున్నారు. ముందుగా పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయడం పట్ల ఆయన దృష్టి సారిస్తున్నారు. వీటితోపాటు పంజాబ్, ఒడిశా, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలలో కూడా కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయవలసిందే. అన్నింటికన్నా ఆశ్చర్యకరం తెలుగుదేశంతో కొత్తగా కుదిరిన స్నేహం ముందుకు వెళ్లే అవకాశం కనబడటం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సైతం ఒంటరిగా పోటీ చేయడం పట్లనే కాంగ్రెస్ దృష్టి సారిస్తున్నది.

మహారాష్ట్రలో కాంగ్రెస్‌తో పొత్తు పట్ల ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ఎక్కువ పట్టుదలగా ఉన్నారు. ఇప్పటికే 40 సీట్లకు సంబంధించి ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక అవగాహనకు వచ్చాయి. మిగిలిన 8 సీట్లను చిన్న చిన్న పార్టీల కోసం ఎదురు చూస్తూ ఆపారు. ఇక కర్ణాటకలో కాంగ్రెస్ లోని అసమ్మతిని ఆసరాగా చేసుకొని సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చి వేయడం కోసం బీజేపీ, ఎలాగైనా ముఖ్యమంత్రి కావాలని ఆదుర్దాలో ఉన్న బిఎస్ యడ్యూరప్ప చేయని ప్రయత్నం లేనే లేదు. అయినా అక్కడ భాజపా ఎత్తుగడలు సాగడం లేదు. ప్రభుత్వ సుస్థిరతకు భంగం ఏర్పడటం లేదు.

రాహుల్ గాంధీ రాఫెల్ విమానాల ఒప్పందంపై మాట్లాడుతూ ఉంటే సమాధానం చెప్ప వలసిన ప్రధాన మంత్రి మోదీ, రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ బదులు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి ఆ బాధ్యత అప్పచెప్పడం ద్వారా పరోక్షంగా రాహుల్ గాంధీలో ఆత్మవిశ్వాసం పెంచేందుకు దోహదపడ్డారని చెప్పవలసి ఉంది. రాఫెల్ ఒప్పందంపై రాహుల్ గాంధీ నిర్దిష్టంగా కొన్ని ప్రశ్నలు అడిగారు. వాటికి నేరుగా సమాధానం చెప్పకుండా జైట్లీ ఎదురు దాడి చేశారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన కుంభకోణాలను ఏకరువు పెట్టారు.

కాంగ్రెస్ పాలనకు తిరస్కార పూర్వకంగానే ప్రజలు మోదీకి పట్టం గట్టారు. ఇప్పుడు తిరిగి మోదీ వ్యతిరేకతతో నాయకుడిగా ఎదిగే అవకాశాన్ని రాహుల్ గాంధీ పొందుతున్నారు. ప్రధాన మంత్రి మోదీ తొలిసారిగా ఈనెల 1వ తేదీన సవివరంగా పలు క్లిష్టమైన అంశాలపై ఓ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. అయితే ఆయా అంశాలపై ఆయన పార్లమెంట్‌లో గాని, చివరికి బిజెపి వేదికలపైన గాని, కనీసం మంత్రి వర్గ సమావేశంలో గాని చర్చించడానికి సిద్ధంగా ఉన్నారా? వీడియో కాన్ఫరెన్స్ లో పార్టీ కార్యకర్తలు అమాయకంగా అడిగే ప్రశ్నలకు సహితం భయపడే పరిస్థితి ఎందుకు ఏర్పడుతున్నది ? మొత్తం బిజెపి నాయకత్వం ఆలోచించుకో వలసిన అంశం ఇది.

రాహుల్ గాంధీ ఇప్పుడు ప్రధాని కాలేక పోవచ్చు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ నేతలు చేసిన తప్పిదాలను ఆయన తన తలపై మోస్తూ దేశంలో మరే నేత ఎదుర్కొనని ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అయితే- తన బలహీనతలు, తన పార్టీ పొరపాట్లను గ్రహించి, నిజాయితీతో మార్పు కోసం ప్రయత్నం ఆయన చేస్తున్నారని చెప్పవచ్చు.


-చలసాని నరేంద్ర

ఇద్దరు 'చంద్రులు' కలిస్తే అద్భుతమే!

రాబోయే లోక్‌సభ ఎన్నికల తర్వాత మన దేశానికి ప్రధాని ఎవరు? నరేంద్ర మోదీ కాకుంటే- ఆ పీఠాన్ని ఎక్కేదెవరని యావత్ భారత దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన మన దేశంలో ఇప్పటికీ రెండే రెండు ప్రధాన పార్టీలు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి నుంచి రాహుల్ గాంధీ, భాజపా నాయకత్వంలోని ఎన్డీఏ శిబిరం నుంచి నరేంద్ర మోదీ ప్రధాని పదవి కోసం ప్రస్తుతం పోటీలో ఉన్నట్టు అంతా భావిస్తున్నారు. ప్రస్తుత ప్రధాని మోదీ మళ్లీ పగ్గాలు చేపట్టడం ఖాయమని భాజపా ధీమాగా ఉంది. ఇటీవల ఎన్డీఏ కూటమి నుండి నిష్క్రమించిన తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టడం అనూహ్య రాజకీయ పరిణామాలకు నాంది పలికింది. గత నెలలో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కలసి పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కూటమి రాబోయే లోక్‌సభ ఎన్నికల వరకూ కొనసాగుతుందా? లేదా? అన్న చర్చ ఇపుడు ఊపందుకొంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాకూటమి ఏర్పాటు చేసేందుకు చంద్రబాబు పావులు కదుపుతున్నారు.

ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిచిన తెరాస అధినేత కేసీఆర్ సైతం జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు కోసం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారు. కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వంలో తాము కీలకపాత్ర పోషించడం ఖాయమని ఆయన అంటున్నారు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలను ఏకం చేసి కొత్తఫ్రంట్ ఏర్పాటు చేయాలన్నది కేసీఆర్ సంకల్పం. కాంగ్రెస్సేతర, భాజపాయేతర పార్టీలతో కూటమిని ఏర్పాటు చేసి కేంద్రంలో అధికారం దక్కించుకోవాలన్నది ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. తెలంగాణలో గత నాలుగున్నరేళ్ల కాలంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలపై ఇతర రాష్ట్రాలు సైతం ఆసక్తిని చూపుతున్నాయి. రైతుబంధు పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని కేసీఆర్ చెబుతుండడంతో తెరాస పాలనను మిగతా రాష్ట్రాలు సైతం గమనిస్తున్నాయి. కాంగ్రెస్, తెదేపా, భాజపా, వామపక్షాలను ఓడించి భారీ మెజారిటీతో కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావడంతో జాతీయ రాజకీయాల్లో ఇక తెరాస కీలకపాత్ర వహించగలదన్న ఊహాగానాలు జోరందుకున్నాయి.





ప్రస్తుత రాజకీయాలను గమనిస్తే తెలుగు రాష్ట్రాల నుంచి కేసీఆర్, చంద్రబాబు జాతీయ రాజకీయాల్లో సత్తా చాటేందుకు ఇపుడు వ్యూహరచన చేస్తున్నారు. భిన్నధృవాలుగా ఉన్న ఈ ఇద్దరు నేతలూ ఒక్కటైతే తెలుగు ప్రజలు జాతీయ రాజకీయాలను శాసించే పరిస్థితి రావడం ఖాయం. దక్షిణ భారతానికి మరోసారి ప్రధాని పీఠం దక్కాలంటే ముఖ్యమంత్రులిద్దరూ ఐక్యంగా పనిచేయాలి.

తెరాస పార్టీ పగ్గాలను తన కుమారుడు కేటీఆర్‌కు అప్పగించి, జాతీయ రాజకీయాలపై దృష్టి సారించేందుకు కేసీఆర్ సమాయత్తం కావడం గమనార్హం. ఇప్పటికే ఆయన వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ పలు ప్రాంతీయ పార్టీల నేతలతో చర్చలు ప్రారంభించారు.

దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత ఉత్తర భారతదేశానికి చెందిన నాయకులే ఎక్కువగా ప్రధాని పీఠాన్ని అధిష్ఠించారు. దక్షిణ భారతం నుంచి అందునా తెలంగాణ ప్రాంతానికి చెందిన పీవీ నరసింహారావు మాత్రమే అనుకోని రీతిలో ప్రధానమంత్రి పదవిని చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రాభవం క్రమేణా తగ్గడంతో తెలుగు ప్రజలు ప్రాంతీయ పార్టీలకే పట్టం గడుతున్నారు. సినీనటుడు ఎన్టీ రామారావు అలనాడు తెలుగుదేశం పార్టీని స్థాపించి కొన్ని నెలల వ్యవధిలోనే అధికారం చేపట్టారు. జాతీయ రాజకీయాల్లోనూ ఆయన చక్రం తిప్పారు. ఎన్టీఆర్ తర్వాత 1996లో చంద్రబాబు నాయుడు జాతీయ స్థాయిలో పార్టీలను కూడగట్టడంలో విజయం సాధించారు. రాజకీయంగా ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా సరే తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంటూ చంద్రబాబు ముందుకు వెళతారు. రాజకీయంగా ఒడిదుడుకులు లేకుంటే గతంలో ఎన్టీఆర్ ప్రధాని అయ్యేవారని విశ్లేషకులు చెబుతుంటారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశిస్తే గనుక చంద్రబాబుకు భవిష్యత్‌లో ఉన్నత పదవులు దక్కే అవకాశాలున్నాయి. ఇక, రెండుసార్లు ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన వైఎస్ రాజశేఖర రెడ్డి కూడా విశేష జనాదరణ ఉన్న నేత. అకాల మరణం పొందక ఉంటే ఆయన కూడా జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి ఉండేవారు. ప్రస్తుత రాజకీయాలను గమనిస్తే తెలుగు రాష్ట్రాల నుంచి కేసీఆర్, చంద్రబాబు జాతీయ రాజకీయాల్లో సత్తా చాటేందుకు ఇపుడు వ్యూహరచన చేస్తున్నారు. భిన్నధృవాలుగా ఉన్న ఈ ఇద్దరు నేతలూ ఒక్కటైతే తెలుగు ప్రజలు జాతీయ రాజకీయాలను శాసించే పరిస్థితి రావడం ఖాయం. దక్షిణ భారతానికి మరోసారి ప్రధాని పీఠం దక్కాలంటే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరూ ఐక్యంగా పనిచేయడం అవసరం అన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ అవకాశాన్ని జారవిడుచుకొంటే ప్రధాని పదవి దక్షిణ భారతానికి దక్కడం ఇప్పట్లో సాధ్యం కాదని చెప్పొచ్చు.

-డా. పోలం సైదులు 94419 30361

శాంతించని శబరిమల

- కొనసాగుతున్న ఆందోళనలు
- పలుచోట్ల బాంబు దాడులు
- అయ్యప్పను దర్శించుకున్న శ్రీలంక మహిళ!
- గర్భగుడిలోకి రాలేదన్న అధికార వర్గాలు



అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులు

శబరిమల, జనవరి 4: సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కేరళకు చెందిన ఇద్దరు మహిళలు బుధవారం అయ్యప్ప గర్భగుడిలో పూజలు చేసిన విషయం మరువకముందే శ్రీలంకకు చెందిన ఒక మహిళ సైతం అయ్యప్పస్వామిని దర్శించుకుంది. లంకకు చెందిన 47 ఏళ్ల వయసు కలిగిన శశికళ తన భర్త శరవణన్, కుమారుడు దర్శన్‌తో కలిసి అయ్యప్ప స్వామిని గురువారం రాత్రి దర్శించుకున్నట్టు తెలుస్తోంది. ఇద్దరు కేరళ మహిళలు అయ్యప్ప గర్భగుడిలో కొద్దిరోజుల కిందట పూజలు చేయడంతో సంచలనం సృష్టించగా, ఆ తర్వాత పూజారులు ఆలయాన్ని సంప్రోక్షణ చేసిన విషయం తెలిసిందే.

అయ్యప్ప ఆలయ గర్భగుడిలో ఇద్దరు మహిళలు ప్రవేశించినట్టు మీడియా ద్వారా వెల్లడి కావడంతో ఒకవైపు భక్తులు, మరోవైపు బీజేపీ తదితర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతోపాటు వేలాది మంది ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో హింసాత్మక సంఘటనలతోపాటు కొన్నిచోట్ల బాంబు దాడులకు కూడా జనం తెగబడుతున్నారు. శ్రీలంక మహిళ శశికళ గురువారం రాత్రి ఆ అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించి పూజలు చేసిన విషయం వాస్తవమని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. సీసీ టీవీల్లో సైతం శ్రీలంక మహిళ శశికళ ఆలయంలోకి ప్రవేశించినట్టు కనబడుతుండ విషయాన్ని సంబంధిత అధికార వర్గాలు సైతం ధృవీకరించాయి. ఆ తర్వాత పోలీసులు సైతం శశికళ ఆలయ దర్శనంపై ఒక స్పష్టమైన ప్రకటన చేసినా ఆమె 18 మెట్లు కలిగిన పడినెట్టంబాడిని ఎక్కి గర్భగుడిలోకి ప్రవేశించారో లేదో స్పష్టంగా తెలియడంలేదు. అయితే, తాను అయ్యప్ప గర్భగుడిలోకి ప్రవేశించిన విషయాన్ని శుక్రవారం సదరు మహిళ సైతం ధృవీకరించారు.

ఆలయంలో శుక్రవారం ఉదయం పూజలు చేసేందుకు తనకు అనుమతించలేదని శశికళ పంబాలో మీడియా ప్రతినిధులకు చెప్పింది. ఇదిలావుండగా, శ్రీలంక మహిళ శశికళ అయ్యప్ప గర్భగుడిలోకి వెళ్లారా లేదా అన్న విషయమై సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు పీటీఐ ప్రతినిధి ప్రయత్నించగా సన్నిధానం కాంప్లెక్స్‌కు ఇన్‌చార్జిగా ఉన్న కన్నూర్ ఐజీ బల్‌రామ్ కుమార్ అందుబాటులో లేరు. ఇదిలావుండగా, ఒక మహిళ ఇరుముడితో, రెండు సాధారణ దుస్తులతో పోలీసుల సహాయంతో ఆలయంలోకి ప్రవేశించినట్టు కొన్ని టీవీ చానెళ్లు గురువారం రాత్రి సంబంధిత ఫొటోలను విడుదల చేశాయి. పోలీసుల రక్షణతో ఆలయంలోకి వెళ్తున్న శశికళకు భక్తుల నుంచి ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో అయ్యప్ప భక్తురాలిగా ఆలయంలోకి వెళ్లగలిగానని, కానీ అయ్యప్ప విగ్రహం వద్దకు వెళ్లేందుకు నిరాకరించారని, అయినా తాను భయపడలేదని ఆలయ దర్శనం తర్వాత పంబాకు తిరిగి వచ్చిన తర్వాత మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తెలిపింది. 'నేను 41 రోజుల పాటు దీక్ష చేపట్టాను. అలాంటి నన్ను ఎందుకు లోనికి అనుమతించరు. నా దుస్తులు ఎందుకు ఇంతమంది భక్తులు గుమికూడారు. నేను ఎవరికీ భయపడను. అయ్యప్పే నాకు వీటన్నిటికీ సమాధానం చెప్పాలి. నేనెవరో పోలీసులకు తెలుసు' అని శశికళ తెలిపింది. కాగా, శశికళ భర్త శరవణన్ మాట్లాడుతూ తన కుమారుడితో కలిసి ఆలయంలో పూజలు చేసినట్టు తెలిపాడు. ఇదిలావుండగా, తగిన పోలీస్ సెక్యూరిటీ ఉండటం వల్లే శశికళ అలాంటి వ్యాఖ్యలు చేసిందని, కానీ ఆమె ఆలయంలో పూజలు చేయలేదని సంబంధిత అధికార వర్గాలు పేర్కొన్నాయి. కాగా, పంబా నుంచి శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో కాయల్ అనే పేరు కలిగిన ట్రాన్స్‌జెండర్ ఆలయంలోకి ప్రవేశించబోగా భక్తులు ఆందోళన చేయడంతో ఆమెను పోలీసులు అనుమతించలేదు. పురుషుల మాదిరిగానే ఇరుముడితో, దుస్తులు ధరించి ఆమె వచ్చింది.

పనిచేయని పంపుసెట్లు

పురోగతి పూజ్యం

మేఘాలయ గని వద్ద ఆపరేషన్ ❖ రంగంలోకి కోల్ ఇండియా-కిర్లోస్కర్



మేఘాలయలో 15మంది చిక్కుకుపోయిన గని ఇదే (ఫైల్ ఫొటో)

షిల్లాంగ్, జనవరి 4: మేఘాలయ భూగర్భ గనుల్లో చిక్కుకుపోయిన 15 మందిని వెలికితీయడానికి అధికారులు శుక్రవారం నాడు విఫల యత్నం చేశారు. ప్రమాదం జరిగి 23 రోజులు అవుతున్నా సహాయ కార్యక్రమాల్లో ఆశించిన పురోగతి కనిపించలేదు. భూగర్భ గనుల్లో చిక్కుకుపోయిన వారి కోసం అధికారులు హైపవర్ పంపులు సెట్లు రప్పించారు. 13 పంపుసెట్లలో కేవలం మూడింటిని మాత్రం ప్రమాద స్థలిలో వినియోగించగలిగారు. అది కూడా పూర్తిగా కాదు. మరో మూడు పంపుసెట్లను లోపలకు దించే ప్రయత్నం చేస్తున్నట్టు ఆపరేషన్ అధికార ప్రతినిధి ఆర్ సుసాంగి వెల్లడించారు. గనుల్లోంచి నీరుతోడేందుకు కోల్ ఇండియా, కిర్లోస్కర్ బ్రదర్ సంయుక్తంగా పనిచేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. మేఘాలయలోని ఈస్ట్ జైంటియా జిల్లా లుంథారీ గ్రామంలోని అక్రమ గనుల్లో గత నెల 13న ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమీపంలోని నది నుంచి నీళ్లు గనుల్లోకి ఊరినట్టు సుసాంగి చెప్పారు. ప్రమాద స్థలికి దగ్గర్లో ఓ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసి సబ్‌మెర్సిబుల్ పంపుదించడానికి కోల్ ఇండియా ప్రయత్నాలు ప్రారంభించింది. కిర్లోస్కర్ బ్రదర్స్ కంపెనీ బృందం కూడా మరో ప్లాట్‌ఫామ్ నుంచి నీటిని పంప్ చేయడానికి కృషి చేస్తోందని ఆపరేషన్ ప్రతినిధి తెలిపారు. వరుసగా 23వ రోజూ సహాయ కార్యక్రమాలు కొనసాగించారు. మెయిన్ షాఫ్ట్ నుంచి నీరు తోడగలిగారు కానీ, 15 మందిని వెలికితీయడం సాధ్యపడలేదు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, నేవీ గజ ఈతగాళ్లు ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. ఒడిశా అగ్నిమాపక విభాగం నుంచి తీసుకొచ్చిన మూడు పంపులను బుధవారం వినియోగించి కొంత పురోగతిని సాధించారు. ఇలా ఉండగా గని ప్రమాదంపై సుప్రీం కోర్టు గురువారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

సహాయ కార్యక్రమాలు సంక్లిష్టం

మేఘాలయ గనిలో చిక్కుకుపోయిన 15 మందిని రక్షించేందుకు చేపట్టిన సహాయ కార్యక్రమాలు సంక్లిష్టంగా మారాయని సుప్రీం కోర్టుకు కేంద్రం వివరించింది. అలాగే మేఘాలయాలోని అక్రమ గనులకు సంబంధించి ఎలాంటి బ్లూప్రింట్ లేదని పేర్కొంది. జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనానికి కేంద్రం తన వివరణ ఇచ్చింది. నది సమీపంలో గని ఉండడం వల్ల నీళ్లు ప్రవేశించి ప్రమాదం చోటుచేసుకుందని ప్రభుత్వం తెలిపింది. ప్రమాదం జరిగి 23 రోజులైనా ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదని బెంచ్ అసంతృప్తి వ్యక్తం చేసింది.

ఆపరేషన్ పురోగతిపై ఈనెల 7న నివేదిక ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీం కోర్టు ఆదేశించింది. కేంద్ర, రాష్ట్ర సంస్థలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. ప్రమాదం జరిగిన గని చిట్టడవిలో ఉందని, అక్రమ గనికి సంబంధించి బ్లూప్రింట్ లేనందున సహాయ కార్యక్రమాలకు అవరోధంగా ఉందని ఆయన చెప్పారు.

లాలూ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

రాంచి, జనవరి 4: కోట్ల రూపాయల దాణా కుంభకోణానికి సంబంధించి జైలు శిక్ష అనుభవిస్తున్న ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ బెయిల్ పిటిషన్‌కు సంబంధించిన తీర్పును ఝార్ఖండ్ హైకోర్టు శుక్రవారం రిజర్వ్‌లో పెట్టింది. కేసుకు సంబంధించి సీబీఐ, పిటిషనర్ల తరఫున న్యాయవాదుల వాదనలు విన్న జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తన తీర్పును రిజర్వ్‌లో ఉంచారు. అంతకుముందు బెయిల్‌కు సంబంధించి డిసెంబర్ 21న కేసు బెంచి మీదకు రాగా, దానిని జనవరి నాలుగుకు వాయిదా వేశారు. బుధవారం లాలూ ప్రసాద్ తరపున కోర్టుకు హాజరైన ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ నేత కపిల్ సిబాల్ తన వాదన వినిపిస్తూ లాలూ ఆరోగ్యం బాగా లేదని, అంతేకాకుండా ఆర్‌జేడీ పార్టీ అధ్యక్షుడిగా వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పొత్తులు, ఎన్నికల గుర్తుకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకోవడానికి ఆయన అవసరం ఉన్నందున బెయిల్ మంజూరు చేయాలని కోరారు. సీబీఐ తరపున రాజీవ్ కుమార్ తన వాదన వినిపిస్తూ లాలూకు ఈ కేసుల్లో రెగ్యులర్ బెయిల్ ఇవ్వరాదని పేర్కొంటూ, ఇదే కేసుకు సంబంధించి గతంలో ఆయనకు బెయిల్ నిరాకరించిన విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాకుండా రాంచిలోని రాజేంద్రనగర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో అతనికి చికిత్స జరుగుతున్నందున ఈ పరిస్థితిల్లో అతనికి బెయిల్ మంజూరు చేయరాదని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి తీర్పును రిజర్వ్ చేశారు. కాగా, 900 కోట్ల రూపాయల దాణా కేసులో పశుసంవర్థక శాఖ ద్వారా నిధులను దారిమళ్లించి కోట్లాది రూపాయల అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణపై అప్పట్లో బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్న లాలూప్రసాద్‌పై పెట్టిన కేసు రుజువు కావడంతో ఆయనకు జైలు శిక్ష పడింది. దీంతో డిసెంబర్ 2017 నుంచి ఆయన రాంచి జైలులో ఉన్నారు.


గత ఐదేళ్లలో దేశం నుంచి 27మంది ఆర్థిక నేరగాళ్లు పరార్

లోక్‌సభలో కేంద్ర సహాయ మంత్రి శుక్లా వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 4: గత ఐదు సంవత్సరాలుగా 27 మంది పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నేరగాళ్లు దేశాన్ని వదలి పారిపోయారని శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్ర సహాయమంత్రి వెల్లడించారు. వీరిలో 20మందికి రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేసేందుకు తమ ప్రభుత్వం ఇంటర్ పోల్‌ను ఆశ్రయించిందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివప్రతాప్ శుక్లా రాతపూర్వకంగా సభకు తెలియజేశారు. ఇప్పటికే ఎనిమిది మందికి రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయగా, ఆరుగురిని తమకు అప్పగించాలంటూ ఆయా దేశాలను కోరినట్టు ఆయన చెప్పారు. ఇటీవల తీసుకువచ్చిన ఫ్యుజిటివ్ అఫెండర్స్ చట్టం 2018ప్రకారం 27 మందిలో ఏడుగురిపై కేసు నమోదైందన్నారు. మనదేశంలో ఆర్థిక నేరాలకు పాల్పడి విదేశాలకు పరారైన విజయ్ మాల్యాను లండన్ నుంచి భారత్ పంపించాలని లండన్‌లోని వెస్టుమినిస్టర్స్ కోర్టు ఇటీవలే సిపార్సు చేసిందని ఆయన వివరించారు. 50 కోట్ల కన్నా ఎక్కువ రుణం మంజూరు చేసేటప్పుడు ఆయా కంపెనీ ప్రమోటర్స్/డైరెక్టర్స్, ఇతర అధికార హోదాలో ఉన్న వ్యక్తుల పాస్‌పోర్టు సర్టిఫైడ్ కాపీలను తీసుకోవాలని ప్రభుత్వ రంగ బ్యాంకులు తాము సూచించినట్టు శుక్లా తెలిపారు.

అధికారంలోకి వస్తే 'రాఫెల్' పై క్రిమినల్ దర్యాప్తు

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ, జనవరి 4: తాము కనుక అధికారంలోకి వస్తే వేల కోట్ల రూపాయల అవినీతితో కూడికుని ఉన్న రాఫెల్ ఒప్పందంపై క్రిమినల్ దర్యాప్తును చేపట్టి నిందితులను శిక్షిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పార్లమెంట్ వెలుపల శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాఫెల్ ఒప్పందానికి సంబంధించి తాము రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామ్‌కు పలు ప్రశ్నలు సంధించామని, అయినా వాటికి సమాధానాలు చెప్పకుండా ప్రధాని నరేంద్రమోదీ చర్చల నుంచి పారిపోతున్నారని ఆరోపించారు. తామే కనుక వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే కచ్చితంగా దీనిపై క్రిమినల్ దర్యాప్తు నిర్వహిస్తామని, దీనిలో దోషులైన వారిని శిక్షించడం ఖాయమని అన్నారు. రాఫెల్ ఒప్పందంపై దర్యాప్తు చేయడం తమ పని, పరిధిలోనిది కాదని ఇటీవల సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసిందే తప్ప దానిపై దర్యాప్తు జరపరాదని ఎక్కడా పేర్కొనలేదని గుర్తు చేశారు. రాఫెల్‌పై లేవనెత్తిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాలని తాము, విపక్ష నేతలు ప్రధాని తరఫున సమాధానం చెప్పే రక్షణ మంత్రి సీతారామన్‌ను కోరుతున్నామన్నారు.

శక్తివంతమైన అతి పెద్ద చైనా బాంబు

❖ అమెరికా బాంబు కంటే పవర్‌ఫుల్ ❖ ప్రయోగం విజయవంతం
❖ నారింకో వెబ్‌సైట్‌లో వీడియో క్లిప్పింగ్‌లు



బీజింగ్, జనవరి 4: చైనా అత్యంత శక్తివంతమైన బాంబును ఆధునిక టెక్నాలజీ సహాయంతో రూపొందించింది. ఇంతకాలం అమెరికా తయారు చేసిన ప్రపంచంలోనే అతి పెద్ద బాంబు శక్తిని చైనా బాంబు అధిగమించిందని చైనా మీడియా పేర్కొంది. చైనా రక్షణ పరిశ్రమ నోరింకో ఈ ఏరియల్ బాంబును ప్రదర్శించింది. మొదటి న్యూక్లియార్‌యేతర బాంబు అని రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. దీనిని మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్‌ని ఈ వివరాలను ప్రచురించిన గ్లోబల్ టైమ్స్ మీడియా తెలిపింది. న్యూక్లియార్ బాంబు తర్వాత అత్యంత శక్తివంతమైన బాంబని, దీనిని నిర్దిష్ట లక్ష్యంపైన జారవిడిస్తే భారీ ఎత్తున నష్టం సంభవిస్తుంది. ఈ బాంబును హెచ్-6కే బాంబర్ ద్వారా ప్రయోగాత్మకంగా జారవిడిచి చేసిన ప్రయోగం విజయవంతమైంది. చైనా నార్త్ ఇండస్ట్రీస్ గ్రూప్ కార్పోరేషన్ లిమిటెడ్ ఈ బాంబునుజారవిడిచిన దృశ్యాల క్లిప్పింగ్‌లను విడుదల చేశారు. మొదటిసారిగా ఈ బాంబు ప్రయోగం దృశ్యాలను విడుదల చేశారు. గత ఏడాది ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా ఉగ్రవాదులపై జీబీయూ 43/బీ మాసివ్ ఆర్డనెన్స్ ఎయిర్ బ్లాస్టు బాంబును జారవిడిచింది. ఈ బాంబును ప్రయోగిస్తే భవనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాగా అమెరికా బాంబు కంటే చైనా బాంబు తేలికైనదని, సులువుగా రవాణా చేయవచ్చని చైనా తెలిపింది. అమెరికా బాంబును తరలించేందుకు భారీ రవాణా వాహనం కావాల్సి ఉంటుందన్నారు.

బడుగువర్గాల అభివృద్ధితోనే మళ్లీ అధికారం

లోక్ సభలో టీఆర్ఎస్ పక్షనేత జితేందర్ రెడ్డి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ,జనవరి 4: తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు రైతులు, విద్యార్థులు, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి లక్ష్యంగా పని చేశారని, అందుకే రాష్ట్ర ప్రజలు మరోసారి అధికారం కట్టబెట్టారని టీఆర్ఎస్ పక్షం నాయకుడు ఏపీ జితేందర్ రెడ్డి శుక్రవారం లోక్‌సభ జీరో అవర్‌లో వ్యాఖ్యానించారు. అధికార, ప్రతిపక్షం సభ్యులు ప్రతి రోజు లోక్‌సభలో గొడవ పడడం, పరస్పరారోపణలు చేసుకుంటూ సభను స్తంభింపజేయడం గురించి ఆయన స్పందించారు. 'మీరిలా కొట్టుకుంటే ప్రజలు మిమ్మల్ని గెలిపించరు. కేసీఆర్ మాదిరిగా ప్రజా సంక్షేమం కోసం పని చేస్తే గెలుస్తారు' అన్నారు. అధికార, ప్రతిపక్షాలు పరస్పరం తిట్టుకుంటూ ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదని జితేందర్ రెడ్డి ఆరోపించారు. అధికార, ప్రతిపక్షాలను ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఇలా చేస్తున్నాయని ఆరోపించారు. ఎంపీలు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నట్టు చెప్పారు. రైతుల ప్రయోజనాలను కాపాడడం, ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం, యువతకు ఉపాధి కల్పించడం, బడుగు, బలహీన వర్గాలకు సాధికారిత కల్పించడం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై దృష్టి పెట్టడం పార్లమెంటు సభ్యుల కనీస ధర్మమన్నారు. కానీ, మనం మన విధులను నిర్వహించకుండా గొడవలు సృష్టిస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి చేసే వారికి మాత్రమే ఓటు వేస్తారనేది తెలంగాణ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో నిరూపించారని జితేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజలు రెండు జాతీయ పార్టీలను మట్టి కరిపించి టీఆర్ఎస్‌ను గెలిపించారని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం 58 లక్షల మంది రైతులకు ఎకరానికి నాలుగు వేల రూపాయల చొప్పున రాయితీ ఇచ్చిందని అన్నారు. ఈ దశలో స్పీకర్ సుమిత్రా మహాజన్ జోక్యం చేసుకుని రాఫెల్ గురించి మాట్లాడకుండా ఇతరత్రా అంశాలను ప్రస్తావించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ, జితేందర్ రెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, తమ ప్రభుత్వం రైతులకు ఇరవై నాలుగు గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నదని అన్నారు. మిషన్ భగీరథ పథకం కింద ఆరువేల గ్రామాలకు మంచినీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. పెన్షన్ మొత్తాన్ని వెయ్యి నుండి త్వరలోనే రెండు వేలకు పెంచుతామని తెలిపారు. ఈ దశలో సుమిత్రా మహాజన్ మరోసారి జోక్యం చేసుకుని రాఫెల్ అంశంపై ఒక్క నిమిషమైనా మాట్లాడాలని సూచించారు. ఆమె సూచనపై స్పందించిన జితేందర్ రెడ్డి హెచ్ఏఎల్‌ను అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ ఏమీ చేయలేదని విమర్శించారు.


670 కోట్ల విమానానికి 737 కోట్ల రూపాయలా?

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: ఫ్రాన్స్‌కు చెందిన దస్సాల్ట్ సంస్థ నుండి కొనుగోలు చేస్తున్న రాఫెల్ యుద్ధ విమానం ప్రాథమిక ధర 670 కోట్ల రూపాయలుకాగా, యూపీఏ ప్రభుత్వం దానిని 737 కోట్ల ప్రాథమిక ధరకు కొనుగోలు చేయాలనుకున్నదని రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో వెల్లడించారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుపై జరిగిన చర్చలో ఒక ప్రశ్నకు బదులిస్తూ యూపీఏ ప్రభుత్వం నిర్ణయించిన ప్రాథమిక ధరతో పోలిస్తే తాము ఒప్పందం చేసుకున్న మొత్తం తొమ్మిది శాతం తక్కువ అని ఆమె తెలిపారు. రాఫెల్ యుద్ధ విమానం ప్రాథమిక ధరను మాత్రమే వెల్లడించగలమని, ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఇతర ఆయుధాలతో యుద్ధానికి సిద్ధంగా ఉండే రాఫెల్ విమానం ధర వెల్లడించడం కుదరని ఆమె స్పష్టం చేశారు. ఒకవేళ అలా ప్రకటిస్తే, శత్రువులకు మన రహస్యాలు వెల్లడించటమే అవుతుందని ఆమె చెప్పారు. రాఫెల్ యుద్ధ విమానం ఆయుధాలతో కూడిన ధరను వెల్లడించాలని డిమాండ్ చేయటం ద్వారా కాంగ్రెస్ మన రహస్యాలను శత్రువులకు వెల్లడించాలనుకుంటున్నదా? అని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ మాట మాటకు యూపీఏ ప్రభుత్వం ఒక రాఫెల్ యుద్ధ విమానాన్ని కేవలం 526 కోట్లకు కొనేందుకు ఒప్పందం చేసుకుందని చెప్పటం పూర్తిగా సత్య దూరమన్నారు. యూపీఏ ఒప్పంద పత్రాల్లో ఎక్కడా రాఫెల్ ప్రాథమిక విమానం ధర 526 కోట్లుగా పేర్కొలేదని ఆమె ప్రకటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎక్కడ నుండి ఈ 526 కోట్ల ధరను తెచ్చారనేది ఆయనకే తెలియాలని ఎద్దేవా చేశారు. యుద్ధ విమానం ధర విషయంలో కాంగ్రెస్ మొదటి నుండి అసత్యాలు ప్రచారం చేసిందని ధ్వజమెత్తారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఒక రాఫెల్ ప్రాథమిక విమానానికి (బేసిక్ ఏయిర్ క్రాఫ్ట్) 1,600 కోట్లు చెల్లిస్తోందనడం పచ్చి అబద్ధమని అన్నారు. ధర విషయంలో తాము సుప్రీం కోర్టును తప్పుదోవ పట్టించినట్లు కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల్లో కూడా ఏమాత్రం నిజం లేదన్నారు. బోఫోర్స్ కుంభకోణం కాంగ్రెస్‌ను అధికారం నుండి దించివేస్తే రాఫెల్ ఒప్పందం నరేంద్ర మోదీని మరోసారి అధికారంలోకి తెస్తుందని నిర్మలా సీతారామన్ జోస్యం చెప్పారు. విమానం ధరను తొమ్మిది శాతం తగ్గించామని, విమానాల సరఫరా సమయాన్ని ఐదు నెలలు కుదించామని వివరించారు.

ఆలయానికి కాంగ్రెస్ అడ్డు

ఆ పార్టీని రామభక్తులు నిలదీయాలి ❖ రాహుల్‌కు అమేథి అభివృద్ధి పట్టదు ❖ కేంద్రమంత్రి స్మృతి ఇరానీ



అమేథీ, జనవరి 4: అయోధ్యలో రామ మందిర నిర్మాణం విషయంలో కోర్టు ప్రక్రియకు కాంగ్రెస్ ఆటంకాలు సృష్టిస్తోందని, ఈ విషయమై రామభక్తులు కాంగ్రెస్‌ను నిలదీయాలని కేంద్రమంత్రి స్మృతి ఇరానీ అన్నారు. తన న్యాయవాదుల ద్వారా న్యాయ స్థానం విచారణకు అవరోధాలు కల్పిస్తోందన్నారు. రామమందిర నిర్మాణం విషయంలో రాజకీయాలకు పాల్పడరాదన్నారు. ఈ విషయం మత విశ్వాసాలకు సంబంధించినదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న అమేథీ నియోజకవర్గంలో ఆమె శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె విలేఖర్లతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ నియోజకవర్గం సమస్యలను పట్టించుకోకుండా తిరుగుతారన్నారవు. ఐదేళ్లకోసారి రాహుల్ సొంత నియోజకవర్గానికి వచ్చి ఓట్లు అడుగుతుంటారన్నారు. సొంత నియోజకవర్గం అభివృద్ధికి రాహుల్ గాంధీ చేసిందేమీ లేదన్నారు. నిజంగా అభివృద్ధి చేసి ఉంటే 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలోని అసెంబ్లీల్లో కాంగ్రెస్ ఎందుకు ఓడిపోతుందన్నారు. అమేథీ ఆసుపత్రిలో ఒక సిటీ స్కాన్ యంత్రాన్ని కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఆమె ఇక్కడ ప్రభుత్వాసుపత్రిలో కంప్యూటరైజ్డ్ టోమోగ్రాఫీ స్కాన్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో అభివృద్ధి పుంజుకుందన్నారు. మధ్యప్రదేశ్‌లో యూపీ, బిహార్ ప్రజలు పనిచేస్తుంటే, ఆ రాష్ట్రముఖ్యమంత్రి కమల్ నాథ్ విమర్శిస్తే, రాహుల్ ఏమి చేస్తున్నారన్నారు. రాఫెల్ డీల్‌లో కాంగ్రెస్ పార్టీ అవాస్తవాలను ప్రచారం చేస్తోందన్నారు.


ఆన్‌లైన్‌లో నేతల సమాచారం లీక్!

బాధితుల్లో జర్మన్ చాన్సలర్ సహా పలువురు రాజకీయ నాయకులు

బెర్లిన్, జనవరి 4: జర్మనీ చాన్సలర్ ఆంజెలా మెర్కెల్ సహా వందలాది రాజకీయ నాయకుల వ్యక్తిగత సమాచారం ఆన్‌లైన్‌లో లీకైంది. ఈ విషయాన్ని ప్రభుత్వం శుక్రవారంనాడు ధృవీకరించింది. 'దేశానికి చెందిన వందలాది రాజకీయ నాయకులతోపాటు ప్రముఖ వ్యక్తులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం ఇంటర్‌నెట్‌లో రావడంతో బహిర్గతమైంది' అని ప్రభుత్వ అధికార ప్రతినిధి మార్టినా ఫియట్జ్ మీడియాకు తెలిపారు. ఈ వ్యక్తిగత సమాచారం లీకైన విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని ఆమె పేర్కొన్నారు. బండెస్టాగ్ పార్లమెంటు దిగువ సభలోని సభ్యులతోపాటు యూరోపియన్ పార్లమెంట్, రీజినల్, స్థానిక అసెంబ్లీలకు చెందిన పలువురు రాజకీయ నాయకుల వ్యక్తిగత సమాచారం బహిర్గతమైనట్టు ఆ తెలిపారు. బండెస్టాగ్ పార్లమెంట్ దిగువ సభలో అన్ని పార్టీలకు చెందిన డిప్యూటీలు సైతం ఈ లీగ్ బారిన పడ్డారని తెలిపారు. ఇదిలావుండగా, జర్మనీ చాన్సలర్ ఆంజెలా మెర్కెల్ కార్యాలయానికి సంబంధించిన అధికార వర్గాలు మాత్రం రాజకీయ నాయకులకు చెందిన సున్నితమైన సమాచారమేదీ ఇంటర్‌నెట్‌లో లీక్ కాలేదని దీనిపై ప్రాథమిక దర్యాప్తు జరుపుతున్న అధికార వర్గాలు తెలిపాయి.

రైల్వే శాఖలో కొలువుల జాతర

13,487 పోస్టుల భర్తీకి ఆర్ఆర్‌బీ నోటిఫికేషన్



న్యూఢిల్లీ, జనవరి 4: రైల్వే శాఖలో కొలువుల జాతర ప్రారంభమైంది. 13వేలకు పైగా పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బి) నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మొత్తం 13,487 జూనియర్ ఇంజనీర్స్ (జేఈ), జూనియర్ ఇంజనీర్స్ (ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ), డిపో మెటీరియల్ సూపరింటెండెంట్ (డీఎంఎస్), కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ (సీఎంఏ) పోస్టుల భర్తీకి ఆర్ఆర్‌బి తన వెబ్‌సైట్‌లో శుక్రవారం నోటిఫికేషన్‌ను జారీ చేసిందని రైల్వేమంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటించింది. ఈ పోస్టులకు ఏడో కేంద్ర వేతన కమిషన్ ప్రకారం వేతన స్కేల్ 35,400-1,12400 (ఆరో లెవెల్) శ్రేణి మధ్య ఉంటుంది. స్టేజి రెండు రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తుల స్వీకరణకు ఆఖరి తేదీ జనవరి 31. మొదటి స్టేజిలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, రెండో స్టేజిలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. దేశవ్యాప్తంగా వివిధ రైల్వే జోన్లు, రాష్ట్రాల్లో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, భారత పౌరులందరూ ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆర్ఆర్‌బి తెలిపింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల అర్హతలు ఈ విధంగా ఉండాలి. జూనియర్ ఇంజనీర్ పోస్టులకు నిర్దేశించిన విభాగం, లేదా, వివిధ విభాగాల కాంబినేషన్‌లో మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లమోను గుర్తింపు పొందిన సంస్థ, కాలేజీ, యూనివర్సిటీ నుంచి పొంది ఉండాలి. డిపో స్టోర్ సూపరింటెండెంట్ పోస్టులకు ఇంజనీరింగ్‌లో ఏ విభాగంలోనైనా డిప్లమోను గుర్తింపు పొందిన సంస్థ నుంచి కలిగి ఉండాలి. డిప్లమోకు బదుగా ఇంజనీరింగ్‌లో ఏదైనా విభాగంలో డిగ్రీ ఉన్నవారు సైతం ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

జూనియర్ ఇంజనీర్ (ఐటీ) పోస్టులకు పీజీడీసీఏ/బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్)/బీటెక్ (కంప్యూటర్ సైన్స్/డిఓయిఏసీసీ బి లెవెల్ మూడు సంవత్సరాల కోర్సు లేదా దానికి సమానమైనది గుర్తింపు పొందిన సంస్థ, యూనివర్సిటీ నుంచి చదివి ఉండాలి. కెమికల్, మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకు ఫిజిక్స్, కెమిస్ట్రీలో మూడేళ్ల సైన్స్‌బ్యాచులర్ డిగ్రీని కనీసం 45 శాతం మార్కులతో గుర్తింపు పొందిన సంస్థ, యూనివర్సిటీ, కాలేజీ నుంచి పొంది ఉండాలి. ఈ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థుల వయసు ఈ ఏడాది జనవరి ఒకటి నాటికి 18-33 సంవత్సరాల మధ్య ఉండాలి. ఇతర, పూర్తి వివరాల కోసం ఆర్ఆర్‌బీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు కోరారు.



గుక్కతిప్పకుండా రెండున్నర గంటలు...

- లోక్‌సభలో నిప్పులు చెరిగిన సీతారామన్
- ప్రతిపక్ష కాంగ్రెస్‌పై విమర్శల దాడి
- రాఫెల్‌పై ప్రతి ప్రశ్నకూ ఓపిగ్గా సమాధానాలు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో రాఫెల్ వివాదంపై జరిగిన చర్చకు రెండున్నర గంటల పాటు గుక్కతిప్పుకోకుండా సమాధానం చెప్పి అందరినీ ఆశ్చర్య పరిచారు. సీతారామన్ మొదట రెండున్నర గంటల పాటు ఏకబిగిన సమాధానం చెప్పిన అనంతరం ప్రతిపక్షం అడిగిన ప్రశ్నలకు మరో అర్ధగంట పాటు వివరణ ఇచ్చి లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రశంసలు పొందారు. తొలుత మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడున్నర వరకు ప్రతిపక్షాల చర్చకు సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, లోక్‌సభలో కాంగ్రెస్ పక్షం నాయకుడు మల్లికార్జున ఖర్గే, ఇతర ప్రతిపక్ష నాయకులు రాఫెల్‌పై లేవనెత్తిన ప్రతి అంశానికి పేరు, పేరున బదులిచ్చారు. ఆ తరువాత రాహుల్ గాంధీ ఇతర ప్రతిపక్ష సభ్యులు అడిగిన వివరణకు మలో అర్ధగంట పాటు బదులిచ్చారు. సీతారామన్ రెండున్నర గంటల పాటు గుక్కతిప్పుకోకుండా మాట్లాడటంతోపాటు మధ్యలో ఎక్కడ కూడా మంచినీరు తాగటం లేదా కొద్ది సేపుఆగడం జరగలేదు. ఆమె పలు సందర్భాల్లో ఆవేశానికి లోనవుతూ 'నిజాయితీపరుడైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని చోర్ అని సంబోదిస్తారా? అంటూ మండిపడ్డారు. రక్షణ శాఖ మంత్రి అబద్ధాలాడుతున్నారన్న కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ పూర్తి నిజాయితీతో దేశం కోసం పని చేస్తున్నారని మంత్రి చెప్పారు. అలాంటి నాయకుడిని చోర్ అంటారా? అంటూ ఆమె కాంగ్రెస్‌పై విరుచుకు పడ్డారు. 'మీలా మా వెనక పెద్ద కుటుంబం, వంశం లేదు. మాది రాజవంశం కాదు. నరేంద్ర మోదీ అతి సామాన్యమైన కుటుంబం నుంచి కష్టడి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగారు. నేను కూడా మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిని'అంటూ నిర్మలాసీతారామన్ వ్యాఖ్యానించారు.'మీరు మా ప్రధాన మంత్రిని తప్పుపడాతారా? అవమానిస్తారా? మళ్లీ క్షమాపణలు కోరతారా?' అంటూ ఆమె నిప్పులు చెరిగారు. మంత్రి మధ్యమధ్యలో ఆవేశానికి గురవుతున్నప్పుడు స్పీకర్ సుమిత్రా మహాజన్ జోక్యం చేసుకుని సముదాయించడం కనిపించింది. నిర్మలా ఆవేశంతో సమాధానం చెబుతుంటే రాహుల్ గాంధీ ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయారు.



మిషన్ కాకతీయకు సీబీఐపీ ప్రకటించిన అవార్డును శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి ఆర్కే సింగ్ నుంచి స్వీకరిస్తున్న తెలంగాణ మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కే శ్యామ్‌సుందర్

మిషన్ కాకతీయకు సీబీఐపీ అవార్డు

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులు పునరుద్ధరణ చేపట్టిన తెలంగాణ చిన్న నీటిపారులశాఖకు సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) అవార్డు లభించింది. ఢిల్లీలో స్కోప్ కాంప్లెక్స్‌లో 91వ సీబీఐపీ దినోత్సవం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి ఆర్కే సింగ్, కేంద్ర జల సంఘం చైర్మన్ మసూద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఈ అవార్డును కేంద్ర విద్యుత్, పునర్వినియోగ ఇంధన శాఖ మంత్రి ఆర్కే సింగ్ నుంచి చీఫ్ ఇంజీనీర్ శ్యామ్ సుందర్ అందుకున్నారు. దేశ వ్యాప్తంగా ఇరిగేషన్, విద్యుత్ రంగంలో విశేష సేవలందించిన వారికి సీబీఐపీ ప్రతి ఏడాది అవార్డులను అందిస్తుంది. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్(సీబీఐపీ) అవార్డు లభించింది. ఢిల్లీలో స్కోప్ కాంప్లెక్స్‌లో 91వ సీబీఐపీ దినోత్సరం శుక్రవారం జరిగింది.



చౌకబారు విమర్శలు మానండి

- టీడీపీ నేతలకు జీవీఎల్ సలహా

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ప్రధాని నరేంద్రమోదీ ఫోబియా పట్టుకుందని బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావుఎద్దేవా చేశారు. విశాఖపట్నం ఎంపీ కంభపాటి హరిబాబుతో కలిసి జీవీఎల్ శుక్రవారం ఇక్కడ విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ స్థాయిలో చంద్రబాబు ఏ సాధించారని ప్రధాని ఆయనను చూసి భయపడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రచారం కోసం తెలుగుదేశం ఎంపీలు చౌకబారు రాజకీయాలు మానుకోవాలని జీవీఎల్ హితవుచెప్పారు. కేంద్రం విడుదల చేసిన నిధులకు యుటిలైజషన్ సర్టిఫికెట్లు (యూసీలు) అడిగితే తామేమన్నా గుమస్తాలమా? అంటున్న టీడీపీ నేతలు ప్రభుత్వ అధికారులంటే అంత చులకనగా కనబడుతున్నారా అని జీవీఎల్ ఎదురుప్రశ్నించారు. తెలంగాణలో శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చంద్రబాబు నట్టేట ముంచారని ఆయన ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ఏపీలో కూడా టీడీపీ కచ్చితంగా ఓడిపోతుందని బీజేపీ నేతలు జోస్యం చెప్పారు. ఏపీలోని బీజేపీ కార్యకర్తలతో ప్రధాని నరేంద్రమోదీ జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌పై చంద్రబాబుపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిరోజు చంద్రబాబు 'మోదీ కోటి'రాస్తే ఎప్పుడో పూర్తయ్యేదని ఎద్దేవా చేశారు. కేంద్ర పథకాలతో సంబంధం లేకుండా అదనంగా ఏపీని ఎలా అభివృద్ధి చేసిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రచారం ఆర్భాటాల కోసం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తోందని నరసింహరావుఆరోపించారు. అమరావతిలో హైకోర్టు నిర్మాణం కోసం సుప్రీంకోర్టు ఎనిమిది నెలలు సమయం ఇచ్చినా టీడీపీ ప్రభుత్వం రెండు అంతస్తుల భవనం కూడా కట్టలేకపోయిందని ఆయన విమర్శించారు. అలాంటి వారు ప్రచంచంలోనే నాల్గో పెద్ద రాజధాని నిర్మిస్తామంటే ఎలానమ్మాలని జీవీఎల్ ప్రశ్నించారు. ఎంపీ హరిబాబు మాట్లాడుతూ కేంద్రం ఏపీకి చేస్తున్న సహాయంపై రాష్ట్ర ప్రజలను టీడీపీ తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. కేంద్రం నిధులు ఇవ్వడం లేదంటూ తెలుగు దేశం నాయకులు చేస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. 2018-19 సంవత్సరానికిగానూ 6,243 కోట్ల రూపాయలు నరేగా కింద నిధులు విడుదలయ్యాయన్నాన్నారు.

జగన్ ఆస్తులపై విచారిస్తున్న సీబీఐ న్యాయమూర్తి బదిలీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి ఆస్తులకు సంబంధించిన విచారణ చేస్తున్న సీబీఐ కోర్టు న్యాయమూర్తి ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయ్యారు.రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా సీబీఐ కోర్టు న్యాయమూర్తి వెంకటరమణను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేశారు. తన ఆస్తులకు సంబంధించిన కేసులో జగన్మోహనరెడ్డి దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లపై సీబీఐ కోర్టులో విచారణ జరుగుతోంది. సీబీఐ, ఈడీ కోర్టులో జగన్ ఆస్తుల కేసు శుక్రవారం విచారణకు రాగా, తదుపరి విచారణ ఈనెల 25వ తేదీకి వాయిదా వేస్తూ కోర్టు ఆదేశించింది.

అమరావతిపై పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి సంబంధించిన పర్యావరణ అనుమతులపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో ఎన్‌జీటీ అమరావతి నిర్మాణం, పర్యావరణ అనుమతులపై ఆదేశాలు ఇచ్చింది. దీన్ని మాజీ ఐఏఎస్ అధికారి ఈఎన్ఎస్ శర్మ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్ జస్టిస్ ఏకే సిక్రితో కూడిన ధర్మాసనం ముందుకు విచారణ వచ్చింది. ఇలాంటి పిటిషన్లు విచారించాల్సిన అవసరం లేదని బెంచ్ అభిప్రాయ డుతూ కొట్టివేసింది.

పార్టీని నడపడం అంత ఈజీకాదు

రాజకీయాల్లో ఓర్పు, సహనం ముఖ్యం ◆ పీఆర్పీ అనుభవాలతో ముందుకు
కులాలను అడ్డుపెట్టుకుని విజయం సాధించలేం ◆ జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్

విజయవాడ(సిటీ), జనవరి 4: పేరు ప్రఖ్యాతులు, డబ్బు, హోదా ఉన్నంత మాత్రాన పార్టీలు స్థాపించి వాటిని విజయవంతంగా నడిపించలేమని జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. బాధ్యత, సేవ చేయాలనే తపన, ఓపిక, సహనం, ఇవన్నీ ఉన్నప్పుడే రాజకీయాల్లో రాణించగలమన్నారు. ఒకటి రెండు కులాలను అడ్డుపెట్టుకుని రాజకీయాల్లో విజయం సాధించలేమన్నారు. కులాల ప్రభావం అధికంగా ఉండే రాష్ట్రాల్లో ఇది స్పష్టమయిందన్నారు. ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు సందర్భంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీని తీర్చిదిద్దుతున్నామన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లాల వారీ సమీక్షలో భాగంగా శుక్రవారం నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లాల నేతలతో విడివిడిగా సమీక్ష నిర్వహించిన ఆయన పార్టీ నాయకులకు, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యేలు, ఎంపీలు అయిపోదాం అనుకుంటే సాధ్యమయ్యే పని కాదన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసేవారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీ పదవులు, పార్టీ అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవులు సైతం అందుబాటలో ఉంటాయని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన వారికి ఇవన్నీ దక్కుతాయని చెప్పారు. మనది కులాలతో ముడిపడిన సమాజమని చెప్పిన ఆయన ఒకటి రెండు కులాలను అడ్డుపెట్టుకుని రాజకీయాల్లో విజయం సాధించలేమన్నారు. కులాల ప్రభావం అధికంగా ఉంటే ఉత్తరప్రదేశ్‌లో కూడా కుల రాజకీయ ప్రయాగాలు విఫలమయ్యాయన్నారు. కులం పేరు చెప్పి వ్యక్తులు లాభపడుతున్నారే తప్ప కులాలు మాత్రం బాగుపడటం లేదన్నారు. డబ్బు పెట్టి రాజకీయాల్లో లాభం పొందాలనుకునే వారు నేడు దేశ వ్యాప్తంగా అధిక సంఖ్యలో ఉన్నారని చెప్పారు. సేవ చేద్దామన్న తలంపు ఉన్నవారు కనుమరుగవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఎదుటి వారిని తిట్టడం వల్ల, బ్లాక్ మెయిల్ చేయడం వల్ల ముందుకి వెళ్లలేమన్నారు. సేవ చేసినప్పుడే ఎవరైనా ముందుకు వెళ్తారన్నారు. పని చేయడానికి బలమైన అనుభవం కావాలన్నారు. పార్టీలో పైకి ఎదగాలంటే సామరస్య ధోరణి అవసరమన్నారు. ఘర్షణపూరిత వైఖరితో కాకుండా ఒకరికి ఒకరు సహకారం అందించుకున్నప్పుడే విజయం సాధిస్తామన్నారు. తాను ప్రవాహం వంటి వాడినన్నారు. తన ప్రభంజనాన్ని ఆపడం ఎవరి తరం కాదన్నారు. పుట్టిన ప్రతి ఒక్కరు రెండురకాలుగా మనుగడ సాధించవచ్చన్నారు. పార్టీ కోసం, ప్రజల కోసం పని చేస్తే రాజకీయ అనుభవం లభిస్తుందన్నారు. అప్పుడే ప్రజలు ఎన్నికల్లో ఆదరిస్తారన్నారు. వ్యక్తిగతంగా రాణిస్తూ కనీసం 10 వేల ఓట్లు సాధించుకునే సామర్థ్యం ఉన్నవారిని పార్టీ తప్పకుండా అక్కున చేర్చుకుంటుందన్నారు. మన ముందు ఎన్నికలు ఉన్నాయని, చాలా తక్కువ సమయం ఉంది, తక్కువ కాలంలో అధిక ఫలాలు ఎలా సాధించవచ్చో సూచనలు, సలహాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. వాటిని పార్టీ తప్పకుండా స్వీకరించి ఆచరిస్తుందన్నారు.

నెల్లూరు జిల్లా రాజకీయాల్లోకి కొత్తతరాన్ని తీసుకురాకుంటే ఆ జిల్లాకి అన్యాయం చేసిన వారిమవుతామని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా బలమైన రాజకీయ చైతన్యం ఉన్న జిల్లా అని, నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలో రాజకీయానికి పేరెన్నికగన్న జిల్లా అని తెలిపారు. రాజకీయ ఉద్దండులు పుట్టిన జిల్లా రాజకీయం అంతా నేడు పది కుటుంబాల చేతుల్లో చిక్కుకుపోయిందన్నారు. జిల్లాలో రాజకీయ చైతన్యం తీసుకురావాలని ఎంతో మంది చెబుతున్న విషయాన్ని పార్టీ నేతల ముందు ఉంచారు.

ఏపీకి హోదా ఇవ్వాల్సిందే

- వామపక్ష నేతల డిమాండ్
- జంతర్‌మంతర్ వద్ద నిరసన

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందేనని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేకహోదా కల్పించాలన్న డిమాండ్‌తో 'ప్రత్యేకహోదా సాధన సమితి' ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రెండో రోజు శుక్రవారం నిరసన కార్యక్రమం కొనసాగింది. సీపీఐ, సీపీఎం హోదా సాధన సమితి నాయకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు. ఏచూరి మాట్లాడుతూ ఏపీకి బీజేపీ ఇస్తామన్న హామీలను ఆమలు చేయడంలో విఫలం చెందిందని ఆరోపించారు. విభజన చట్టంలో ఉన్నవాటిని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ నారాయణ మాట్లాడుతూ ప్రత్యేకహోదా విషయంలో ఏపీని కేంద్రం దగా చేసిందని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం ఏపీ కార్యదర్శి మధు, హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ సాధన సమితి నేతలు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసి వినతి పత్రం అందించారు.

1వ పేజీ తరువాయి

రాఫెల్‌పై హోరాహోరీ

చేర్పించారని ప్రత్యారోపణలు చేశారు. తాము అధికారంలోకి రాగానే దీనిపై దర్యాప్తుకు ఆదేశిస్తామని చెప్పారు. అదే విధంగా జేపీసీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సభలో కాంగ్రెస్, బీజేపీ సభ్యులు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ, పలుమార్లు వాగ్వావాదానికి దిగారు. రాఫెల్ వివాదంపై సభలో జరిగిన చర్చకు నిర్మలా సీతారామన్ సమాధానం ఇస్తూ యూపీఏ సంకీర్ణ ప్రభుత్వం ముడుపుల కోసమే యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం పూర్తి చేయలేదని ఆమె పదేపదే ఆరోపించారు. గత పదిహేను సంవత్సరాల్లో చైనా నాలుగు వందల యుద్ధ విమానాలను సమకూర్చుకున్నదని గుర్తుచేశారు. పాకిస్తాన్ అత్యాధునిక యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తే యూపీఏ ప్రభుత్వం మాత్రం యుద్ధ విమానాల కొనుగోలులో జాప్యం చేయటం ద్వారా భారత వాయు దళ బలాన్ని పూర్తిగా తగ్గించి వేసిందని ఆరోపణాస్త్రాలు సంధించారు. రాఫెల్ మొదటి యుద్ధ విమానం సెప్టెంబర్‌లో దేశానికి అందుతుందని ఆమె ప్రకటించారు. నిర్మలా సీతారామన్ దాదాపు రెండున్నర గంటల పాటు ఇచ్చిన సమాధానంలో రాహుల్, ఇతర ప్రతిపక్ష నాయకులు చేసిన ఆరోపణలను ఖండించారు. వారు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు యుద్ధ విమానాల కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తే యూపీఏ సంకీర్ణ ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని పక్కకుపెట్టిందని ధ్వజమెత్తారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశం ఎదుర్కొంటున్న ప్రమాదకర పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబందించిన పాత ఒప్పందాన్ని రద్దు చేసి, 36 యుద్ధ విమానాలను వెంటనే కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో కొత్త ఒప్పందం చేసుకున్నారని ఆమె వివరించారు. మన పొరుగున ఉన్న శత్రు దేశాల నుండి ఎదురవుతున్న ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని, ఆయితే, రాహుల్ మాత్రం స్వార్థ రాజకీయం కోసం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని నిర్మలా సీతారామన దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు రాజకీయం తప్ప దేశ భద్రత గురించి ఎలాంటి పట్టింపులేదని ఆమె పలు మార్లు ఆరోపించారు. యూపీఏ ప్రభుత్వం యుద్ధ విమానాల కొనుగోలు చర్చలను పది సంవత్సరాలు కొనసాగిస్తే ఎన్‌డీఏ ప్రభుత్వం కేవలం పద్నాలుగు నెలల్లో చర్చల ప్రక్రియను పూర్తి చేసిందని ఆమె గుర్తుచేశారు. ముడుపులు అందితే తప్ప రాఫెల్ యుద్ధ విమానాలు కొనుగోలు చేయకూడదని యూపీఏ భావించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ముడుపుల కోసం చూస్తే, తమ ప్రభుత్వం దేశ రక్షణను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగిందని అన్నారు. ఇది బోఫోర్స్ లాంటి కుంభకోణం కాదని నిర్మలా సీతారామన్ కాంగ్రెస్‌ను ఎద్దేవ చేశారు. దేశ భద్రతను నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్‌కు మాట్లాడే హక్కు లేదని పేర్కొన్నారు. హెచ్ఏఎల్ గురించి మొసలి కన్నీరు కారుస్తున్న కాంగ్రెస్ తాము అధికారంలో ఉన్నప్పుడు రాఫెల్ ఒప్పందం ఎందుకు చేసుకోలేదని ఆమె ప్రశ్నించారు. హెచ్ఏఎల్ యుద్ధ విమానాల తయారీలో వైఫల్యం చెందిందని ఆరోపించిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ సంస్థను అన్యాయం చేశారని అరోపించటం సిగ్గు చేటని నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. యూపీఏ ప్రభుత్వం హెచ్ఏఎల్ సామర్థ్యం పెంచకుండా నిర్లక్ష్యం చేస్తే ఎన్‌డీఏ ప్రభుత్వం దాదాపు ఒక లక్ష రూపాయల ఆర్డర్లు ఇచ్చి ప్రోత్సహించిందని తెలిపారు. అమేథీలో ఉన్న హెచ్ఏఎల్ సంస్థను రాహుల్ గాంధీ ఒక్కసారైనా సందర్శించారా? అమె ఆయనను నిలదీశారు.

మోదీ అవినీతికి పాల్పడ్డారు..

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అవినీతికి పాల్పడ్డారని రాహుల్ పదేపదే ఆరోపించారు. రిలయన్స్ రక్షణ సంస్థ అధినేత అనిల్ అంబానీకి ముప్పై వేల కోట్ల ప్రజా ధనాన్ని అప్పగించారని ధ్వజమెత్తారు. మోదీ సూచన మేరకు రాఫెల్ యుద్ధ విమానాల ఆఫ్‌సెట్ ఒప్పందంలో అనిల్ అంబానీ పేరు చేర్చినట్లు ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు హోలాండ్ ప్రకటించారని రాహుల్ మరోసారి చెప్పారు. హోలాండ్ చెప్పింది తప్పైతే మోదీ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. రాఫెల్ కుంభకోణంలో తాను కేవలం మోదీని మాత్రమే తప్పు పడుతున్నానని, రక్షణ శాఖ మాజీ మంత్రి మనోహర్ పరిక్కర్, ప్రస్తుత రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎలాంటి సంబంధం లేదని రాహుల్ అన్నారు. అందుకే వారిపై తాను ఎలాంటి ఆరోపణలు చేయటం లేదని స్పష్టం చేశారు. కేవలం నరేంద్ర మోదీ మాత్రమే అవినీతికి పాల్పడ్డారు కాబట్టి తాను ఆయనపైనే ఆరోపణలు చేస్తున్నానని కాంగ్రెస్ అధ్యక్షుడు వివరించారు. తమ సంస్థకు ముప్పై వేల ఆఫ్‌సెట్ ఒప్పందం లభించిందని అనీల్ అంబానీ చెబుతుంటే, అలాంటిదేమీ లేదని మీరెలా చెబుతారని ఆయన నిర్మలా సీతారామన్‌ను నిలదీశారు. అనీల్ అంబానికి ఆఫ్‌సెట్ ఒప్పందం ఇప్పించాలనే నిర్ణయం ఎవరు తీసుకున్నారనేది చెప్పగలరా? అని నిర్మలా సీతారామన్‌ను ఆయన నిలదీశారు. రాఫెల్ యుద్ధ విమానం ధరను 560 కోట్ల నుండి 1,600 కోట్లకు ఎవరు పెంచారని అడిగారు. శత్రువులు పొంచివుంటే, 126 యుద్ధ విమానాలు కొనుగోలు చేయకుండా 36 ఎందుకు కొంటున్నారని నిలదీశారు. అత్యవసర పరిస్థితి ఉన్నది కాబట్టే మోదీ ఒప్పందాన్ని మార్చారని సీతారామన్ చెప్పారని రాహుల్ గుర్తుచేశారు. మోదీ ఈ నిర్ణయం ఎప్పుడు తీసుకున్నారని అడిగారు. ఈ నిర్ణయానికి సీనియర్ ఐఏఫ్ అధికారులు అభ్యంతరం తెలిపారా? లేదా? అంటూ రాహుల్ ప్రశ్నలు కురిపించారు. మొత్తం మీద బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు రాఫెల్ వ్యవహారంపై పలు మార్లు వాగ్వావాదానికి దిగారు. నిర్మలా సీతారామన్ సమాధానం ఇచ్చిన తరువాత కూడా ఇరు పక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. స్పీకర్ సుమిత్రా మహాజన్ ఈ గొడవ మధ్యనే మరో అంశాన్ని చర్చకు చేపట్టటంతో సభ సద్దుమణిగింది.

జగన్‌పై హత్యాయత్నం కేసు ఎన్ఐఏకు

సమాచారం ఇచ్చింది. కేసుకు సంబంధించిన అంశాలపై అసిస్టెంట్ సోలిసిటర్ జనరల్ కె లక్ష్మణ్ హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు హాజరై కేంద్ర హోంశాఖ ఇచ్చిన లేఖను హైకోర్టుకు సమర్పించారు. జగన్‌పై హత్యాయత్నం కేసు అంశాలపై కేంద్ర ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు విశాఖపట్నం విమానాశ్రం అధికారులను నుంచి సమాచారం తెప్పించుకున్నారు. డిసెంబర్ 31వ తేదీన జగన్ కేసుపై సమాచారం తెప్పించుకున్న జాతీయ దర్యాప్తుసంస్థ జనవరి 1న కేసు నమోదు చేసింది. ఇక జగన్మోహన్‌డ్డి కేసు దర్యాప్తు విచారణ ఆంధ్రప్రదేశ్ పోలీసులు చేపట్టకుండా నిషేధించినట్టుగా భావించాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఈ నిర్ణయంపై అప్పీలుకు వెళ్ళే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై గత ఏడాది అక్టోబర్ 25న విశాఖపట్నం ఎయిర్‌పోర్టు లాంజ్‌లో హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. శ్రీనివాసరావు అనే వ్యక్తి కోడికత్తితో జగన్‌పై దాడి చేసి గాయపరిచిన ఘటనపై స్థానిక పోలీసులు సెక్షన్ 307 ఐపీసీ హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ప్రస్తుతం నిందితుడు విశాఖ జైలులో ఉన్నాడు. అయితే ఘటనకు సంబంధించి ఏపీ ముఖ్యమంత్రి, డీజీపీ అప్పట్లో చేసిన వ్యాఖ్యలతో దాడి వెనుక కుట్ర కోణం ఉందని, దర్యాప్తుకు సంబంధించి ఏపీ పోలీసులపై తమకు నమ్మకం లేదని, కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలంటూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి హైకోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరుపు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఘటన జరిగిన స్థలం ఎయిర్‌పోర్టు కనుక కేసు దర్యాప్తు రాష్ట్ర పోలీసుల పరిధి కాదని, కేంద్రానికి సంబంధించిన సీఐఎస్ఎఫ్ పరిధి కనుక 'ది సపరేషన్ ఆఫ్ అన్‌లాఫుల్ యాక్టు ఎగైనెస్ట్ సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్టు' 1982, సెక్షన్ 3(ఏ)/1/ఏ కింద కేసు నమోదు చేసి కేంద్రానికి బదిలీ చేయాల్సి ఉండగా.. ఇందుకు భిన్నంగా సెక్షన్ 307 ఐపీసీ హత్యాయత్నం కింద కేసు నమోదు చేయడం ద్వారా కేసును నీరుగార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పిటిషనర్ తరుపు న్యాయవాది గత వాయిదాలో కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన న్యాయస్థానం నిర్ణయం చెప్పాలని, లేదా తామే నిర్ణయం తీసుకుంటామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఇదే సమయంలో కేసుకు సంబంధించి చార్జిషీటు దాఖలు చేయవద్దని స్థానిక పోలీసులను ఆదేశించింది. దీంతో కేంద్ర హోంశాఖ కేసును గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన ఎన్ఐఏకు అప్పగించింది. ఈ ఏడాది జనవరి 1న హైదరాబాద్‌లోని ఎన్ఐఏ విభాగం జగన్‌పై దాడి ఘటనకు సంబంధించి సెక్షన్ 307 ఐపీసీతోపాటు ఎన్ఐఏ చట్టం సెక్షన్ 6(1) కింద రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు అధికారిగా అదనపు ఎస్పీ మహ్మద్ షాజిద్‌ఖాన్‌ను నియమించింది. ఇదే విషయాన్ని శుక్రవారం నాటి వాయిదాలో ఎన్ఐఏ హైకోర్టుకు తెలియచేసింది. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆమోదంతో జగన్‌పై కోడికత్తి దాడి కేసు రాష్ట్ర పోలీసుల పరిధి నుంచి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చేతుల్లోకి వెళ్లిపోయింది. కాగా జగన్‌పై దాడి కేసుకు సంబంధించి ఎన్ఐఏ దర్యాప్తు పట్ల రాష్ట్ర ప్రభుత్వం అప్పీలుకు వెళ్ళనున్నట్టు తెలుస్తోంది. ఇలా ఉండగా ప్రతిపక్ష నేత జగన్‌పై హత్యాయత్నం కేసును ఎన్ఐఏకు అప్పగిస్తూ హైకోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో దాడి వెనుక కుట్రదారులు దర్యాప్తులో బయటకు రానున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అన్నారు. కోర్టు తీర్పు అనంతరం కోర్టు వెలుపల ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఆరు నెలల ముందే వేసుకున్న పథకం ప్రకారం ఘటన జరిగిందని, కుట్ర వెనుక వ్యక్తులను ఎన్ఐఏ దర్యాప్తులో నిగ్గు తేల్చాలని, వారిపై సెక్షన్ 166 ఐపీసీ కింద చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని అన్నారు.

నిందితుడు శ్రీనివాసరావును కస్టడీకి తీసుకోనున్న ఎన్ఐఏ

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడు శ్రీనివాసరావును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీకి తీసుకోనుంది. నిందితుడు శ్రీనివాసరావును తమ కస్టడీకి కోరుతూ విశాఖపట్నంలోని కోర్టులో హైదరాబాద్‌లోని ఎన్ఐఏ విభాగం అధికారులు పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం శ్రీనివాసరావు జైలులో రిమాండులో కొనసాగుతున్నాడు. కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఎన్ఐఏ దర్యాప్తుకు హైకోర్టు ఆమోదం తెలిపిన క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ఐఏ కోర్టు లేనందున విశాఖపట్నం కోర్టులోని ఫైళ్ళు హైదరాబాద్ లోని ఎన్ఐఏ కోర్టుకు అప్పగించేందుకు మరికొన్ని రోజులు సమయం పడుతుంది.

'అయోధ్య'పై 10న ధర్మాసనం ఏర్పాటు

వాదనలు వినిపించే అవకాశాన్ని కోర్టు ఇవ్వలేదు. మొత్తం 30 సెకన్లలో ఈ కేసు విచారణ ముగిసింది. ఈ కేసును విచారించేందుకు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ కేసులో 14 పార్టీలు కోర్టును ఆశ్రయించాయి. ఈ కేసుపై అలహాబాద్ హైకోర్టు 2010లో తీర్పును ఇచ్చింది. ఈ కేసులో మూడు పార్టీలకు 2.77 ఎకరాల భూమిని సమానంగా పంచుతూ తీర్పు ఇచ్చింది. సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖారా, రామ్ లల్లా సంస్థకు ఈ భూమిని పంచాలనికోర్టు ఆదేశించింది. గత ఏడాది అక్టోబర్ 29వ తేదీన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారిస్తుందని అంతకు ముందు పదవీ విరమణ చేసిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ప్రకటించారు. అఖిల భారత హిందూ మహాసభ మాత్రం ఈ కేసును వీలైనంత త్వరగా విచారించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కాగా కేంద్రం రామాలయం నిర్మాణంపై ఆర్డినెన్సు తేవాలని హిందూ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. కాగా ప్రధాని నరేంద్రమోదీ న్యాయ స్థానం పరిశీలనలో ఈ అంశం పరిశీలనలో ఉందని, ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే ఆర్డినెన్సు తెస్తామని తెలిపిన విషయం విదితమే.

కోడి కత్తి పార్టీ మెడపై సీబీఐ కత్తి: బాబు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 4: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కోడి కత్తి పార్టీగా మారిపోయిందని, ఆ పార్టీ మెడపై ప్రధాని మోదీ సీబీఐ కత్తి పెట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎద్దేవాచేశారు. అందుకే మోదీ అంటే జగన్ వణికిపోతూ ఊడిగం చేస్తున్నారని, రాష్ట్రానికి అటువంటి ప్రతిపక్షం దాపురించిందన్నారు. తూర్పు గోదావరి జిల్లా కేంద్రం కాకినాడ జేఎన్టీయూ గ్రౌండ్స్‌లో శుక్రవారం జరిగిన ఆరో విడత జన్మభూమి-మా వూరు సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ కేంద్రం వైఖరి వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ గడ్డపై పుట్టి, ఈ నీళ్ళు తాగిన ప్రతీవారూ ఈ గడ్డకు న్యాయం చేయాలన్నారు. విభజన అనంతరం దారి తెలియని స్థితి నుంచి రాష్ట్రం నేషనల్ హైవే ఎక్కిందని చంద్రబాబునాయుడు అన్నారు. ఎన్నో కష్టాలున్నా పరిష్కరించుకుంటూ ముందుకు పోతున్నామన్నారు. బీజేపీ నమ్మకద్రోహం చేసిందని, మోదీ రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. కక్ష కట్టి ఐటీ, ఈడీ దాడులు చేయించడమే కాక, నేరుగా విమర్శల దాడికి మోదీ దిగారన్నారు. పోలవరం, పెట్రో కెమికల్ కారిడార్, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ వీటన్నింటికీ నిధులు ఇవ్వలేదన్నారు. టీడీపీ ఓడిపోతుందని ప్రధాని మోదీ చెబుతున్నారని, అసలు బీజేపీ పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలని హితవు పలికారు. బీజేపీకి డిపాజిట్లు కూడా దక్కవన్నారు. రాఫెల్ కుంభకోణంలో కూరుకుపోయిన ప్రధాని అవినీతి గురించి తనను విమర్శంచడమా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. అవినీతిలో కొట్టుమిట్టాడుతున్న బీజేపీ తన గురించి మాట్లాడ్డం దారుణమన్నారు.బీజేపీ సాంకేతికతను వారి సొంతానికి ఉపయోగించుకుంటుంటే, తాను టెక్నాలజీని ప్రజల కోసం ఉపయోగించి అభివృద్ధి చేస్తున్నానన్నారు. రానున్న కాలంలో ఇంటికొక సెల్‌ఫోన్ ఇస్తానని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఈ సెల్‌ఫోన్ ద్వారా సంక్షేమ, అభివృద్ధి ఏ విధంగా జరుగుతుందో అభిప్రాయ సేకరణ చేస్తానన్నారు. ఎప్పటికపుడు ప్రజాభిప్రాయ సేకరణ చేసి, దానికి అనుగుణంగా అప్పటికపుడు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయ చినరాజప్ప, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, కాకినాడ అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి కొండ బాబు, పిల్లి అనంతలక్ష్మి, కాకినాడ మేయర్ సుంకర పావని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడాభూమి

నేటి నుంచి ఆసియా కప్

- మెరుగైన ప్రదర్శన కోసం భారత్ తహతహ
- పోటీలకు ఆతిథ్యం ఇవ్వనున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్

అబుదాబి, జనవరి 4: అంతర్జాతీయ పురుషుల ఆసియా కప్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ (17వ ఎడిషన్) అబుదాబిలో శనివారం నుంచి ప్రారంభం కానుంది. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి భారీ ఎత్తున నిర్వహించే ఈ పోటీలకు ఈసారి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆతిథ్యం ఇవ్వనుంది. జనవరి 5 నుంచి ఫిబ్రవరి 1వరకు అత్యంత భారీ ఎత్తున నిర్వహించే ఈ పోటీలకు అబుదాబిలోని నాలుగు ప్రధాన నగరాల్లోని వివిధ క్రీడా మైదానాలు వేదికలు కానున్నాయి. ఎనిమిదేళ్ల క్రితం అంటే 2011లో ఆసియా కప్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించిన భారత్ గ్రూప్ స్టేజీ నుంచి వెనుతిరగాల్సి వచ్చింది. అయితే, అప్పటికీ ఇప్పటికీ జట్టులో ఎన్నో మార్పులు, చేర్పులతోపాటు సంచలనం సృష్టించే సత్తా కలిగిన యువకులు ఉండడం కలిసొచ్చే అంశం. ఈనెల 5 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీకి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆతిథ్య ఇవ్వనుంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన కప్ కైవసం చేసుకునేందుకు ఆరు గ్రూపులుగా 24 జట్లు పోటీపడనున్నాయి. శనివారం ఇక్కడి జయీద్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో జరిగే ప్రారంభ పోటీలో భాగంగా ఆతిథ్య యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ గ్రూప్-ఏలో బెహ్రెయిన్‌తో తలపడుతుంది. రెండో రోజు ఇదే గ్రూప్‌లో భాగంగా అల్ నహ్యాన్ స్టేడియంలో జరిగే పోటీలో థాయిలాండ్‌తో భారత్ పోటీపడుతుంది. ప్రపంచ ర్యాంకింగ్‌లో ప్రస్తుతం భారత్ 97వ ర్యాంక్‌లో కొనసాగుతోంది. 2011లో గ్రూప్ స్టేజీ నుంచి వెనుతిరిగిన భారత్ ఇపుడు అత్యుత్తమ ప్రదర్శనను కనబరచడం ద్వారా 2026లో జరిగే వరల్డ్ కప్‌లో చోటు దక్కించుకునేందుకు కలలు కంటోంది. చీఫ్ కోచ్ స్టీఫెన్ కాన్‌స్టంటైన్ ఆధ్వర్యంలోని 28 మంది సభ్యులు కలిగిన భారత జట్టు గత నెల 23 పోటీలు జరిగే ప్రాంతానికి చేరుకుని ముమ్మరంగా ప్రాక్టీసు చేసింది. ఆసియా కప్ టోర్నీ మామూలు టోర్నీల కంటే చాలా భిన్నమని, తమ జట్టు సభ్యులంతా తమ కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వర్తించగలరనే ఆశాభావాన్ని చీఫ్ కోచ్ వ్యక్తం చేశాడు.

భారత్‌తో మూడు మ్యాచ్‌ల వనే్డ సిరీస్‌కు

ఆస్ట్రేలియా జట్టు ఎంపిక

సిడ్నీ, జనవరి 4: ఈనెల 12 నుంచి భారత్‌తో ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వనే్డల సిరీస్‌కు ఆస్ట్రేలియా 14మందితో కూడిన జట్టును శుక్రవారం ప్రకటించింది. వెటరన్ సీమర్ పీటర్ సిడెల్‌తో పాటు ఉస్మాన్ ఖాజా, నాథన్ లియాన్, ఆరోన్ ఫించ్‌ను ఎంపిక చేసింది. దీంతో నాథన్ లియాన్ స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్ అందుబాటులో ఉండడను స్పష్టం చేసింది. మరోవైపు 34ఏళ్ల పీటర్ సిడెల్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా వనే్డ సిరీస్‌కు ఎంపిక చేయడం గమనార్హం. ఫాం లేమితో తంటాలు పడుతున్న బ్యాట్స్‌మెన్లు ట్రావిస్ హెడ్, డర్సీ షార్ట్, క్రిస్ లియాన్‌ను వనే్డ సిరీస్‌కు పక్కనౌపెట్టారు. రానున్న దక్షిణాఫ్రికా సిరీస్, ప్రపంచ్‌కప్ దృష్ట్యా జట్టును ఎంపిక చేస్తున్నట్లు ఆస్ట్రేలియా సెలక్షన్ ప్యానెల్ చైర్మన్ ట్రెవర్ హాన్స్ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే మొదటి వనే్డ ఈ నెల 12న సిడ్నీ, రెండో వనే్డ 15న ఆడెలైడ్, మూడో వనే్డ 18న మెల్‌బోర్న్‌లో జరగనుంది.

వనే్డ సిరీస్ జట్టు: ఆరోన్ ఫించ్ (కెప్టెన్), ఉస్మాన్ ఖాజా, షాన్ మార్ష్, పిటర్ హాండ్స్‌కాబ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మార్కస్ స్టాయినిస్, మిచెల్ మార్ష్, అలెక్స్ క్యారీ (వికెట్ కీపర్), జై రిచర్డ్‌సన్, బిల్లి స్టన్‌లెక్, జాసన్ బెహెరెన్‌డ్రఫ్, పిటర్ సిడెల్, నాథన్ లియాన్, ఆడమ్ జంపా.


చతేశ్వర్ పుజారా 373 బంతుల్లో 193


సెంచరీ చేసిన రిషబ్ పంత్‌ను అభినందిస్తున్న రవీంద్ర జడేజా

ఇరగదీశారు..

నాలుగో టెస్టులో భారత్ భారీ స్కోరు

- రిషబ్ సూపర్ సెంచరీ
- పుజారా డబుల్ సెంచరీ మిస్
- అర్థ సెంచరీతో రాణించిన జడ్డూ
- 7/622 వద్ద మొదటి ఇన్నింగ్స్ డిక్లేర్డ్

సిడ్నీ, జనవరి 4: ఓవైపు చతేశ్వర్ పుజారా.. మరోవైపు రిషబ్ పంత్.. ఇంకోవైపు రవీంద్ర జడేజా ఆస్ట్రేలియా బౌలర్లను ఆటాడుకున్నారు. సిడ్నీ వేదికగా జరుగుతున్న చివరి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు చేసింది. ఓవర్ నైట్ స్కోరు నాలుగు వికెట్లకు 303తో రెండో రోజు బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆదిలోనే హనుమ విహారి (42) వికెట్ కోల్పోయింది. 101వ ఓవర్‌లో నాథన్ లియాన్ వేసిన చివరి బంతికి లాబుస్చాన్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో విహారి వెనుదిరిగాడు. భారత్ రివ్యూ కోరినా రిప్లైలో అవుట్ అని తేలడంతో వెనుదిరిగాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన వికెట్ కీపర్ రిషబ్ పంత్, పుజారాతో కలిసి నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను నడిపించారు. ఈ క్రమంలో పుజారా ఫోర్ కొట్టి 150 పరుగులు పూర్తి చేశాడు. వీరిద్దరూ కలిసి ఆస్ట్రేలియా బౌలర్లకు సవాల్ విసిరారు. ఓవైపు పరుగులు రాబడుతూనే అచితూచి ఆడారు. 129.5 ఓవర్‌లో లియాన్ అద్భుతమైన బంతికి పుజారా అతడికే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికే డబుల్ సెంచరీకి 7 పరుగుల దూరంలో ఉన్నాడు. 22 ఫోర్లతో 373 బంతుల్లో పుజారా 193 పరుగులు సాధించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజాతో కలిసి పంత్ దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో 141 బంతుల్లో రెండో టెస్టు సెంచరీ చేశాడు. మరోవైపు రవీంద్ర జడేజా కూడా దూకుడుగా ఆడి 10వ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరూ ఆసీస్ బౌలర్లకు చుక్కలు చూపించారు. మూడో సారి బంతి మార్చినా వీరిని ఆపడం ఆస్ట్రేలియా బౌలర్లకు సాధ్యపడలేదు. 166.3 ఓవర్‌లో రిషబ్ పంత్ 150 పరుగుల మైలురాయిని దాటాడు. చివరికి రవీంద్ర జడేజా తన వ్యక్తిగత స్కోరు 81 వద్ద లియాన్ బౌలింగ్‌లో ఏడో వికెట్‌గా బౌల్డ్ అయ్యాడు. సమయం దగ్గరపడుతుండడంతో కెప్టెన్ కోహ్లీ డిక్లేర్డ్ చేశాడు. ఆ తర్వాత మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా రెండో రోజు ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 24 పరుగులు చేసింది.

ఆస్ట్రేలియా గడ్డపై రెండో భారీ స్కోరు..

ఇదిలా ఉంటే ఆస్ట్రేలియా గడ్డపై భారత్ రెండో భారీ స్కోరు నమోదు చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో చతేశ్వర్ పుజారా, రిషభ్ పంత్ సెంచరీలకు తోడు మయాంక్ అగర్వాల్, రవీంద్ర జడేజా అర్ధ సంచరీలు తోడవడంతో 622/7 భారీ స్కోరును నమోదు చేసింది. దీనికి ముందు 2004లో సిడ్నీ మైదనంలోనే 705/7తో భారీ స్కోరు సాధించింది.

పుజారా అత్యధిక పరుగుల రికార్డు..

ఆస్ట్రేలియాలో ఆసియా ఉపఖండం జట్లలో అత్యధిక వ్యక్తిగత పరుగుల రికార్డులో చతేశ్వర్ పుజారా (193) చోటు సంపాదించుకున్నాడు. పుజారాకు ముందు సచిన్ తెండూల్కర్ (241 నాటౌట్), రాహుల్ ద్రవిడ్ (233), రవిశాస్త్రి (206), అజార్ అలీ (పాక్, 205), వీరేంద్ర సెహ్వాగ్ (195) ఉన్నారు.

రిషబ్ ఖాతాలో రికార్డులు..

భారత వికెట్ కీపర్ ఖాతాలో మరో రికార్డు చేరింది. విదేశీ గడ్డపై భారీ స్కోరు సాధించిన ఏసియాన్ వికెట్ కీపర్లలో రిషబ్ బంగ్లా కీపర్ ముష్ఫికర్ రహీంతో పాటు అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. రహీం 2017 వెల్లింగ్‌టన్‌లో న్యూజిలాండ్‌పై ఈ ఘనతను సాధించాడు. మరోవైపు భారత్-ఆస్ట్రేలియా జట్లలో అతి పిన్న వయసులోనే (21ఏళ్ల 92 రోజులు) సెంచరీ సాధించిన నాలుగో ఆటగాడిగా రికార్డుకెక్కాడు. ఈ జాబితాలో (18ఏళ్ల 256 రోజులు) మాస్టర్ బ్లాస్టర్ సచిన్ తెండూల్కర్ ముందువరుసలో నిలిచాడు. 1992 సిడ్నీ వేదికగా జరిగిన టెస్టు మ్యాచ్‌లో సచిన్ (148 నాటౌట్) ఈ ఘనతను అందుకున్నాడు.

లియాన్ 15సార్లు!

భారత్- ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న చివరి టెస్టు రికార్డులకు వేదికైంది. ఆస్ట్రేలియా స్పిన్నర్ నాథన్ లియాన్ రెండో రోజూ మంచి ఫాంలో ఉన్న చతేశ్వర్ పుజారా (193)ను తన బౌలింగ్‌లో తానే క్యాచ్ అందుకొని రికార్డు సృష్టించాడు. ఒక బ్యాట్స్‌మన్‌ను ఇలా అవుట్ చేయడం లియాన్‌కు 15వ సారి. ఓవరాల్ ఈ జాబితాలో శ్రీలంక వెటరన్ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ 35 సార్లు, ఆస్ట్రేలియా లెజెండ్ షేన్ వార్న్ 21 సార్లు మొదటి రెండు స్థానాల్లో ఉండగా, లియాన్ ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు.

స్కోర్‌బోర్డు..

భారత్ తొలి ఇన్నింగ్స్: మాయాంక్ అగర్వాల్ (సీ) మిచెల్ స్టార్క్ (బీ) నాథన్ లియాన్ 77; లోకేష్ రాహుల్ (సీ) షాన్ మార్ష్ (బీ) జోస్ హాజెల్‌వుడ్ 9; చతేశ్వర్ పుజారా (సీ), (బీ) నాథన్ లియాన్ 193; విరాట్ కోహ్లీ (సీ) టిమ్ పైన్ (బీ) జోస్ హాజెల్‌వుడ్ 23; అజింక్య రహానే (సీ) టిమ్ పైన్ (బి) మిచెల్ స్టార్క్ 18; హనుమ విహారి (సీ) లాబుస్చాన్ (బీ) నాథన్ లియాన్ 42; రిషబ్ పంత్ 159 (బ్యాటింగ్); రవీంద్ర జడేజా (బీ) నాథన్ లియాన్ 81.

ఎక్‌స్ట్రాలు: 20, మొత్తం (167.2 ఓవర్లలో 7 వికెట్లకు) 622.

వికెట్ల పతనం: 1-10, 2-126, 3-180, 4-228, 5-329, 6-418, 7-622

బౌలింగ్: మిచెల్ స్టార్క్ 26-0-123-1, జోస్ హాజెల్‌వుడ్ 35-11-105-2, పాట్ కమిన్స్ 28-5-101-0, నాథన్ లియాన్ 57.2-8-178-4, మామస్ లాబుస్చాన్ 16-0-76-0.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: మార్కస్ హారిస్ 19 (బ్యాటింగ్), ఉస్మాన్ ఖాజా 5 (బ్యాటింగ్)

ఎక్‌స్ట్రాలు: 0; **మొత్తం:** (10 ఓవర్లలో) 24.

బౌలింగ్ : మహమ్మద్ షమీ 3-0-9-0, జస్ప్రీత్ బూమ్రా 3-0-12-0, రవీంద్ర జడేజా 2-1-1-0, కుల్దీప్ యాదవ్ 2-1-2-0.

బులియన్

ముంబయిలో		హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)		**బంగారం (22 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,123.00	1 గ్రాము:	రూ. 3,053.00
8 గ్రాములు:	రూ.24,984.00	8 గ్రాములు:	రూ. 24,424.00
10 గ్రాములు:	రూ. 31,230.00	10 గ్రాములు:	రూ. 30,530.00
100 గ్రాములు:	రూ.3,12,300.00	100 గ్రాములు:	రూ. 3,05,300.00
బంగారం (24 క్యారెట్స్)		**బంగారం (24 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,225.00	1 గ్రాము:	రూ. 3,195.00
8 గ్రాములు:	రూ. 26,040.00	8 గ్రాములు:	రూ. 25,560.00
10 గ్రాములు:	రూ. 32,550.00	10 గ్రాములు:	రూ. 31,950.00
100 గ్రాములు:	రూ. 3,25,500.00	100 గ్రాములు:	రూ. 3,19,500.00
వెండి		**వెండి**	
8 గ్రాములు:	రూ. 331.60	8 గ్రాములు:	రూ. 331.60
10 గ్రాములు:	రూ. 414.50	10 గ్రాములు:	రూ. 414.50
100 గ్రాములు:	రూ. 4,145.00	100 గ్రాములు:	రూ. 4,145.00
ఒక కిలో:	రూ. 41,450.00	ఒక కేజీ:	రూ. 41,450.00

ఇష్యూ పరిమాణంలో మార్పులకు

సెబీ కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ, జనవరి 4: ఇష్యూల అంచనాల పరిమాణాన్ని సవరించ దలచుకునే సంస్థలు కొత్తగా ఆఫర్ డాక్యుమెంట్లు దాఖలు చేసేలా మార్కెట్ రెగులేటర్ సెబీ మార్గదర్శకాలను రూపొందించింది. ఈ నిబంధనల మేరకు మార్కెట్‌లో విడుదల చేసిన ఇష్యూ అంచనాలను 20 శాతం అధికంగా, లేదా తక్కువగా మార్పు చేయాలనుకునే పక్షంలో సరికొత్త ఆఫర్ డాక్యుమెంట్‌ను సమర్పించాల్సి ఉంటుందని సెబీ శుక్రవారం విడదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం కొత్త ఇష్యూలతోబాటు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌సీ)లకు ఈ డాక్యుమెంట్ దాఖలు చేయాలన్న నిబంధన ఉంది. ఇందులో ఓఎఫ్ఎస్‌కు సంబంధించి ఒకవేళ ఆఫర్ చేసిన (అమ్మకానికి పెట్టిన) షేర్ల మొత్తంలో 50 శాతం కన్నా మార్పులు ఉంటే లేదా ఇష్యూ అంచనాల్లో మార్పులు ఉంటే సరికొత్త ఆఫర్ డాక్యుమెంట్లను సంబంధిత సంస్థలు సమర్పించాల్సి వుంటుందని సెబీ స్పష్టం చేసింది.

పద్దుల ప్రాతిపదికన కాకుండా ఇతర మార్గాల్లో ఇష్యూను రూపొందించిన పక్షంలో కనీసం 50 శాతం వాటాలను రిటెయిల్ మదుపర్లకుకు కేటాయించాలని, మిగిలింది వ్యక్తిగత దరఖాస్తుదారులకు, కార్పొరేట్ సంస్థలకు, లేదా విభాగాలకు కేటాయించడం జరుగుతుందని సెబీ వెల్లడించింది. దరఖాస్తు చేసిన సెక్యూరిటీలకు అతీతంగా ఈ కేటాయింపులు జరుగుతాయి. కాగా ఈ కొత్త నిబంధనలకు మరింత బలం చేకూర్చేందుకు సెబీ తన మూలధన, వెల్లడించ దగిన అవసరాలకు సంబంధించిన నియంత్రణలకు సవరణ చేసింది.

వాణిజ్యభూమి



చివరి రోజు ఊరట

- 181 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబయి, జనవరి 4: ఈవారానికి చివరి రోజైన శుక్రవారం స్టాక్ మార్కెట్‌కు ఊరట లభించింది. వరుస నష్టాలను ఎదుర్కొన్న సెన్సెక్స్ కొంత వరకు మెరుగుపడింది. 181.39 పాయింట్లు ఎగబాకి, 35,695.10 పాయింట్ల వద్ద ముగిసింది. బుధ, గురు వారాల్లో కొనసాగిన పతనం శుక్రవారం కూడా తప్పదనే అభిప్రాయం బలంగా వినిపించింది. కానీ, అందుకు భిన్నంగా ఉదయం ట్రేడింగ్ మొదలైన తర్వాత అమ్మకాల ఒత్తిడి తగ్గి, మార్కెట్ కొనుగోళ్లతో సందడిగా మారింది. నిఫ్టీ కూడా 55.10 పాయింట్లు లాభపడడంతో 10,727.35 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం మొత్తంలో సెన్సెక్స్ 381.62 పాయింట్లు, నిఫ్టీ 132.55 పాయింట్లు నష్టపోయిన నేపథ్యంలో, వారాంతం కొంత మెరుగైన పరిస్థితి కనిపించడం ట్రేడర్ల ఆశలకు ఊతమిచ్చింది. ఎస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, వేదాంతా, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్ కంపెనీల షేర్లు 3.05 శాతం లాభాలను ఆర్జించాయి. అయితే, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఇన్ఫోసిస్, హీరో మోటో కార్ప్,డస్ఇండ్ బ్యాంక్, సన్ ఫార్మా తదితర కంపెనల షేర్లు సగటున 1.55 శాతం నష్టాలను చవిచూశాయి. వివిధ రంగాలను పరిశీలిస్తే, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, మెటల్, ఫార్మా సూచీల ర్యాలీ కొనసాగింది. వీటిలో చాలా వరకు రంగాలు రెండు శాతాన్ని మించిన లాభాలను నమోదు చేశాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రా బ్యాంక్, ఎస్‌బీఐ వంటి ప్రభుత్వ రంగ బ్యాంకులు సగటున 4 శాతం లాభాన్ని సంపాదించాయి. అమెరికా, చైనా మధ్య వాణిజ్య పరమైన చర్చలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, అమెరికా స్టాక్ మార్కెట్ సూచీలు సానుకూలంగా స్పందించాయి. వచ్చే వారం ఆరంభంలో అమెరికాకు చెందిన అధికారుల బృందం చైనా వెళ్లి, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలపై చర్చలు జరుపుతుంది. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధానికి ముగింపు పలకాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జీ జింగ్‌పిన్ స్థూలంగా ఒక అవగాహనకు రావడంతో సమస్యకు తెరపడుతుందనే అభిప్రాయం ఇరు వర్గాల్లో కనిపిస్తున్నది. కాగా, ఈ పరిణామం స్టాక్ మార్కెట్‌కు అనుకూలించింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) అందించిన వివరాల ప్రకారం విదేశీ పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐ) 972.81 కోట్ల రూపాయల షేర్లను అమ్మారు. అయితే, దేశీయ మదుపరులు కొనుగోళ్లను కొనసాగించారు. వీరు కొన్న వాటాల విలువ 34.52 కోట్ల రూపాయలు. ఇలావుంటే, ఫోరెక్స్ మార్కెట్ శుక్రవారం కొంత బలపడింది. 33 పైసలు మెరుగు కావడంతో డాలర్ విలువ 69.87 రూపాయలుగా నమోదైంది.

89 లక్షల టన్నుల నూనె గింజలు,

పప్పు ధాన్యాల కొనుగోలు

న్యూఢిల్లీ, జనవరి 4: 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి గడచిన డిసెంబర్ వరకు కేంద్ర ప్రభుత్వం మొత్తం 89 లక్షల టన్నుల నూనె గింజలను, పప్పు దినుసులను కొనుగోలు చేసింది. ఈ కొనుగోళ్లు తదుపరి కూడా కొనసాగుతాయని శుక్రవారం రాజ్యసభలో వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్ సింగ్ వెల్లడించారు. ప్రశ్నోత్తరాల సెషన్‌లో సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఎగువ సభలో మంత్రి సమాధానమిస్తూ గడచిన 2010-2013 సంవత్సరాల కాలంలో 8లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేయగా గడచిన మూడేళ్ల కాలంలో ఈ కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయని ఆయన తెలిపారు. నాఫెడ్ మద్దతు ధర పథకం (పీఎస్ఎస్) ద్వారా ఈ కొనుగోళ్లు జరుగుతున్నాయని వివరించారు. కాగా మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రైతు ఉత్పత్తులకు కనీస మద్దతు (ఎంఎస్‌పీ) కల్పనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. అధిగ దిగుబడుల కారణంగా బంగాళా దుంప లాంటి ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టినపుడు ప్రభుత్వం రైతులను ఆదుకున్నట్టు తెలిపారు. ఆ ప్రాంతాల్లో 50-50 శాతం వాటాల పద్ధతిలో దిగుబడులను ప్రభుత్వాలు కొనుగోలు చేయడం జరిగిందన్నారు.

ఫోరెన్సిక్ ఆడిట్‌కు

హైదరాబాద్ సంస్థ

- శరత్ అండ్ అసోసియేషన్‌ను ఎంపిక చేసిన సెబీ



న్యూఢిల్లీ, జనవరి 4: వివిధ సంస్థలు సమర్పించిన ఆర్థిక వాంగ్మూలాలకు (ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్)కు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేందుకు హైదరాబాద్‌కు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ శరత్ అండ్ అసోసియేషన్‌ను సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ బోర్ట్ ఆఫ్ ఇండియా (సెబీ) ఎంపిక చేసింది. దీంతో ఈ సెబీ ఎంపిక చేసిన ఇలాంటి సంస్థలు పదికి చేరుతాయి. వాంగ్మూలాలను శరత్ అండ్ అసోసియేషన్ లోతుగా పరిశీలించి అందులో మోసాలు తలెత్తకుండా చూస్తుందని సెబీ వివరించింది. ఇప్పటికే సెబీ ఎంపిక చేసిన జాబితాలో కేపీఎంజీ, గ్రాంట్ థామ్టన్, ఇఆర్ఎన్ఎస్‌టీ అండ్ యంగ్ అసోసియేట్స్ ఎల్ఎల్‌పీ, డెలాయిట్ టౌచే తోహమట్సు ఇండియా లిమిటెడ్ ఎల్ఎల్‌పీ, చోక్షీ అండ్ చోక్షీ ఎల్ఎల్‌పీ, జీడీ ఆప్టే అండ్ కో సీఏ, జేఎల్ఎన్ యూఎస్ అండ్ కో, పిపారా అండ్ కో ఎల్ఎల్‌పీ, టీఆర్ చధా అండ్ కో ఎల్ఎల్‌పీ సంస్థలను గత అక్టోబర్‌లో ఎంపిక చేసింది.

మందగించిన సేవల రంగం



బెంగళూరు, జనవరి 4: దేశంలో సేవల రంగం అనుకున్న స్థాయిలో లేకపోగా, మందగించడం పలు వర్గాలను ఆందోళనకు గురి చేస్తున్నది. నవంబర్‌లో 53.3 శాతంగా ఉన్న సేవల సూచీ డిసెంబర్‌లో 52.7 శాతానికి పడిపోయింది. ఈ పరిణామంతో సేవల రంగంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న వారు భయపడుతున్నారు. అదే విధంగా కొత్తగా ఈ రంగంలో ఉపాధిని వెతుక్కునే వారు కూడా తమ భవిష్యత్తుపై స్పష్టత కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చ్తేన్నారు. అయితే, మార్కెట్ నిపుణుల అభిప్రాయం, తాజాగా నిర్వహించిన సర్వేల ఫలితాల ప్రకారం దేశంలో సేవల రంగమే ఉపాధి కల్పనలో మిగతా రంగాల కంటే అగ్రస్థానంలో ఉంది. ఎక్కువ మందికి ఉద్యోగ కల్పన కూడా సేవల రంగం వల్లే సాధ్యమవుతున్నది. దేశంలో సేవలకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్న కారణంగా, భవిష్యత్తు ఎంతో ఆశాజనకంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. డిసెంబర్‌లో కొంత తగ్గుదల కనిపించినప్పటికీ, ఈ ఏడాది ఫిబ్రవరిలో మాదిరి 47.8, అదే విధంగా మే మాసంలో నమోదైన 49.6 శాతం వంటి కనిష్ట స్థాయి కాదని గుర్తుచేస్తున్నారు. కాబట్టి, త్వరలోనే ఈ రంగం కోలుకుంటుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద సేవల రంగంలో అభివృద్ధి కుంటుపడడం ఆందోళన కలిగిస్తున్న అంశమే.

ఈవీఎంలు కాలిక్యులేటర్లే

ట్యాంపరింగ్ అసాధ్యం ❖ ఈసీ మాజీ చీఫ్ రావత్



జైపూర్, జనవరి 4: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం)ల ట్యాంపరింగ్‌కు అవకాశమే లేదని కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధానాధికారి ఓపీ రావత్ పునరుద్ఘాటించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈవీఎంలు రూపొందించినట్టు ఆయన స్పష్టం చేశారు. ఈవీఎంలు కేవలం కాలిక్యులేటర్లుగా పనిచేస్తాయే తప్ప ట్యాంపరింగ్‌కు ఆస్కారం లేదని ఆయన వివరించారు. జైపూర్‌లో శుక్రవారం నాడు 'రాజస్థాన్ పత్రిక' ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో రావత్ పాల్గొన్నారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ అవుతున్నట్టు రాజకీయ పార్టీలు తరచూ ఆరోపించడం తెలిసిందే. ఈసీ కూడా ఈవీఎంలపై వస్తున్న ఆరోపణలు తోసిపుచ్చుతూ క్లీన్‌చిట్ ఇస్తోంది.'అన్ని రాజకీయ పార్టీలూ ఈవీఎంల పనితీరుపై ఫిర్యాదులు చేస్తున్నాయి. ఇవి సామాన్య ప్రజల్లోనూ అనుమానాలకు రేకెత్తిస్తున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం అనుమానాల నివృత్తి చేస్తునే ఉంది' అని రావత్ పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో ఈవీఎంలు రూపొందిస్తున్నారని ఆయన అన్నారు. వై-ఫై టెక్నాలజీ, ఇంటర్‌నెట్‌కు అనుసంధానం చేసి ఉంటాయని రావత్ తెలిపారు.'మన దగ్గరున్న ఈవీఎంలు కాలిక్యులేటర్లుగా పనిచేస్తాయి. వీటిని ట్యాంపరింగ్ చేయడం లేదా హ్యాక్ చేయడం అన్నది జరగదు' అని మాజీ చీఫ్ స్పష్టం చేశారు. ఓటమి పాలైన రాజకీయ పార్టీ ఈవీఎంలను తప్పుపట్టడం మామూలు వ్యవహారంగా మారిపోయింది. నకిలీ వార్తలు మీడియాకు పెను సవాల్‌గా మారిపోయాయని దీనిపై అప్రమత్తంగా ఉండాలని రావత్ పిలుపునిచ్చారు.



రాజ్యసభలో శుక్రవారం మహిళా బిల్లుపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా మాట్లాడుతున్న సమాజ్‌వాది పార్టీ సభ్యురాలు జయాబచ్చన్

మహిళా బిల్లుకు మోక్షం కలిగించండి

రాజ్యసభలో మహిళా ఎంపీలు డిమాండ్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: లోక్‌సభలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని రాజ్యసభలో అన్ని పార్టీలకు చెందిన మహిళా ఎంపీలు డిమాండ్ చేశారు. రాజ్యసభలో శుక్రవారం మహిళా సభ్యుల విజ్ఞప్తి మేరకు జీరో అవర్‌లో చైర్మన్ వెంకయ్యానాయుడు రిజర్వేషన్ బిల్లుపై స్వల్పకాలిక చర్చకు అనుమతినిచ్చారు. ముందుగా ఈ చర్చను సమాజ్‌వాదీ పార్టీ సభ్యురాలు జయా బచ్చన్ ప్రారంభించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పార్టీ వ్యతిరేకం కాదన్నారు. సమాజ్‌వాదీ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకమంటూ చేస్తున్న ప్రచారాన్ని ఆమె ఖండించారు. మహిళా రిజర్వేషన్లు కోసం తమ పార్టీ కట్టుబడి వుందని, ఆ బిల్లులో కొన్ని సవరణలను మాత్రమే కోరుతున్నట్టు ఆమె చెప్పారు.

ప్రస్తుతం ఉన్న బిల్లు పట్టణ, సంపన్న మహిళలకు మాత్రమే ప్రయోజనం చేకూరుస్తుందని జయాబచ్చన్ పేర్కొన్నారు. గ్రామీణ మహిళలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే బిల్లులో తాము సవరణలు కోరుతున్నామని ఆమె స్పష్టం చేశారు. టీడీపీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ తమ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతునిస్తుందని చెప్పారు. సీపీఎం సభ్యురాలు జార్నాదాస్ వైద్య మాట్లాడుతూ లోక్‌సభలో ఏన్డీయే ప్రభుత్వానికి సంపూర్ణ మెజారిటీ ఉన్నప్పటికీ బిల్లుకు ఆమోదం లభించకపోవడం దారుణమన్నారు. టీఎంసీ సభ్యురాలు శాంత చెత్రి మాట్లాడుతూ 2014 లోకసభ ఎన్నికల్లో మహిళలకు మూడోవంతు టిక్కెట్లు తమ పార్టీ ఇచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు ఇప్పటికే 50శాతం రిజర్వేషన్లను తృణమూల్ కాంగ్రెస్ ఇచ్చిందని ఆమె వెల్లడించారు. డీఎంకే ఎంపీ కనిమోళి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును లోక్‌సభలో తీసుకురాలన్నారు. దేశంలో మహిళలపై వివక్ష ఇప్పటికీ కొనసాగుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశాలను అడ్డుకుంటున్నారని ఈ సందర్భంగా కనిమోళి ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి విప్లవ్ ఠాకూర్, జేడీయూ నుంచి నుంచి కాకషాన్ ఫర్వీన్, బీజేపీ నుంచి సంపత్య ఊరికే తదితరులు ఈ చర్చలో పాల్గొన్నారు.



కొత్త సంవత్సరం అమాంతం వారిని శ్రీమంతులను చేసింది. ఏటేటా యూరో మిలియన్స్ న్యూఇయర్ డే లాటరీ తగలడంతో ఉత్తర ఐర్లాండ్‌కు చెందిన ఫ్రాన్సిస్ కనోలీ, పాట్రిక్ కనోలి జంట పంట పడింది. ఏకంగా వారి ముంగిట్లో 114,969,775 పౌండ్లు వచ్చి పడ్డాయి. దర్జాగా ఆ చెక్కును చూపిస్తున్న కనోలీ దంపతులు. యూకో లాటరీలో ఇది నాలుగో అతి పెద్ద బహుమతి.

Printed and Published by T. Venkateswarlu on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor T.V.Ravi Reddy,
PBX 27803930 (6Lines), Editorial: 27805056, Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

శనివారం, 5 జనవరి 2019


జీవన(ది) వేదన బుధ్నీ జీవితం

నవభారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్యానంతరం జాతీయ స్థాయి భారీ నీటిపారుదల పథకాలను ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించారు. 1948లో దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, దామోదర్ నదీ జలాలను పంట పొలాల సౌభాగ్యానికి వినియోగించే నీటిపారుదల పథకాలను చేపట్టింది. దానిలో భాగంగా పశ్చిమ బెంగాల్, బీహార్ సరిహద్దులలో (ప్రస్తుతం జార్ఖండ్) ధనబాద్ జిల్లా పాంచెట్ వద్ద రు.19 కోట్ల వ్యయంతో నిర్మించబడిన నాల్గవ డ్యామ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో, భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఊహించని రీతిలో వ్యవహరించి, ఒక విషాద కథనానికి పరోక్షంగా బాధ్యులయ్యారు.

స్వతంత్ర భారతావనిలో దశాబ్దాల ప్రస్థానంలో, 60ళ్ళ నాటి ఆ ప్రారంభోత్సవంలో నాడు జరిగిన అపురూప సంఘటన చరిత్రలో నిక్షిప్తమైన జీవన వైచిత్రిగా నిలిచిపోయింది. అప్పటి రోజులలో దామోదర్ నది సృష్టించే వరద బీభత్సం కారణంగా ఆ నదిని బెంగాల్ విషాద నది గా పిలిచేవారు. డామ్ నిర్మాణంలో ఆ ప్రాంతాలలో అధికంగా నివసించే సంతాల్ ఆదివాసీ తెగలకు చెందిన గిరిజన కుటుంబాలు నిర్మాణ కార్మికులుగా శ్రమించారు. 15 సంవత్సరాల వయసున్న బుధ్నీ మెజ్‌హాన్ అందరితో కలిసి తట్టలు మోసే కూలి పనిలో పాల్గొనవలసి వచ్చింది. పాంచెట్, మైథా నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంవలన పునరావాసం కోసం ముంపు కారణంగా, తరలి వెళ్లిన బాధితులలో 56.46 శాతం ఆదివాసీలుగా గుర్తించబడింది.

నాడు కర్బొనా ఆదివాసీపల్లెలో నివసించే బుధ్నీ మెజ్‌హాన్‌కు దేశ ప్రధాని ఘనత తెలియదు. జవహర్‌లాల్ నెహ్రూ గొప్పతనం అసలే తెలియదు. తాను మట్టిమోసిన, రాళ్ళెత్తిన పని పూర్తయిందని మాత్రం తెలుసు. అంతే.. ఆ రోజు 1959 డిసెంబర్ 6వతేదీ. జవహర్ లాల్ నెహ్రూకు ఆ సందర్భంలో ఒక ఆలోచన వచ్చింది. డ్యామ్ ప్రారంభోత్సవం తానే ఎందుకు చెయ్యాలి? కష్టించి పనిచేసిన నిర్మాణ కార్మికులకు ఆ అవకాశం ఇవ్వాలనిపించింది. ప్రధానమంత్రి ఆలోచనను వెంటనే ఆచరణలో పెట్టాలని అధికారులు నిర్ణయించారు. సంప్రదాయ వేషధారణ, ఆదివాసీ అలంకరణలతో, తలలో కొండపువ్వు, అమాయకత వుట్టిపడే చూపులు, నల్లటి ఛాయ వున్న బుధ్నీని ఒప్పించి వేదికపైకి తీసుకెళ్లారు. ఛార్మింగ్ ప్రిన్స్ ఆఫ్ ఇండియా ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సరసన అమాయక గిరిజన బాలిక. డ్యామ్ ప్రారంభోత్సవ సంకేతంగా ఆమె పవర్ స్టేషన్ బటన్ నొక్కటం. ఆ సంఘటన దేశమంతటా సంచలనం కలిగించింది. మీడియా నెహ్రూ ఆలోచనలపై ప్రశంసల వర్షం కురిపించింది. ప్రపంచం హర్షించింది.

బుధ్నీ మెజ్‌హాన్ ఇంటికి తిరిగి రావటంతోనే అసలు కథ ప్రారంభమైంది. సంతాల్ ఆదివాసీ పెద్దల సమావేశం జరిగింది. ఆమె నెహ్రూకు దండ వేసింది కనుక గిరిజన తెగ ఆచారం సంప్రదాయం ప్రకారం పెళ్లిచేసుకొన్నట్లే. కానీ వ్యక్తి సంతాల్ తెగకు చెందినవాడు కాదు. ఆ అపరాధ నేరానికి ఆమెకు బహిష్కరణ శిక్ష పడింది. ఆమె బతుకు అడవిపాలైంది. పాంచెట్ నివాసి సుధీర్ దత్తా ఆశ్రయం పేరిట, ఆమెను తరువాత తల్లిని చేశాడు.


బుధ్నీతో డ్యామ్ ప్రారంభోత్సవం చేయిస్తున్న నెహ్రూ

మూడేళ్ళ తరువాత పని ఊడిపోయి రోజు గడవటం కష్టమైంది. బతుకు భారమైంది. 1964లో నెహ్రూ మరణించేనాటికి ఆమె జీవితం దుర్భరంగా వుంది. చాకిరీతో బతకటం కష్టమవడంతో ఎవ్వరో సలహా ఇచ్చారు, ఢిల్లీకి వెళ్లి 1980లో నెహ్రూ మనవడు రాజీవ్‌కు మొరపెట్టుకొంది. మళ్లీ పని దొరికింది. 2001లో ఒక వెబ్‌సైటులో నెహ్రూ ఆదివాసీ భార్య అంటూ ఆమె దుర్భర దారిద్ర్య వేదన కథనం వచ్చింది. 58 ఏళ్ల బుధ్నిని అప్పటికి ఊరు పొమ్మంది. తరువాత పదేళ్ల జీవితం ఎలా తెల్లారిందో ఎవ్వరికీ తెలియదు.

స్వాతంత్ర్యానంతరం నవభారత నిర్మాణంలో తిండి గింజల ప్రాధాన్యత దృష్ట్యా భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలుగా జాతి నేతలు పరిగణించారు. శాస్త్రీయ ప్రగతి, పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా పంచవర్ష ప్రణాళికలు కొనసాగాయి. అటవీ, జల, ఖనిజ ఇతర ప్రకృతి వనరులను కొల్లగొట్టడమే అభివృద్ధి, ప్రగతి, స్వయం సమృద్ధి, స్వావలంబనకు మార్గమైంది. 2000 సంవత్సరం నాటికే భారీ ప్రాజెక్టుల కారణంగా 50 మిలియన్ పైగా సంఖ్యలో ఆదివాసీలు, నిరుపేదలు నిర్వాసితులయ్యారు. అడవుల నరికివేత, నదులపై భారీ ప్రాజెక్టులతో నిస్సహాయ, అమాయక ఆదివాసీల జీవన విధ్వంసం యథేచ్ఛగా కొనసాగుతోంది. గంగానదిపై జల విద్యుత్ కేంద్రాలు, గంగ, నర్మదా, గోదావరిపై ప్రాజెక్టులు, మైనింగ్ పేరిట కొండల విధ్వంసం ప్రస్తుత నాల్గవ పారిశ్రామిక విప్లవంలో దేశం శరవేగంగా దూసుకుపోతోంది. అరవై ఏళ్ళ నాటి ఆదివాసీ బాలిక బుధ్నీ విషాద జీవన కథనం దామోదర నదీ జలగర్భంలో సమాధి అయింది. వెలుగుచూడని ఇటువంటి కథనాలు చరిత్ర నిర్మిస్తున్నాయి. ఇది గతం కాదు ప్రస్తుత వాస్తవం.

-జయసూర్య
94406 64610

ఆ నిబద్ధతకు, ధైర్యానికి జోహారు..



పంటి బిగువన బాధను భరిస్తూ కెమెరా పట్టుకున్న ఈ మహిళ పేరు షాజిలా అబ్దుల్‌రెహమాన్. ఓ వైపు నిరసనకారులు ఆమెపై దాడి చేస్తున్నా.. కర్తవ్య నిర్వహణకే తలొగ్గింది. గాయాల బాధను కూడా దిగమింగి తన కెమెరాతో ఆందోళనలను షూట్ చేసింది. వివరాల్లోకి వెళితే..

కైరాలీ టీవీలో కెమెరా పర్సన్‌గా పనిచేస్తోంది షాజిలా అబ్దుల్‌రెహమాన్.. శబరిమల ఆలయంలోకి యాభై ఏళ్లలోపు ఇద్దరు మహిళలు ప్రవేశించడంతో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగిన విషయం తెలిసిందే.. ఈ నేపథ్యంలో తిరువనంతపురంలో జరిగిన ఆందోళనలను కవర్ చేసేందుకు షాజిలా తన బృందంతో వెళ్లింది. ఆ సమయంలో కొందరు ఆందోళనకారులు మీడియా వ్యక్తులపై కూడా దాడికి దిగారు. ఆ దాడుల్లో భాగంగానే షాజిలా కెమెరా లాక్కొని ఆమెను నెట్టేశారు. అయినప్పటికీ ఆమె వెనుకడుగు వేయలేదు. దాడిలో తనకు గాయమైనా, ఆ బాధను పంటి బిగువన బిగపట్టి విధులు నిర్వహించింది. ఆందోళనకారుల నుంచి కెమెరాను బలవంతంగా తీసుకుని తన రిపోర్టింగును కొనసాగించింది. కన్నీటితో కెమెరా పట్టుకుని షూట్ చేస్తున్న షాజిలా ఫొటోను కేరళ దినపత్రిక ఒకటి ప్రచురించింది. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వృత్తి పట్ల షాజిలాకు ఉన్న నిబద్ధతకు, ఆమె ధైర్యానికి ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు నెటిజన్లు. ★



నాలుగో అతిపెద్ద మానవహారం

స్త్రీ-పురుష సమానత్వానికి ప్రతీకగా పేర్కొంటూ కేరళలో అతి పెద్ద మానవహారం జరిగింది. జనవరి ఒకటో తేదీన కేరళ ఉత్తరభాగంలో కాసరగాడ్‌లో ప్రారంభమైన ఈ మానవహారం, దక్షిణ కేరళలోని తిరువనంతపురంలో గల వెల్లయంబాలమ్ వరకు సముద్రతీరం వెంబడి రహదారుల మీదుగా కొనసాగింది. ఇందులో దాదాపు 50 లక్షల మంది మహిళలు, యువతులు, బాలికలు చేయిచేయి కలిపి 620 కిలోమీటర్ల పొడవైన మానవహారంగా నిల్చున్నారు. ఇది ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద మానవహారంగా కేరళ మహిళల మానవహారం రికార్డు సాధించింది. ప్రపంచంలోనే అతి పొడవైన మహిళా మానవహారంగా ఈ విమెన్ వాల్ రికార్డులకెక్కనుందని గిన్నిస్ బుక్ జ్యూరీ తెలిపింది.


గణాంకాల ప్రకారం 2017లో బీహార్‌లో నిర్వహించిన మానవహారం ప్రపంచంలోనే అతి పెద్దది. ఇక్కడి నితీశ్‌కుమార్ ప్రభుత్వం పూర్తిస్థాయి మద్యనిషేధాన్ని తీసుకొచ్చింది. దీనికి మద్దతు పలుకుతూ దాదాపు రెండు కోట్ల మంది ప్రజలు 12, 670 కిలోమీటర్ల పొడవైన మానవహారంగా నిల్చున్నారు. ప్రపంచంలోకెల్లా ఇదే అతి పెద్ద మానవహారం. ఇక 1986లో యునైటెడ్ స్టేట్స్‌లో నిర్వహించిన హ్యాండ్స్ అక్రాస్ అమెరికా రెండో అతి పెద్ద మానవహారం. పేద ప్రజలు, ఆకలితో అలమటిస్తున్న నిరాశ్రయులకు సాయం చేసేందుకు అమెరికాలోని ఓ ఛారిటీ సంస్థ ఏర్పాటుచేసిన ఈ మానవహారంలో దాదాపు 65 లక్షల మంది పాల్గొన్నారు. 2004లో బంగ్లాదేశ్‌లో చేపట్టిన అవిశ్వాస మానవహారం ప్రపంచంలోనే మూడో అతి పెద్ద మానవహారంగా రికార్డు నమోదు చేసింది. ఇందులో యాభై లక్షల మందికి పైగా ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు, ప్రజలు పాల్గొని 1,050 కిలోమీటర్ల పొడవైన మానవహారంగా నిల్చున్నారు. ★





తల్లిపాలు పట్టించే టెక్నాలజీతో ఇబ్బందా?





తల్లిపాల గొప్పతనం గురించి కొత్తగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. అయితే ఇక్కడ విషయం ఏంటంటే.. మొదటిసారిగా తల్లైన తల్లులకు, పాలిచ్చే తల్లులకు చాలా రకాలుగా సహకరించే ఆప్‌లు అందుబాటులోకి వచ్చాయి. బిడ్డ ఎంత గ్యాప్‌తో పాలు తాగుతోంది.., చివరిసారిగా ఏ వైపు తాగింది.., సగటున బిడ్డ ఎంతసేపు పాలు తాగుతోంది.., ఎంత సేపటికి ఒకసారి పాలు తాగుతుంది.. ఇలాంటి సమాచారాన్ని ఈ ఆప్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా అన్ని వైద్య సంస్థలూ తల్లిపాలు పట్టించడం వల్ల అటు పిల్లలకు, ఇటు తల్లులకు కలిగే లాభాలను ప్రచారం చేస్తున్నాయి. కానీ పసికందులకు పాలు పట్టించడంలో చాలామంది తల్లులు ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలకు సరిగ్గా పాలు పట్టించలేకపోతున్నామని కొందరు బాధపడుతున్నారు.


పిల్లలకు పాలు పట్టించడంలో తల్లులకు సహకరించే టెక్నాలజీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది. ఫలితంగా ఈ వ్యాపారం ఎక్కువగా ఊపందుకుంది. కాలిఫోర్నియాకు చెందిన రియల్ ఎస్టేట్ ఉద్యోగం చేసే యాష్లే ఆల్బ్రెట్‌కు ఇద్దరు పిల్లలు. ఇద్దరూ నాలుగేళ్లలోపు వారే.. పిల్లలకు పాలివ్వటంలో బేబీ కనెక్ట్ అనే ఆప్ తనకు బాగా ఉపయోపడిందని ఆమె చెబుతున్నారు. ఈ ఆప్‌లో సమాచారం మొత్తాన్ని రికార్డు చేయటంతో పాటు అలారమ్‌లను కూడా పెట్టుకోవచ్చు. ఫలితంగా పాలివ్వటం, డైపర్లు మార్చటం, పిల్లల ఎదుగుదల, వారికి సంబంధించిన ముఖ్యమైన అంశాలు, ఆస్పత్రి సమాచారం, మందులు, ఆహారం.. ఇలా పిల్లలకు సంబంధించిన ప్రతి విషయానికీ ఈ ఆప్‌ను వాడుకోవచ్చు అని ఆల్బ్రెట్ చెబుతోంది. సమయాన్ని అక్కడ నిర్ణయిస్తే ఆ సమయాన్ని అనుసరించి అలారం మోగి తల్లులకు ఆ విషయాన్ని గుర్తు చేస్తుంది ఈ ఆప్. అమెరికాలో స్థిరపడిన ఫ్రెంచ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గ్జేవి



యర్ లానే 2008లో తన భార్య ఇద్దరు పిల్లలకు పాలు పట్టించడంలో సహకరించడానికే ఈ ఆప్‌ను రూపొందించాడు. ఫీడ్ బేబీ, మైమెడెల వంటి ఆప్‌లు కూడా ఇప్పుడు వినియోగంలో ఉన్నాయి. కానీ ఈ ఆప్‌లు బిడ్డల ఫీడింగ్‌కు ఉపయోగపడతాయని అందరూ ఒప్పుకోవట్లేదు.

తల్లికి తెలిసిన ఈ విషయాలన్నీ ఆప్ ద్వారా తెలుసుకోవడమేమిటి? అని చాలామంది అనుకోవచ్చు.. కానీ ఒక తల్లి పని కేవలం పిల్లల్ని చూసుకోవడమే కాదు.. తన జీవితాన్ని కూడా మెరుగులు దిద్దుకోవాలి. కెరీర్ పరంగా తనకున్న లక్ష్యాలను సాధించడం, స్వతంత్రంగా ఎదగడం కూడా.. కాబట్టి ఈ ఆప్‌ల సహకారం చేసుకుంటే నేటి మహిళ రెండింటినీ సంతోషంగా సమన్వయం చేసుకోగలుగుతుంది. కానీ ఈ ఆప్‌లు అర్థవంతమైనవి కావని, పిల్లల గురించి తల్లికి తెలిసినట్లుగా ఎవరికీ తెలియదు అని కొందరు అంటున్నారు. మనం ఇచ్చే సమాచారాన్ని విశ్లేషించి, మనకు కొత్త సమాచారాన్ని, విలువైన సలహాలను ఇచ్చేలా ఉండాలి ఆప్‌లు.. పంప్‌ల సహాయంతో పాలు తీసి, డబ్బాల్లో పోసి పిల్లలకు పట్టించడం మనకు కొత్త కాదు. అయితే మరో ఐదు సంవత్సరాల్లో ఈ పంప్‌లు పదకొండు శాతం పెరగనున్నాయని నిపుణులు అంటున్నారు. అయితే పాలు తీసేటప్పుడు ఈ పంప్‌లు వింత శబ్దాలు చేస్తున్నాయని కొందరు తల్లులు ఫిర్యాదు చేస్తున్నారు. కాబట్టి రాబోయేకాలంలో పెరుగుతున్న సాంకేతికతతో శబ్దాలను తగ్గించే అవకాశం కూడా ఉంది. ★

రంగవల్లి



ఎం. సుకన్య
ఇందుకూరు పేట,
నెలూలరు జిల్లా

24 చుక్కలు, 4 వరుసలు,
4 వరకు నిలుపు
సరిచుక్కలు

ముగ్గులకు ఆహ్వానం

నింగిలోని హరివిల్లులను నేలపైన పేర్చి.. కనులకింపైన రంగుల్ని అందంగా అద్దితే అది రంగుల మాలికవుతుంది. ముంగిట్లో రంగవల్లిక అవుతుంది. ధనుర్మాసం సందర్భంగా తెలుగు ముంగిళ్లలో రంగవల్లులను తీర్చిదిద్దడం ఆనవాయితీ.. ఆ సందర్భంగా ముగ్గులకు ఆహ్వానం పలుకుతోంది మాతృభూమి. ఆసక్తి కలవారు కింది చిరునామాకు ముగ్గులను పంపగలరు.

సూచనలు

★ ముగ్గులను పంపేవారు ఎ4 సైజు తెల్లకాగితంపై వేయాలి.

★ ముందుగా నల్లని ఇంక్‌తో ఔట్ లైన్ గీసిన తరువాత అందులో రంగుల్ని నింపాలి.

★ ఎన్ని చుక్కలను పెట్టి ముగ్గులు వేశారో.. అంటే సరిచుక్కలా, బేసి చుక్కలా, సందు చుక్కలా.. అనే విషయం స్పష్టంగా రాయాలి.

★ ముగ్గుతో పాటు, మీ పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫొటోని, చిరునామాని జతచేయాలి.

★ డౌన్‌లోడ్ చేసిన ముగ్గులు కాక, స్వయంగా చేతితో వేసిన ముగ్గులనే పంపాలి. అదీ చుక్కల ముగ్గులకే ఆహ్వానం.

ముగ్గులు పంపాల్సిన చిరునామా:
ఎడిటర్,
ఆంధ్రభూమి దినపత్రిక, సరోజినీదేవి రోడ్,
సికింద్రాబాద్- 500 003.

శ్రీనరసింహ శతకము

సీ॥ నీలమేఘశ్యామ! నీవె తండ్రివి మాకు
కమలవాసిని మమ్ము-కన్నతల్లి
నీ భక్తవరులంత నిజమైన బాంధవుల్
నీ కటాక్షము మా కనేక ధనము
నీ కీర్తనల్ మాకు లోక ప్రపంచంబు
నీ సహాయము మాకు నిత్యసుఖము
నీ మంత్రమే మాకు నిష్కళంకపు విద్య
నీ పదధ్యానంబు నిత్యజపము
తే॥ తోయజాతాక్ష! నీ పాద తులసిదళము
భోగముల కౌషధము బ్రహ్మ రుద్ర వినుత!
భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం:నరసింహస్వామి! మాకు తండ్రివి నీవే. లక్ష్మీదేవియే మా కన్నతల్లి. నీ భక్తులే మా బంధువులు. నీ దయయే మా సొమ్ము. నీ పాటలే మా లోకం. నీ నామజపమే మా విద్య. నీ పాద ధ్యానమే నిత్య జపం. నీ పాదాలమీద పూజ చేసిన తులసిదళం రోగాలన్నింటిని రూపుమాపే మందు. బ్రహ్మరుద్రులచే పొగడబడుచున్న ఓ స్వామీ! నీవే మాకు అన్నియూ.



అనంతం

28 -గోపరాజు నాగేశ్వరరావు

"ప్రోగ్రెస్ ఎలా వుంది" మత్తు కళ్ళతో గరుడాచలాన్ని చూస్తూ ఎవ్వరో అధికారి అడిగాడు.

"మూడు పువ్వులు ఆరు కాయలు" అన్నాడు గరుడాచలం.

"నేనడిగింది కలివికోడి ప్రాజెక్టు విషయం"

"అదా! ప్రగతి ధపంలో ముందుకు పోతోంది"

"ప్రగతిపథం" అనుకుంటానూ?"

అందరూ గలగలా నవ్వారు. నవ్వులు కూడా మత్తుగా ఉన్నాయి.

"ఆపరేషన్ విషయం అలా వుంచి-నెమళ్ళకొచ్చాయి తిప్పలు"

"ఏం? ఏమైంది? గరుడాచలం అడిగాడు.

"పొయ్యిలోకి పోతున్నాయి"

"తండా ఖాళీ చెయ్యమని నోటీసులివ్వాలా?" అన్నాడు గరుడాచలం.

"నోటీసులా! ఎందుకూ?" అడిగాడు పోలీసు అధికారి.

"నోటీసులివ్వకుండానే ఖాళీ చేయిస్తారా"

"ఏఁవంటారేం?"

"గవర్నమెంట్ ఫర్ ది గవర్నమెంట్- టు ది గవర్నమెంట్- బై ది గవర్నమెంట్"

"మనది ప్రజాస్వామ్యం కదూ?"

"అనుకోండి... ఎవరొద్దన్నారూ."

"అడివి పుత్రులు ఎదురుతిరిగితే?"

"లాఠీలున్నాయి. తుపాకులున్నాయి."

"బలవంతంగా ఖాళీ చేయిస్తారా."

"అవును."

"అడవి పుత్రుల రక్షణక్కూడా చట్టాలున్నాయి."

"తయారుచేసింది ప్రభుత్వమే."

"ఐతే?"

"ఉల్లంఘించే అధికారమూ ఉంటుంది."

అంతలో రాగ్యా లోపలికొచ్చాడు.

మాటలు కనిపెట్టి వాళ్ళు మౌనంగా కూర్చున్నారు.

"రొండు నెమళ్ళని సంపి తెచ్చారు. పొయ్యి కాడ బెట్టి వత్తన్నారు."అని, గరుడాచలం వైపు గర్వంగా చూసాడు రాగ్యా.

"రాగ్యా అంటే ఇతనే" గరుడాచలం అతన్ని అధికారులకు పరిచయం చేసాడు.

రాగ్యా ఛాతీ ఉబ్బింది!

"నిలబట్టం దేనికీ! కూర్చో రాగ్యా"అని కుర్చీ చూపించాడు గరుడాచలం.



కొంచెం తటపటాయించి, తర్వాత కూర్చున్నాడు.

"బాధగా వుందా"

"నాకెందుకు బాధ"

"మరెందుకలా అన్నావు?"

"జాతి అంతరించిపోతుందని"

"జీవకారుణ్యమా" పోలీసు అధికారిని గరుడాచలం అడిగాడు.

"మరోసారి వస్తే దొరకవన్న భయం"

మళ్లీ అందరూ పగలబడి నవ్వారు.

మరో రౌండు తర్వాత-

"అంతే"

"చట్టం అనుమతించదు"

"ప్రభుత్వం అనుమతిస్తే చాలు"

"అన్యాయం" అన్నాడు గరుడాచలం.

"ఇప్పటి న్యాయం అదే"

"గవర్నమెంట్ ఫర్ ది పీపుల్- అన్నారు కదా."

"వల్లకాడు కాదూ."

రాగ్యాకి కూడా మందు గ్లాసు అందింది.

వాళ్ళ అభిమానానికి పొంగిపోతూ-

"ఇంక నాకు అయ్యాయినా, అడివైనా గరుడాచలఁవ్ సారే." అన్నాడు వినయంగా రాగ్యా.

గుంభనంగా నవ్వుకున్నారు వాళ్ళంతా!

⁂

రాత్రి బాగా ప్రొద్దుపోయాక వచ్చాడు ఎమ్మెల్లే... పట్నంలోనే భోజనం గట్రా. అన్నీ అయ్యాయి. గుడారానికొచ్చి, ఓ గ్లాసు మజ్జిగ తాగి అలాగే పడుకున్నాడు.

బాగా మత్తులోవున్న స్థితిలోకూడా గరుడాచలం నిద్రపోకుండా ఎమ్మెల్లేకోసం ఎదురు చూసాడు.

రాగ్యా విషయం, చాంద్‌నీ విషయం మాట్లాడి ప్రాజెక్టు విషయంకూడా చర్చించాలనుకున్నాడు.

ప్రొద్దుపోయాక వచ్చాడు ఎమ్మెల్లే.

అలాంటి సమయంలో మాట్లాడటం మంచిదికాదని భావించి మాట్లాడలేదు.

తెల్లవారింది.

అడవి చెట్లమీద నుంచి పక్షుల కలకలా రావాలు, విప్పారే రెక్కల చప్పుళ్ళూ, గూటి పిట్టల కువకువలూ వినిపిస్తున్నాయి.

సూర్యుడు పైకి పాకేకొద్దీ చెట్ల నీడలు పొడవుగా సాగుతూ గుడారాల మీద పడుతున్నాయి.

ఇంకా ఎమ్మెల్లే నిద్రలేవలేదు.

రాగ్యా కాలకృత్యాలు తీర్చుకొని, స్నానం చేసి తయారయ్యాడు!

గరుడాచలం ఇచ్చిన పాత చొక్కా లాగూ ధరించి, తలగుడ్డ అవతల పారేసి తల దువ్వుకొని- రాగ్యా ఇప్పుడు ఎంతగా మారిపోయి కనిపిస్తున్నాడో!

అచ్చం కొత్తగా రియలెస్టేట్ వ్యాపారంలో దిగిన వాడిలా వున్నాడు!

రాగ్యాని చూసి ఫక్కున నవ్వాడు గరుడాచలం.

"ఏంటికట్టా నగుతుండారూ" రాగ్యా అతన్ని అడిగాడు.

"భాషకూడా మారిపోతే నాగరికుడివౌతావు! రెడ్డియానాయక్ తండా రాగ్యా ఇతనే' అన్నా ఎవ్వరూ నమ్మరు. ఈ డ్రెస్‌లో అంత బాగున్నావు" అన్నాడు గరుడాచలం.

రాగ్యా ఆనందం పట్టలేకపోయాడు.

"అంతా తఁవరి దయ"అన్నాడు వినయంగా.

ఎమ్మెల్లే నిద్రలేచాడని కబురొచ్చింది.

రాగ్యాని అక్కడే వుండమని చెప్పి ఎమ్మెల్లే దగ్గరికి వెళ్ళాడు గరుడాచలం.

ఎందుకోగానీ ఎమ్మెల్లే చాలా హడావుడి చేస్తున్నాడు!

"ఏమిటి కథ?" గరుడాచలం అడిగాడు.

"కథ విషయం తర్వాతగానీ ముందు నీ విషయం చెప్పు."

"నా విషయమా?" ఆశ్చర్యపోయాడు గరుడాచలం.

"అదే! కోడి ప్రాజెక్టు విషయం..."

(ఇంకా ఉంది)



రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)** మనోధైర్యాన్ని కోల్పోకుండా జాగ్రత్త వహించుట అవసరం. నూతన కార్యాలకు ఆటంకాలేర్పడతాయి. కోపాన్ని తగ్గించుకుంటే మంచిది. కఠిన సంభాషణవల్ల ఇబ్బందుల నెదుర్కొంటారు. ఇతరులకు హాని తలపెట్టు కార్యాలకు దూరంగా వుంటారు.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)** స్థిరాస్తుల విషయంలో జాగ్రత్తగా నుండుట మంచిది. ఒక అద్భుత అవకాశాన్ని కోల్పోతారు. నూతన వ్యక్తుల పరిచయమేర్పడుతుంది. ప్రయాణాలవల్ల లాభాన్ని పొందుతారు. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. నూతన కార్యాలు వాయిదా వేసుకోక తప్పదు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)** ఆత్మీయుల సహకారం లభిస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొంటారు. అనారోగ్య బాధవలన బలహీనులవుతారు. అధికార భయం ఉంటుంది. ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)** విదేశయాన ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబంలో అనుకోకుండా లాభమేర్పడే అవకాశముంటుంది. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టాన్ని అధిగమిస్తారు. ఈ రోజు ముఖ్యమైన వ్యక్తిని కలుస్తారు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)** విదేశయాన ప్రయత్నాలకు అనుకూలంగా వుంటుంది. ప్రయాణాలెక్కువ చేస్తారు. మెలకువగా నుండుట అవసరం. స్థానచలనమేర్పడే అవకాశాలుంటాయి. ఋణ లాభం పొందుతారు. ఎలర్జీతో బాధపడేవారు జాగ్రత్తగా నుండాలి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలుంటాయి.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)** అనారోగ్య బాధలతో సతమతమవుతారు. స్థానచలన సూచనలుంటాయి. నూతన వ్యక్తులు కలుస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. గృహంలో మార్పులు కోరుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు దూరమవుతాయి.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)** ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ధైర్యసాహసాలతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. శుభవార్తలు వింటారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)** స్త్రీల మూలకంగా లాభాలుంటాయి. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం పొందుతారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంత సౌఖ్యంగా వుంటారు. అత్యంత సన్నిహితులను కలుస్తారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)** ఋణప్రయత్నం ఫలిస్తాయి. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. స్త్రీలకు స్వల్ప అనారోగ్య బాధలుండును. బంధు, మిత్రులతో జాగ్రత్తగా ఉండడం మంచిది.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)** అన్ని కార్యములందు విజయాన్ని సాధిస్తారు. అంతటా సౌఖ్యాన్ని పొందుతారు. శత్రుబాధలుండవు. శుభవార్తలు వింటారు. గౌరవ మర్యాదలు అధికమవుతాయి. అద్భుత శక్తి సామర్థ్యాలను పొందగలుగుతారు. కుటుంబంలో అభివృద్ధితో పాటు ఆకస్మిక ధనలాభముంటుంది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)** ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనారోగ్య బాధలు తొలగుటకు డబ్బు ఎక్కువ ఖర్చుచేస్తారు. తీర్థయాత్రకు ప్రయత్నిస్తారు. దైవదర్శనం ఉంటుంది. స్త్రీలు మనోల్లాసాన్ని పొందుతారు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)** ఇతరులచే గౌరవింపబడే ప్రయత్నంలో సఫలమవుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా లేనందున మానసికాందోళన చెందుతారు. ప్రతి పని ఆలస్యంగా పూర్తిచేస్తారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది. విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

మాటాట — నిర్వహణ: సుధామ 1838

■	1		2		■	
4	■	■		■	■	
5		■		■	7	
	8		■	9		■
10		■	11	■	12	13
	■	■		■	■	
	■	14				■

ఆధారాలు

అడ్డం

1.పెళ్లిలో వధూవరులు చూసే నక్షత్రం
5.అటుగా శరీరము
7.పంది
8.జంబూకము
9.ఆంగ్లంలో సైనికదళం
10.చతుర్ముఖ పారాయణం దీనితోనే
12.తోలు కోసెడు సాధనము
14.పెళ్లిలో వధూవరులు పరస్పరం పోసుకునేది

నిలువు

2.భర్త
3.తిమిరము
4.దీనికి పెత్తనం ఇస్తే తల అంతా తెగ కొరికిందట!
6.శకుంతల తల్లి
7.చిత్రవర్ణము గలది, నారింజ
10.ఆంధ్ర నాట్యం
11.గాలి
13.బాక్స్

మాటాట-1837 సమాధానాలు

అడ్డం		నిలువు	
1.కోరాడ	9.పిడుగు	2.డప్పు	7.రహదారి
3.కేక	11.అలవా	3.కేలు	10.నెల
4.ప్పుపలు	13.మెప్పు	5.పతి	11.అప్పు
8.హనుమ	14.జిరాక్స్	6.దివ్యాంగులు	12.వాజి

పఠనీయం

నీళ్ళల్లోని చేప (పొయిట్రీ)
రచన: బాల సుధాకర్ మౌళి, ఎస్‌బిఐ దగ్గర, బోయ స్ట్రీట్, నెల్లిమర్ల, విజయనగరం-535217. వెల:రూ.120/-, ప్రతులకు: విశాలాంధ్ర, ప్రజాశక్తి, అనేకా. ఫోన్:9676493680, 9505646046.

దుఃఖం నదిలో ఈదే చేపలు

కన్నతల్లిని, జన్మభూమిని వర్ణించడానికి కవులకు కూడా శక్తి చాలదు. ఊరంటే కొన్ని కట్టడాల సమూహం కాదు. ఊళ్ళో పుట్టిన ప్రతివారికీ అక్కడి మట్టితో, అక్కడి నీటితో, అక్కడి గాలితో విడదీయలేని అనుబంధం వుంటుంది. అందుకే ఎన్ని కష్టాలు వచ్చినా ఊరొదిలి వెళ్లడానికి మనిషి ఇష్టపడడు. గత్యంతరం లేని పరిస్థితిలో ఊరిని వదిలిపెట్టినా ఆ దుఃఖం ఆజన్మాంతం మానవుణ్ణి వదిలిపెట్టదు. మానని గాయం గుండెల్లో సలపరిస్తూనే వుంటుంది.

అలాంటి వలస జీవుల వ్యధలకు చిత్రిక పట్టిన కవితా సంపుటి 'నీళ్లలోని చేప'. స్వాతంత్ర్యం వచ్చి ఎన్నేళ్లైనా సమాజంలో ధనిక బీద తారతమ్యాలు తగ్గపోవడం, ప్రపంచీకరణ ప్రభావం, ఎండిపోతున్న నదులు, ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు, ప్రజాస్వామ్యం ముసుగులో కాషాయం క్రీనీడలు, చిన్నారి పిల్లలపై అత్యాచారాలు, అన్నదాతలపై అఘాయిత్యాలు, నానాటికీ మానవత్వం కోల్పోతున్న మనిషి ఇవన్నీ కవి మనసును కలవరపరచాయి.

తనలో రగులుతున్న అసంతృప్త లావాగ్నిని అక్షర రూపంలో ఆవిష్కరించిన బాలసుధాకర మౌళి కవిత్వ ప్రేమికులకు అపరిచితుడేమీ కాదు. అంతకుముందే ప్రచురించిన 'ఎగరాల్సిన సమయం', 'ఆకు కదలని చోట' కవితా సంపుటాలతో పాఠక హృదయాలలో చిరస్థానం సంపాదించినవాడే. ఇప్పుడు 'నీళ్లలోని చేప'తో మన ముందుకు వచ్చాడు.

అతడికి తన లక్ష్యమేమిటో తెలుసు. దానికి సూటిగా గురిపెట్టడమూ తెలుసు. ఊరొదిలి వచ్చిన దుఃఖం తన గుండెను పట్టి పల్లారుస్తుంటే 'ఒక వానాకాలం కథ'లో 'ఊరు దాటొచ్చారా /చీకటి వుంది ఆకలి వుంది వర్షమూ వుంది / నిశ్శబ్దం గొంతు వానలో కూరిపోతుంది' అని ఆ దుఃఖ తీవ్రతను అక్షరీకరిస్తాడు. కురుస్తున్న వాన నుంచి ఇంట్లో వాళ్లని కాపాడలేని పూరి గుడిసె, ఆ పాకలో వలస వచ్చిన కుటుంబం. పిల్లల ఆకలిని తీర్చడానికి, తన ఆకలిని తీర్చుకోలేని అమ్మ. మొత్తం విషాదాన్నంతా చూరునుంచి కురిసే వర్షంలా పాఠకుల గుండెల్లో కురిపిస్తాడు. ఇపుడు అనేక కారణాలవలన గలగలా ప్రవహించే జీవనదులు నీళ్లింకిన మృతనదులుగా మారిపోతున్నాయి. అలాంటి వాటిలో చంపావతి నది ఒకటి. 'చంపావతి నుంచి'లో 'మృతశరీరంలా వుంది నది / చంపావతిలో నీళ్లేవి / పంట పొలాల్లో పున్నమేది / వలసెళ్లిపోతున్న వూళ్లల్లో మనుషులేరి' అని నిగ్గదీస్తున్నాడు కవి.

ఏలిన వారికి వ్యతిరేకంగా గొంతెత్తినా, రాసినా వాళ్ళ ప్రాణాలకే ప్రమాదం. ఒక్కొక్క సందర్భంలో దేశద్రోహచర్యలకు పాల్పడుతున్నారని అమాయకులను చెరసాలలో పట్టి బంధిస్తుంది. 'నజీబ్ తల్లి'లో 'ఆచూకీ లేని కుమారుడు / ఏ చెరలో ఉన్నాడో/ బతికున్నాడో లేదో' అని బాధపడుతుంది తల్లి.

'నిర్భయ' చట్టం వచ్చినా మూడేళ్ల పసిమొగ్గల నుంచి ముడుతలు పడిన ముదివగ్గులపైనా అత్యాచారాలు నిర్భయంగా జరిగిపోతూనే వున్నాయి. ఇటీవలి ఆసిఫా వృత్తాంతంమీద రాయని కవి లేడు. కానీ 'ఇప్పుడు'లో ఆ సంఘటనకు చలించిపోయిన కవి 'పువ్వులాంటి / ఎనిమిదేళ్ల పిల్లని / చిదిమిన చేతుల్లో / ఎక్కడ / నా చెయ్యుందేమోనని భయం' అని అంటూ 'నాకు చేతులున్నందుకు తొలిసారిగా సిగ్గుపడుతున్నాను' అని చిదిమేసిన పురుషులలో తానూ ఒకడైనందుకు బాధపడతాడు.

నోట్ల రద్దు చేసినపుడు ధనవంతులు బాగానే ఉన్నారు కానీ నిరుపేదలు చాలామంది సమయానికి డబ్బులు దొరక్క మరణించారు. దీనిపై స్పందిస్తూ 'ఏం మారలేదు'లో 'శీతల గదులలో / తెల్లని దూది పరుపుపై /బోరవిరుస్తూ రూపాయి / చెమటల ఉక్కపోతల్లో నడిరోడ్డుపై /బోర్లాపడుతూ రూపాయి /ఒకటి దేహానిది /రెండు దేశానిది' అని వాస్తవ స్థితిని బొమ్మకట్టిస్తాడు కవి.

మౌళి వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. తరగతి గది అన్నా, విద్యార్థులన్నా పంచప్రాణాలు. పిల్లలు రాసిన కవితలతో 'స్వప్నసాధకులు' ప్రచురించాడు. పిల్లల గురించి 'పిల్లలు' అనే కవితలో 'పిల్లల్లో /ఒక లౌకిక దేశం / ఒక అలౌకిక స్వప్నం /మళ్లీ మళ్లీ పుడుతూ వుంటుంది' అని పిల్లలు ఒక లౌకిక దేశాన్ని నిర్మిస్తారని, ఒక అలౌకిక స్వప్నాన్ని నిజం చేస్తారని అంటాడు.

ఈ సంపుటిలో 'తూత్తుకుడి', 'నేను లేని తరగతి గది', 'శివారెడ్డి', 'అనగనగా ఒక ఆవు', 'మాయా వృక్షం', 'పొలంయాత్ర', 'నాన్నొచ్చే సందర్భం' కవితలు ప్రభావశీలమైన కవితలు. ముఖపత్ర కవిత 'నీళ్లలోని చేప'లో చేపల వేటగాడు.. 'గాయలతో చేపలు /విలవిలలాడుతుంటే / కనువిందు చేసుకున్నాడు / మరణించిన చేపలపై / మాయాప్రకటన చేస్తున్నాడు / ఎప్పుడైనా /ఎక్కడైనా /ఏటికి ఎదురీదడమే చేపలకు తెలుసు' అని అన్యాయాలను ఎదిరించే వారిని గూర్చి చెప్తాడు.మౌళికి కవిత్వ నిర్మాణ రహస్యం తెలుసు. ఎలా మొదలుపెట్టాలో ఎక్కడ పూర్తిచేయాలో తెలుసు. పిల్లలు, కవిత్వం రెండు కళ్ళైన మౌళికి కవిత్వం కాలక్షేపం కోసం కాదు. ప్రపంచ కవుల కవితలను అధ్యయనం చేసి ఈ కవి మరింత వస్తు వైవిధ్యంతో, పదునెక్కిన సరళమైన భాషతో ఎన్నో సంపుటాలు రచించాలి.

-మందరపు హైమావతి

మరీచిక

-వాసిరెడ్డి సీతాదేవి

కానీ నా కొడుకు బతికే ఉన్నాడు. నేను చేసిన వడ్డీ వ్యాపారమే వాడూ చేస్తాడు. నా ఆస్తి దోచేస్తే తరిగేది కాదు. నా భూమి నాకే వుంది.

నువ్వు నమ్ముకొన్న జనం నీ వెంట రారు. నావైపు ప్రభుత్వం ఉంది. సిఆర్‌పి వుంది. నువ్వు నన్నేం చెయ్యలేవు" అంటుంది.

ఈ ఉద్యమంలోకి వచ్చేటపుడు జ్యోతి, సత్యం కృష్ణానదిపై పడవ దాటుతుంటారు. కృష్ణకు బాగా వరద వచ్చినపుడు సత్యం "నీకు ఈత వచ్చా!" అని జ్యోతిని అడుగుతాడు. అపుడు పడవ నడిపేవాడు "అదేంటి బాబూ! ఆ ప్రశ్న ఇప్పుడడుగుతారు. పడవెక్కక ముందే అడగాల్సింది" అంటాడు. ఈ ప్రశ్నలో ఉద్యమం కూడా స్ఫురిస్తుంది. ఉద్యమంలోకి రాకముందే అన్నీ ఆలోచించుకోవాలని.

ఇంకొకచోట విప్లవ యోధుడు సత్యం దాహంతో బాధపడుతుంటాడు. కొండల్లో ఎక్కడా మంచి నీళ్లు కనిపించవు. అక్కడ "దూరంగా కొండసానువుల్లో పెద్ద పెద్ద జలాశయాలు, ఆశలు వురకలు వేశాయి. ముందుకు పరుగులు తీసింది. మరీచికలు ఆమెను ఆహ్వానిస్తూ ముందుకు అంతవేగంగానూ పరుగులు తీశాయి. ఎండమావులు కొండెక్కాయి. ప్రతిభ ఆగిపోయింది. మృగతృష్ణ తన ఆర్తిని తీర్చలేదు" అని గ్రహిస్తుంది.

ఉద్యమంపట్ల నవలా రచయిత్రి ఉద్దేశం కూడా అదే. సాయుధ పోరాటాలు, రక్తపాతం ఈ సమస్యకు పరిష్కారం కాదని స్పష్టంగా, వ్యంగ్యంగా చెప్తుంది.

ఈ విప్లవోద్యమంలో మధ్యతరగతివారే పాల్గొంటున్నారు. అసలు బాధితులు దూరంగానే ఉంటారు. వారు సంఘటితం కానంతవరకు, చైతన్యవంతులు కానంతవరకు ఈ ఉద్యమం ఫలించదు. సామ్యవాద సమాజం రాదు అనే సత్యాన్ని స్పష్టంగా చెప్తుంది. మరీచిక పేరు సార్థకం చేస్తుంది.

ఈ నవలలోని స్త్రీ పాత్రలు సజీవ పాత్రలు. తాము కోరుకున్న జీవితం కోసం, తాము నమ్మిన సిద్ధాంతం కోసం తిరుగుబాటు బావుటా ఎగురవేసినవారు, సంఘం చక్రాలలో ఇమడలేనివారు, సంఘం కొలబద్దల్ని తిరస్కరించినవారు, కృత్రిమ మర్యాదా తీరాలను లక్ష్మణరేఖల్ని అధిగమించినవారు.

పితృస్వామ్య వ్యవస్థను, దానిలోని లోటుపాట్లను సమర్థంగా చిత్రీకరించింది ఈ నవల. కాలేజీ నుంచి ఆలస్యంగా వచ్చిన జ్యోతిని కాబోయే భర్త "కాలేజీకి వెళ్లకుండా ఎక్కడికెళ్లావ్" అని అధికారం చెలాయిస్తాడు. కూతుర్ని అర్థం చేసికొన్న తండ్రి కూడా కూతుర్ని అడగకుండా కూతురి పెళ్లికి ముహూర్తాలు పెట్టిస్తాడు.

వినమరువైన..

-మందరపు హైమావతి

ఈ నవలలోని శబరి, జ్యోతి పెళ్లి నిర్ణయించినాకే పెళ్లిని తిరస్కరించి ఇంటి బయటకు వచ్చేస్తారు. శబరి తల్లి, తండ్రి కూడా శబరికి ఇష్టం లేకపోయినా ఆదిత్యను చేసుకోమని బలవంతపెడతారు. వాళ్లిద్దరు కూడా ఇష్టం లేకపోయినా ఒకే ఇంట్లో మార్జాల దంపతుల్లా జీవించడం వివాహ వ్యవస్థలోని డొల్లతనాన్ని వెల్లడిస్తుంది.మరీచిక చదివాక జ్యోతి కోరిన సమ సమాజం రావడానికి ఇంకా దూరం తరగనందుకు విచారిస్తాం. ఇరవై ఏళ్ల క్రింద పరిస్థితి ఇంకా ఇలాగే వున్నందుకు బాధపడతాం. ఇన్ని ఉద్యమాలు, పోరాటాలు దాడిచేసినా ఎరమింగిన కొండచిలువలా మత్తుగా పడివున్న సంఘం కళ్లెదుట కనబడుతూ పరిహసిస్తున్నపుడు, శాంతి, స్వేచ్ఛగా పరిమళించే నవ సమాజం, సమసమాజం ఎప్పుడొస్తుంది అనే ప్రశ్నల గాయాలు మన గుండెల్ని సలుపుతూనే వుంటాయి.

-సమాప్తం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన - శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

హితవాక్యం

దుర్జన వదన వినిర్గత వచన భుజంగేవ సజ్జనో దష్టః
ఔషధశతైః అసాధ్యః చికిత్స్యతే క్షాంతిమంత్రేణ!!

అది రాజకవియైన సుందరపాండ్యుని రమ్యోక్తి. క్రీ.శ. 6వ శతాబ్దికి పూర్వుడైన సుందరపాండ్యుడు మధురా నగరాధీశుడు. వివిధ శాస్త్రనిష్ణాతుడు. బహుగ్రంథ నిర్మాత. ఆయన గ్రంథాలలో ప్రసిద్ధమైన 'నీతి ద్విషష్టికా' జీవన మూల్యాన్ని వివరించే మధురవాక్యాల మంజూషిక. అందులోని ఒక మణి యిది.

"దుష్టుని నోటినుండి వెలువడు దుర్వచనాల విషసర్పాలకు సజ్జనుడు బలిఔతున్నాడు. ఆ పాము కాటుకు మందులేవీ లేవు. కాని సహనమే సరియైన మంత్రం. అదే తిరుగులేని చికిత్స". నిజమే... "లోకమా! భుజంగానీక వల్మీకమా!'" అని ఒక కవి అన్నట్లు విష సర్పాల వలె దుష్టులెప్పుడూ బుసకొడుతూ సజ్జనుల మానస సరోవరాలలో విషం క్రక్కి కలుషితం చెయ్యాలని ప్రయత్నిస్తూనే ఉంటారు. కాని సజ్జనుని సహనం దివ్యౌషధంలాగా పనిచేస్తుంది. అంతటి కృష్ణుడు కూడా శిశుపాలుని ఆగడాలను సహించి సహించి తుదముట్టించాడు. ఓర్పు సాత్త్వికతకు సంకేతం. అది సామర్థ్యానికి నెచ్చెలి.

"ఓర్పు నేర్పుకు నెయ్యం".

-వ్యాఖ్యాత: డి.ఎన్.దీక్షిత్

శ్రీకాళహస్తీశ్వరా!

నీకున్, మాంసము వాంఛయేని కరవా? నీ చేత లేడుండగా
జోకైనట్టిగా కుఠారముండ, ననలజ్యోతుండ, నీరుండగా
పాకరంబొప్ప ఘటించి, చేతిపునుకన్ భక్షింప కా బోయచేఁ
చేకొం టెంగిలి మాంసమిట్లు తగునా శ్రీకాళహస్తీశ్వరా!

భావం:ఈశ్వరా! నీకు మాంసాహారముపై కోరిక కలిగినచో, నీ చేతిలో లేడి ఉంది. గండ్రగొడ్డలి ఉన్నది. నీ మూడవ కంటిలో నిప్పున్నది. తలమీద నీరున్నది. కొంచెము శ్రమపడి వంట చేసుకుని శుచిగా రుచిగా తినలేకపోయావా? ఆ తిన్నడు ఎంగిలి చేసి పెట్టిన మాంసమే కావలసి వచ్చినదా? నీవంటివాడు ఇట్లు చేయవచ్చునా?

రాజైదుష్కృతిఁ జెందెఁ జందురుడు, రారాజై కుబేరుండు దృ
గ్రాజీవంబునఁ గాంచె దుఃఖము; కురుక్ష్మాపాలుఁ డామాటనే
యాజిం గూలె సమస్త బంధువులతో; నా రాజ శబ్దంబు ఛీ!
ఛీ! జన్మాంతరమందు నొల్లనుజుమీ! శ్రీకాళహస్తీశ్వరా!

భావం:చంద్రుడు తాను రాజై గురుపత్నిని అపహరించి పాపమును మూటగట్టుకొనెను. కుబేరుడు పిశాచముల వంటి యక్షులకు రాజై దుఃఖము పొందెను. దుర్యోధనుడు కూడా పాండవులను సమూలముగా నాశనము చేసి రారాజు కావలెనన్న ఆశతో యుద్ధమునకు దిగి సమస్త బంధు మిత్రులతో నాశనమయ్యెను. ఈ రాజశబ్దములో ఇంత దోషమున్నది. కాబట్టి మరొక జన్మలో కూడా రాజు కావలెను అని కోరను. నీ దయారస వీక్షమున్నచో చాలు!

రాజర్థాతురుడైనచో నెచట ధర్మంబుండు? నేరీతి నా
నా జాతి క్రియ లేర్పడున్? సుఖము మాన్యశ్రేణి కెట్లబ్బు? రూ
పాజీవాళికి నేది దిక్కు? ధృతి నీ భక్తుల్ భవత్పాద నీ
రేజంబుల్ భజియింతురే తెరగునన్? శ్రీకాళహస్తీశ్వరా!

భావం:పరిపాలకుడైన రాజు ధనమునందు ఆశ కలిగి పరిపాలన సరిగా చేయకపోతే రాజ్యములో ధర్మము ఎక్కడ ఉంటుంది? వర్ణాశ్రమ ధర్మములు ఎలా సక్రమంగా నడుస్తాయి? మంచివారికి సుఖం ఎలా కలుగుతుంది? వేశ్యలు మొదలైన వివిధ వృత్తులవారికి జీవనం ఎలా గడుస్తుంది? నీ భక్తులు స్వేచ్ఛగా నిన్నెలా సేవింపగలుగుతారు?

తరగల్, పిప్పల పత్రముల్ మెఱుగుటద్దంబుల్ మరుద్దీపముల్
కరికర్ణాంతము లెండమావుల తతుల్ ఖద్యోత కీటప్రభల్
సురవీధి లిఖితాక్షరంబు లసువుల్ జ్యోత్స్నా పయః పిండముల్
సిరులందేల మదాంధు లౌదురో జనుల్ శ్రీకాళహస్తీశ్వరా!

భావం: శంకరా! సంపదలు, నీటి కెరటాలలాగా, రావి ఆకులలాగా, మెరపుటద్దాలలాగా, గాలిలోని దీపాలలాగా, ఏనుగు చెవులులాగా, ఎండమావులలాగా, మిణుగురు పురుగులులాగా, ఆకాశంలోని అక్షరాలలాగా, జీవులలోని ప్రాణాలలాగా, వెన్నెల ముద్దలలాగా చాలా చంచలములు, అశాశ్వతములు కదా! మనుషులు అటువంటి సంపదలతో గర్వించి తిరుగుతారేమి?

కాలకవృక్షీయోపాఖ్యానము



మహాభారతంలో ఉపాఖ్యానాలు

92

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

అప్పుడు 'తనువు' ఆ ఋషుల మధ్య కూర్చుని ధర్మార్థాలతో కూడిన కదను చెప్పసాగాడు. అతను కదలు అలా చెప్తూ ఉండగా ఒక రాజు తన సైన్యంతో అంతఃపుర స్త్రలతో సహా అక్కడికి వచ్చాడు. అతనే భూరిద్యుమ్నుని తండ్రి. అతని పేరు వీరద్యుమ్నుడు. అతను అరణ్యంలో తన పుత్రుని కోల్పోయి చాలా దుఃఖంతో ఉన్నాడు. అతను ఆ కుమారుని కోసం ఆ వనంలో తిరుగసాగాడు. 'పరమధార్మికుడు, ఒక్కడే కొడుకు ఇక అతనిని చూడడం నాకు దుర్లభం' అని రాజు చింతించసాగాడు. అయినా అతనికి ఇంకా ఆశ పోలేదు. ఆ ఆశ అతని శరీరమంతా నిండి ఉంది. అప్పుడు ఆ మునులలో ఉత్తముడు అయిన తను మహర్షి ధ్యానంలో కొంతసేపు నిశ్చలంగా ఉండిపోయాడు. అతను అలా ధ్యానించడం చూసి రాజు మెల్లగా ఇలా అన్నాడు.

'దేవర్షీ! అన్నింటిలోకి దుర్లభమైనదేది? ఆశకంటే గొప్పది ఏది? నాకు దాచకుండా సత్యం చెప్పండి'.

అతని మాటలకు ముని ఇలా అన్నాడు. ''రాజా! నీ పుత్రుని పూర్వం ఒక ముని తనకు బంగారు కలశాన్ని వల్కలాలను అడిగితే బుద్ధితక్కువగా ఆ మునిని నీ కుమారుడు వాటిని ఇవ్వకపోగా అవమానించి పంపాడు. దానితో ఆ ముని చాలా బాధపడ్డాడు. దాని ఫలితమే ఇది''.

ముని అలా చెప్పగానే రాజు కూలబడిపోయాడు. మునులు తపోవన మర్యాదను పాటించి రాజుకు అర్ఘ్యపాద్యాలు ఇచ్చారు. తరువాత వారందరూ కూర్చుని తపోవనానికి రాజు రాకకు కారణం అడిగారు.

అప్పుడు రాజు వారితో ఇలా చెప్పాడు. ''నేను వీరద్యుమ్నుడనే రాజును. నా కుమారుని కోసం వెదుక్కుంటూ ఇక్కడికి వచ్చాను. నాకు అతను ఒక్కడే పుత్రుడు. చాలా చిన్న పిల్లవాడు. అందుకని ఇలా వెతుకుతూ తిరుగుతున్నాను''.

రాజు ఇలా చెప్పగానే ముని ఏమీ మాట్లాడకుండా కూర్చున్నాడు. అతను రాజుతో ఏమీ అనలేదు. పూర్వం ఒక సారి ఈ రాజే ఆ ఋషిని గౌరవించలేదు. అప్పుడు ఋషి 'రాజుల నుండి ఏమీ గ్రహించకూడదు' అని నిశ్చయించుకున్నాడు. ఎవరి నుండీ ఏమీ తీసుకోను అని కూడా తలచాడు. 'ఆశయే మూర్ఖుడైన వానిని నడిపిస్తుంది. దానిని తొలగిస్తాను' అని అనుకున్నాడు. రాజు మరల మునిని ప్రశ్నించాడు. 'ఈ భూమి మీద దుర్లభమైనదేది? ఆశ కంటే దుర్బలమైనది ఏది? దయచేసి ఈ తత్వాన్ని నాకు తెలియజేయండి''.

రాజు మాటలు విన్న ఋషి ఇలా అన్నాడు 'రాజా! ఆశను మించిన బలహీనత ఇంకొకటి లేదు. ఆ బలహీనత వల్లనే నేను రాజులను యాచించాను''.

రాజు మరల అడిగాడు. ''మహాత్మా! ఆశవలన దుర్బలత్వం కలుగుతుందని తెలిసింది. అలాగే ఆశించిన వస్తువు దుర్లభమని కూడా అర్థమైంది. ఇంకొక్కటి అడుగుతాను. దయచేసి వివరించండి. మీకంటే మించిన బలహీనమైనది ఏది?''

మిక్కిలి కృశించి యున్న 'తను' మహర్షి రాజు ప్రశ్నకు ఇలా సమాధానం చెప్పాడు. ''ఎవరినైనా అవసరపడి యాచించినవాడు దుర్బలుడు. అలాంటి యాచకుని అవమానించినవాడు దుర్బలతరుడు. ఎవరినైనా వచ్చి యాచిస్తే యథోచితంగా తన శక్తిని అనుసరించి ఉపకారం చేయకపోతే అప్పుడు సమస్త ప్రాణులకు ఉండే ఆశ నా కంటే దుర్బలతరంగా ఉంటుంది. సోమరులు, కృతఘ్నులు, క్రూరులు - వీరిలో ఉండే ఆశ తీరదు కనక చింత వలన దుర్బలం అవుతుంది. నాకంటే కూడా దుర్బలంగా ఉంటుంది. అలాగే ఒక్క కొడుకు ఉండి అతను లేకపోతే మనసులో కలిగే ఆశ కూడా అతి దుర్బలమైనది. వృద్ధవనితలకు పుత్రుడు కావాలనే ఆశ, ధనవంతులకు మరింత ధనం సంపాదించాలనే ఆశ, ఇవన్నీ నాకంటే కూడా



దుర్బలమైనవి''.

రాజు ముని మాటలు విని, తన స్త్రలతో కలిసి అతని పాదాలను శిరస్సుతో తాకి నమస్కరించాడు. మునితో ఇలా అన్నాడు ''మహాత్మా! నన్ను అనుగ్రహించండి. నా కొడుకును చూడాలని కోరికగా ఉంది. ఇప్పుడు మీరు చెప్పినదంతా సత్యమే''. రాజు అలా ప్రార్థించగా అతనిపై దయతలచి తను మహర్షి తన తపశ్శక్తితో ఆ రాజకుమారుని తండ్రి ముందు నిలబెట్టాడు. తర్వాత ముని రాజును తన ధర్మస్వరూపాన్ని చూపాడు. రాజు ఆ దివ్యరూపాన్ని చూసి పరవశించి పోయాడు. తర్వాత మహర్షి అరణ్యంలోకి వెళ్లిపోయాడు''.

ఋషభమహర్షి ఇదంతా చెప్పి ఇలా అన్నాడు ''నేను ముని చెప్పినవన్నీ స్వయంగా విన్నాను. కనుక శరీరాన్ని బాగా కృశింపజేసేది ఆశ కనుక ఆ లేడి గురించి ఆశ తొలగించుకో'' ఋషభముని మాటలు విన్న సుమిత్రుడు మృగం గురించిన ఆశ వదలుకొని తన నగరానికి వెళ్లిపోయాడు.

జాపకోపాఖ్యానము

పూర్వమా హిమాలయ పర్వతాల సమీపంక్ష్మిఊ మహాయశస్వి, ధర్మవర్తనుడు త్థాన ఒక బ్రాహ్మణుడు నివసించేవాడు. అతను పిప్పలాదుని పుత్రుడు. అతను గొప్ప జాపకుడు, ప్రాజ్ఞుడు, వేదపండితుడు. ఆయన ఆరు వేదాంగాలక్ష్మిఊ కూడా నిష్ణాతుడు. అతను వేదాన్ని అధ్యయనం చేస్తూ జపం చేయసాగాడు. అలా థ్థో సంవత్సరాలు చేసిన తర్వాత అతనికి సావిత్రీ దేవి ప్రత్యక్షమై వరం కోరుకోమన్నది. కాని అతను మాట్లాడక జపం చేస్తూనే ఉన్నాడు. సావిత్రిని పట్టించుకోలేదు. గాయత్రికి అతనిపై దయ కలిగింది. అతని జపంతో సంతృప్తి చెందింది. బ్రాహ్మణుడు తన జపం ముగించుకొని ఆమె పాదాలపై తలపెట్టి ఇలా అన్నాడు ''దేవీ! నా భాగ్యం వలన నాకు దర్శనమిచ్చావు. నీవు నా జపంతో సంతృప్తి చెందితే నాకు జపంపై మనస్సు నిలిచేటట్లు అనుగ్రహించు''

సావిత్రి ఇలా అంది - ''బ్రహ్మర్షీ నీకేం కావాలి? నీకు ఇష్టమైనది ఏమిటి?'' చెప్పు నేను అనుగ్రహిస్తాను.

అప్పుడు ఆ ద్విజుడు మళ్ళీ ఇలా అన్నాడు - ''తల్లీ! నాకు జపం మీద మనసు నిలిచేటట్లు థ్థో. జపం అంటే నాకు ఆసక్తి ఉండాలి. నా మనస్సమాధి వర్ధిల్లేటట్లు అనుగ్రహించు''

ఇంకావుంది...

సమాధానకర్త

ప్రార్థన

- మద్దు పీటర్

9490651256

'ఏలయనగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహించబడెను ఆయన భుజము మీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి **సమాధానకర్త**యగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును.'


అసమాధానము అల్లకల్లోలము గొడవలు కొట్లాటలు గందరగోళంగా ఉన్న ఈ లోకాన్ని ప్రభువు చూసిచూసి, సమాధానకర్తయగు అధిపతి ఈ లోకానికి శిశువుగా వచ్చాడు. ఈయన సమాధానమునకే కర్తగాని అసమాధానానికి అల్లర్లకు కర్త కాదు.

దేవుడు మానవునికి ఇచ్చిన ఏదేను తోట ఎంతో హాయిగా ఆహ్లాదంగా సంతోషంగా సమాధానముగా ఉండేది. సమాధానకర్త మాటలు వినక అసమాధానకర్తయైన సాతాను మాటలు విని సమాధానము పోగొట్టుకున్న లోకం, ఎలాగైనా మునుపటి సంతోష సమాధానాలు కావాలని తపన కలిగి ఉన్నది. అందుకు అనేక స్థలాలకు వెళ్తున్నారు. అనేక దేశాలకు వెళ్తున్నారు. అనేకమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయినా ఎక్కడ, మనసు కోరుకుంటున్న సమాధానము లేదు. వాస్తవానికి అది ఎక్కడ నుండో వచ్చేది కాదు ఎవరో ఇచ్చేది కాదు. సమాధానకర్తయైన యేసుక్రీస్తు మాత్రమే ఇవ్వగలడు. ఈయనే సమాధానకర్తయగు అధిపతి. He is the Prince of Peace. ఈయనే షాలేము రాజు (King of Peace) హెబ్రీ *7:2.* ప్రేమ సమాధానములకు కర్తయగు దేవుడు. ఈయనే మనకు సమాధానము. మనిషికి మనిషికి మధ్య ఉన్న ద్వేషాన్ని తన శరీరమందు సిలువలో కొట్టివేశాడు. ఆయన రాజ్యము నీతి సమాధానములు పరిశుద్ధాత్మ యందలి ఆనందముతో నిండి యున్నది. ఆయన మాట వింటే అసమాధానానికి కర్తయైన సాతానును మీ కాళ్ల కింద చితుక తొక్కిస్తాడు.

ప్రశాంతంగా సమాధానముగా సాగుతున్న లోకమును సాతానుడు మాయమాటలు అబద్ధాలు లేనిపోని కల్పితాలు అబద్ధ సాక్ష్యాలు చెప్పి మనుషులను ప్రేరేపించి నెమ్మది సమాధానము లేని ఇళ్లు సమాజము రాష్ట్రాలు దేశాలుగా చేశాడు. లోకంలో ఎక్కడా ప్రశాంతత లేదు. సమాధానము కొరకు అనేక మిలియన్లు ఖర్చుచేసి ఇంకా అసమాధానములో పడిపోతున్నాడు.



ఎవరికి ఉన్నదానితో వారు తృప్తి పడలేక పోతున్నారు. ఇతరులవి చూసి ఆశ పడుతున్నారు. నిరాశ అసంతృప్తితో సమాధానము కోల్పోతున్నారు. ప్రభువు మాట 'నీ పొరుగు వానిది ఏది ఆశించకు' వింటే ఎంత మేలు ఎంత సమాధానంగా ఉంటుందో గదా! మనిషి చిన్నప్పటి నుండి ఏదో ఒక ఆరాటం తపనతో ఉంటున్నాడు. స్కూల్లో ఉన్నప్పుడు హైస్కూల్‌కి ఎప్పుడు వెళ్లాలా అని, కాలేజీ చదువులు హాయిగా ఉంటాయనీ, చదువుకునే రోజుల్లో ఎప్పుడు ఉద్యోగం వస్తుందాని, తరువాత వివాహము తర్వాత ఎప్పుడు రిటైర్ అవుతామా? అప్పుడు ప్రశాంతంగా ఉండవచ్చునని అనుకుంటారు కాని, రిటైర్మెంట్ తర్వాత తాను కోరుకున్న ప్రశాంతత లేక అసలు ఈ జీవితం నుంచే రిటైర్ కావాలని కోరుకుంటారు. జాగ్రత్త! ఎంతో విలువైనది ఈ జీవితం. పోతే మళ్లీ వచ్చేది కాదు. ఒక్క క్షణం కూడా వెనుకకు రాదు. దీనినిబట్టి ఒక్క క్షణ జీవితం ఎంత విలువైనదిగా ఆలోచించి సమయాన్ని విలువైన జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఒక్క క్షణ జీవితాన్ని ఎవరూ అమ్మలేరు. కొనలేరు. కాలాలు సమయాలు అన్నీ ప్రభువు చేతిలో ఉన్నాయి. సమాధాన కర్తయగు దేవుడు మనకు తోడుగా ఉంటే ఏ రోజు జీవితం ఆ రోజు సమాధానంగా సంతోషంగా జీవించగలము. ఏ పని చేస్తుంటే ఆ పనిని సంతోషంగా చేయగలము. మనకున్నంతలో సంతోషంగా ఉండగలము. మంచి ఉద్యోగం మంచి కుటుంబంతో సమాధానముగా ఉండగలవు. ఈ సంతోష సమాధానము ఇవ్వటానికే ప్రభువు సిలువలో గాయపడింది. ఘోర హింస అనుభవించింది. అస్తవ్యస్థమైన జీవితాలు సరిచేయటానికే ప్రభువు ఈ లోకానికి వచ్చింది.



ఒక్క క్షణ జీవితాన్ని సంపాదించుకోలేని మనకు నిత్య జీవితాన్ని సంపాదించి పెట్టాడు. క్రీస్తునందు నిత్య జీవము ఉచితంగా దొరుకుతుంది. సమాధానము సంతోషము అన్నీ ఉచితమే. కాని ఒక్క చిన్న నిబంధన. ఆయన మాటకు విధేయించాలి.

చాలామంది శాంతి సమాధానము సంతోషము నిత్య జీవము కోరుకొని ఏదేదో చేసి ఉన్న కాస్త సమాధానాన్ని పోగొట్టుకుంటారు. త్రాగుడుతో సమాధానమున్నదని కొందరు, ఆటపాటలతో సమాధానముంటుందని కొందరు, తిరిగితే సమాధానము ఉంటుందని ఇంకొందరు.. ఇలా అనేక రకాలుగా సమాధానము కొరకు వెతికి చివరకు సమయాన్ని ఆరోగ్యాన్ని ఆస్తిపాస్తులను పోగొట్టుకొని మతి స్థిమితము లేకుండా జీవిస్తున్నారు.

అయితే యెషయా ప్రవక్త చెప్పినట్లు - ఎవని మనసు ప్రభువు మీద ఆనుకొనునో వానిని పూర్ణ శాంతిగలవానిగా కాపాడతాడని తెలుస్తుంది. మన పని క్రీస్తు నందు విశ్వాసముతో ఆయన మీద ఆధారపడటము మాత్రమే. ఈ విశ్వాసము కొరకు ప్రభువును ప్రార్థించాలి. ప్రభువు మనకు అచంచలమైన విశ్వాసాన్ని ఇస్తాడు.

పోయిన సంతోషము సమాధానము తిరిగి ఎలా పొందుకోగలము? ప్రభువే తన దూతను పంపి ప్రజలందరికి సంతోషకరమైన శుభ వర్తమానము తెలియజేశాడు. దావీదు పట్టణమందు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఈయనే ప్రభువైన క్రీస్తు. ఆయనకు ఇష్టులైన వారికి భూమి మీద సమాధానము. ఇవి లోకమిచ్చే తాత్కాలికమైన సమాధానము శాంతి కాదు. ఇది క్రీస్తులో మనకు దొరికే నిత్య సంతోషము సమాధానము. ప్రభువే సమాధానము గనుక ఆయనను చేర్చుకొనటమే సమాధానము.

శాంతి మీకనుగ్రహించి వెళ్లుచున్నాను. నా శాంతినే మీ కనుగ్రహించుచున్నాను. లోకమిచ్చునట్లుగా మీ కనుగ్రహించుట లేదు. మీ హృదయములను కలవరపడనీయకుడి. వెరవనియ్యకుడి - యోహాను *14:27.* సమాధానకర్తయగు దేవుడు తన సమాధానాన్ని మనకు పంచి ఇస్తున్నాడు. దేవునితో సమాధానపడి ఆయన ప్రేమను శక్తిని పొందుకుని సమాధానపరుస్తుంది. క్రీస్తు ద్వారా పొందుకున్న సమాధానమును మన హృదయములను ఏలుచుండనియ్యాలి. ఈ సమాధానము దేవుని నమ్మిన వారికి, నమ్మి ఆత్మీయంగా జీవించేవారికి దేవుడిచ్చిన ఫలం- ఆత్మఫలములో ఉంటుంది. ఈ ఆత్మ ఫలము, ప్రేమ సంతోషము సమాధానము దీర్ఘ శాంతము దయాళుత్వము మంచితనము విశ్వాసము సాత్వికము ఆశానిగ్రహము.

రక్షకుడైన యేసుక్రీస్తును నమ్మి దేనిని గూర్చియు చింతపడకుండా ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతాపూర్వకముగా ప్రభువును ప్రార్థించుచు ఉంటే సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము మన హృదయములకు తలంపులకు కావలి యుండును.

ఆశ అసంతృప్తి అసమాధానము పుట్టేది హృదయాలలోనే గనుక ఆ హృదయములకు దేవుని కాపుదల ఉంటే పరిస్థితులు ఎలా ఉన్నా - నీ ప్రక్క వేయిమంది పడినను నీ కుడిప్రక్క పదివేల మంది కూలినను అపాయము నీ యొద్దకు రాదు అనే ధైర్యముతో సమాధానముగా ఉండగలవు. దేవుని సమాధానము మనకు విశ్రాంతినిస్తుంది. ఈ లోకము మనలను అవిశ్రాంతం చేస్తుంది. అవిశ్రాంతంగా అసమాధానంగా ఉందా? ఒక్కసారి సమాధాన కర్తయగు అధిపతిని అడుగు అర్థించు. అడుగుడి మీకియ్యబడును అని వాగ్దానమిచ్చిన ప్రభువు వెంటనే నీకు సమాధానము దయచేస్తాడు.

రోమా 14:19 - కాబట్టి సమాధానమును పరస్పర క్షేమాభివృద్ధి కలుగచేయు వాటినే ఆసక్తితో అనుసరింతము. మనము సమాధానముగా ఉండి అందరితో సమాధానమును పరిశుద్ధతయును కలిగి యుండుటకు ప్రయత్నిద్దాం.

మనము సమాధానముగా ఉండి ఇతరులను కూడా సమాధానపరచుచు దేవుని కుమారులముగా కుమార్తెలముగా ఉండుటకు పరిశుద్ధాత్మ దేవుడు మనకందరికి సహాయము చేయునుగాక.

నీవు కోరుకుంటున్న ప్రశాంత సమాధానము శాంతి క్రీస్తును బట్టి నీలోనే ఉంది.

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ

తెలుగు అనువాదం: డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

187

దుర్మార్గుల చరిత్ర ఆ ఆదర్శపురుషుల చరిత్రల తోబాటు ఇతిహాసపుటలలో వ్రాయబడినా వారు ప్రజల హృదయాలలో మాత్రం సజీవులైయుండ లేదు. కాబట్టి మానవజాతి చరిత్రలో హింసకు అహింసకున్న గౌరవం, పూజ్యభావం లేనే లేదు.

అహింస పరమధర్మమని చెప్పిన మనిషిని ఎవ రేమి చేసినా మిన్నకుండి స్తబ్ధుడిగా ఉండమని వేదం చెప్పలేదు. అహింసాధర్మాన్ని చెప్పిన వెంటనే జీవితంలో 'దక్షితామహే' ''ఘనమైన నీ మహత్వాన్ని ప్రకటించుకొనేందుకు నిత్యం ఉత్సాహంగా ఉండు''అని ఆదేశించింది వేదం. లోకంలో సాధారణంగా మనుషులు తమ దక్షతను చాటుకొనేందుకు హింసామార్గాన్ని ఎన్నుకొంటారు. హింస చేయకు 'మాస్రేధత'అని చెప్పిన వేదం 'దక్షతామహే'అని చెప్పడంలోని ప్రధానోద్దేశ్యం హింసామార్గంలో కాక అహింసామార్గంలో నీ దక్షతను ప్రకటించుకొమ్మని (తెలియజేమని) యే. మరి దానికి మార్గాలను కూడ వేదమే నిర్ణయించింది. 1. సర్వవిధ శక్తియుక్తులు 2. పరిపూర్ణ ధనసంపద. ఈ రెండింటిని 'కృణుధ్వం రాయ ఆతుజే'; రాయ= ధనంకొఱకు ఆతుజే= శక్తియుక్తుల కొఱకు కృణుధ్వం= ప్రయత్నంచేయి అని కంఠోక్తంగా చెప్పింది నిజమే మరి. 'ఉద్యోగేనైవ సిద్ధ్యంతి కార్యాణి న మనోరథైః' ''కార్యసిద్ధి ప్రయత్నం చేతనే గాని కోరికలు కలిగియుండటం వలన సిద్ధింపదు'' అన్న ఆర్యోక్తి కదా. అలా ఉత్సాహంతో ఉద్యమించి సంపాదించిన ధనం గాని బలం గాని దేనికి వినియోగించాలి? ఈ విషయం గూడ ఈ మంత్రంలో కాకున్నా మరొక సందర్భంలో ఋగ్వేదమే (ఋ.7-32-20) 'తరణి రిత్సిషాసతి వాజం పురంధ్యా యుజా' ''దుర్బలులైన వారిపై దర్పం చూపక వారిని సంరక్షించే సద్బుద్ధి గలవాడు తమ బలాన్ని జ్ఞానాన్ని వారి సంరక్షణ కొఱకై వెచ్చిస్తారు'' అని స్పష్టపరచింది. అట్టి వాడెన్నడు చెడిపోడు. 'క్షేతి పుష్యతి' ''మూడు పూవులు ఆరుకాయలుగా వర్ధిల్లుతూ ఉంటాడు. అతడిని చూచి దేవతలు సహితం సంతుష్టులై ఆశీర్వదిస్తారని న దేవాసః కవత్నవే ''నీచమైన ఆచార వ్యవహారాలకు పాల్పడేవాని ఎడల దేవతలు సుముఖులై యుండరు''అని ఋగ్వేదం నిర్ద్వంద్వంగా చెప్పింది. కాబట్టి సర్వదేవతా సుముఖతకై మానవులు హింసామార్గాన్ని వీడుదురుగాక!

ఆ మహద్భూతమే మహాసృష్టిని చేసింది

యః పుష్పిణీశ్చ ప్రస్వశ్చ ధర్మణా- ధి దానే వ్యవనీరధారయః।

యశ్చాసమా అజనో దిద్యుతో దివ ఉరురూర్వాన్ అభితః సాస్యుక్థ్యః॥

భావం:- ఎవడు స్వసామర్థ్యం చేత పుష్ప- ఫల సంభరితమైన భూమండలాలను జీవుల సుఖసంతోషాల కొఱకై సృష్టించాడో, ఏ మహిమాన్వితుడు సృష్ట్యాదిలోని హిరణ్మయాండం నుండి ప్రకాశమానమైన బృహత్తమ లోకాలను దశదిశల సృజించాడో అట్టి నీవు మాకు సర్వదా ప్రశంసనీయుడవయి యుంటివి.

వివరణ:- ఎవనిని స్తుతించాలి? ఎవనిని ప్రార్థించాలి? ఎందుకు ప్రార్థించాలి? ఈ ప్రశ్నలు సాధారణంగా అందరి మనస్సులలో కలుగుతూనే ఉంటాయి. అది చాల సహజం. ఈ మంత్రంలో దీనికి సమాధానం సయుక్తికంగా చెప్పబడింది. కార్యం అందరికి ప్రత్యక్షంగా కనబడుతుంది. కారణం కనిపించదు. కాని కారణం తప్పక ఉంటుంది. ఈ రెండింటిగల విడదీయరాని సంబంధాన్నే శాస్త్రం కార్యకారణ సంబంధంగా పేర్కొంటుంది. ఈ సంబంధం నిత్యమైనది. ఉదాహరణకు ఒక చిన్న సూది ఉంది. దానిని తయారుచేసినవాడు (ఇతడే కారణం) మనకెదురుగా లేకపోయినా ఎక్కడో అక్కడ తప్పక ఉన్నాడు కదా. అలాగే మనకు ప్రత్యక్షంగా ఈ ప్రపంచం కనిపిస్తూంది కదా. మరి దీనికి కర్త ఒకడు ఉండాలి కదా. కనబడడే? దీనికి సమాధానంగా వేద సోదాహరణంగా ఇలా చెబుతూంది. ఓ మానవుడా! సూక్ష్మంగా పరిశీలించు. నీ కళ్ళ ముందు పుష్పించి ఫలించిన విశాల భూమండలముంది. దీని నెవరు నిర్మించారు? వనాలు, పర్వతాలు, నదులు, సముద్రాలు ఇలా ఎన్నెన్నో ఈ భూమి మీద ఉన్నాయి. మరి ఈ భూమంతా ఎక్కడుంది? దీని భారాన్నంతా ఎవర భరిస్తున్నారు?

అది సరే. ఇక ఆకాశంవైపుకు చూడు. మిలా మిలా ప్రకాశిస్తూ ఎన్నెన్నో నక్షత్రాలు, జ్యోతిర్మండలాలు ప్రకాశిస్తూ ఉన్నాయి. వానిలో కొన్ని చిన్నవి. కొన్ని పెద్దవి. కాని చిన్నగా ప్రకాశించే ఆ నక్షత్రాలు గాని జ్యోతిర్మండలాలు కంటికి కనబడుతున్నంత చిన్నవి మాత్రం కావు. వానిలోని ఒక్కొక్క దానిలోనే ఏబది లక్షల సూర్య గోళాలు సులభంగా అమరిపోగలిగినంత మహావిశాలమైనట్టివి. అయితే సూర్యుడు మాత్రం ఒక చిన్న గోళమా? అందులో మనమంతా నివసించే భూమండలం పదమూడు లక్షలు కూడినా అవలీలగా ఆ సౌరమండల మొక్క దానిలోనే ఇమిడిపోగల మహత్తరమైన మండలమట. అన్ని తేజో మండలాలను ఎవడు ఆ విధంగా నిర్మించాడు? అతడనేవాడు కార్యకారణ సంబంధ రూపంగా ఉండి ఉంటే అతడు ఎంతో మహా తేజః స్వరూపుడై ఉండాలి కదా. ఎవడూ తయారుచేయని వస్తువు ఈ లోకంలో కనబడదు కదా.

ఇంకావుంది...

హిందీలోకి గీత గోవిందం

సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ నటించిన 'గీత గోవిందం' గత ఏడాది విడుదలై బ్లాక్‌బ్లాస్టర్ అనిపించుకుంది. పరశురాం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం సుమారు 100 కోట్లకు పైగా వసూలు రాబట్టింది. అలాంటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇప్పుడు హిందీలో రీమేక్‌కానుంది. ఇప్పటికే విజయ్ నటించిన 'అర్జున్‌రెడ్డి' అక్కడ రీమేక్ అవుతుండగా, ఈ చిత్రాన్నీ రీమేక్ చేయనున్నారు.

రీమేక్‌లో యువ హీరో ఇషాన్ కట్టర్ నటించనున్నట్టు బాలీవుడ్ వర్గాల సమాచారం. అయితే ఇంకా ఈ చిత్రానికి దర్శకుడు ఖరారుకాలేదు. ఇక 'బియాండ్ ది క్లౌడ్స్'తో హీరోగా ఎంట్రీ ఇచ్చిన ఇషాన్ గత ఏడాది 'దఢక్' చిత్రంతో మెప్పించాడు. దఢక్ మరాఠి చిత్రం సైరాట్‌కు రీమేక్‌గా తెరకెక్కింది.





ఇస్మార్ట్ పూరీ

డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, ఎనర్జిటిక్ స్టార్ రామ్ కాంబినేషన్‌లో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ వస్తుంది. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ విడుదలైంది. దీనికి ఇస్మార్ట్ శంకర్ అనే టైటిల్ కన్‌ఫర్మ్ చేసారు. రామ్ ఇస్మార్ట్ శంకర్ పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ చాలా ఆసక్తికరంగా ఉంది. రామ్ ఇందులో తలకిందులుగా సిగరెట్ తాగుతూ అద్భుతంగా ఉన్నాడు. ఈ చిత్రంకోసం పూర్తిగా మేకోవర్ అయ్యారు రామ్. జనవరిలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. వీలైనంత త్వరలో సినిమాకు సంబంధించిన కాస్ట్ అండ్ క్ర్యూ వివరాలు తెలపనున్నారు దర్శక నిర్మాతలు. ఇస్మార్ట్ శంకర్ సినిమాను పూరీ కనెక్ట్స్ సహకారంతో పూరీ జగన్నాథ్ టూరింగ్ టాకీస్ బ్యానర్‌పై పూరీ జగన్నాథ్, ఛార్మికౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

లైఫే మారిపోయింది

తొలి సినిమానే సూపర్‌స్టార్ మహేష్‌బాబు సరసన జోడీ కట్టేసి భరత్ అనే నేనుతో కమర్షియల్ విజయాన్ని అందుకుని అందరినీ తన వైపునకు తిప్పుకుంది బాలీవుడ్ భామ కైరా అద్వానీ. ఆ సినిమా హిట్‌తో టాలీవుడ్‌లో వరుస అవకాశాలు క్యూ కట్టాయి. తన రెండో చిత్రంగా రామ్‌చరణ్-బోయపాటిల క్రేజీ కాంబినేషన్‌లో 'వినయ విధేయ రామ'లో సీత పాత్రలో మెరవనుంది. ఈనెల 11న సినిమా విడుదల కానున్న సందర్భంగా మీడియాతో ముద్దుగుమ్మ ముచ్చట్లు.

సరికొత్త అనుభూతి..

నిజంగా నా కెరియర్‌లో ఇంత పెద్ద సినిమా ఎప్పుడూ చేయలేదు. పక్కా కమర్షియల్ మాస్ యాక్షన్ సినిమా. పైగా పదిహేనుమంది భారీ తారాగణంతో కలిసి నటించడమనేది అమేజింగ్ ఎక్స్‌పీరియెన్స్. ఈ సినిమా చేస్తున్నంతసేపు ఓ పెద్ద కుటుంబంలా ఫీలయ్యాను. చాలా గొప్ప అనుభూతి అని చెప్పాలి.

అందుకే ఓకె చెప్పా..

దర్శకుడు బోయపాటి కథ చెప్పినపుడు చాలా కొత్తగా అనిపించింది. ఆయన కథ చెబుతున్నపుడే పూర్తి సినిమా చూసేసా. నేను చేస్తున్న మంచి ఫ్యామిలీ స్టోరీ విన్నాననిపించింది. అందుకే ఇమ్మిడియెట్‌గా ఓకె చెప్పేశా. దానికి తగ్గట్టే ఆయన అద్భుతంగా తెరకెక్కించారు. నాచురల్ ఎలిమెంట్స్‌ని ప్రెజెంట్ చేయడం వేరు, ఏదైతే నమ్మడానికి వీల్లేకుండా ఉంటాయో, వాటిని నమ్మేంతగా, ఫీలయ్యేంతగా మెస్మరైజ్ చేస్తూ స్క్రీన్‌పై ఎలివేట్ చేయడం వేరు. రెండో ప్రక్రియ చాలా కష్టం. అది బోయపాటి లాంటి ఫిల్మ్ మేకర్స్‌కే సాధ్యమవుతుంది.

టైం కాదు పాత్రే ముఖ్యం..

ఈ సినిమాలో నేను ఎంతసేపు స్క్రీన్‌పై కనిపిస్తాను అనేకన్నా, కనిపించినంతేపు నేను ప్లే చేసిన క్యారెక్టర్‌కి ప్రాముఖ్యత, క్వాలిటీ ఉందా లేదా? నా ప్రెజెన్స్‌ని ఆడియెన్స్ ఫీల్ అయ్యారా లేదా అని ఆలోచిస్తా. అంతే తప్పా సినిమా మొత్తంగా నేనే ఉండాలని అనుకోను.

అందుకే నటిగా..

సినిమా అంటే నాకు చాలా ఇష్టం. పాషన్ కూడా. అలాగే నాకు డాన్స్ అన్నా ఇష్టం. అందుకే నటినయ్యా. కంప్లీట్‌గా అటు డాన్స్, కామెడీ పెర్ఫామ్ చేయడానికి మంచి స్కోప్ వున్న సినిమాలో పనిచేసే అవకాశం దొరికినపుడు చాలా హ్యాపీగా ఉంటుంది. ఈ సినిమా చేసినందుకు అదే ఫీలింగ్. బేసిగ్గా డాన్స్ అంటే ఇష్టం కాబట్టి చరణ్‌లాంటి డ్యాన్సర్‌తో స్టెప్స్ వేస్తూ చాలా ఎంజాయ్ చేశా. నాకు 'రామా లవ్స్ సీత' ఇప్పటివరకు నేను చేసిన సాంగ్స్‌లో మోస్ట్ ఫేవరెట్. 800మంది డాన్సర్స్‌తో చాలా గ్రాండ్‌గా పిక్చరైజ్ చేశారు ఆ పాటని.

కెమిస్ట్రీ కుదిరింది..

సినిమాలో రామ్‌చరణ్‌తో నా కెమిస్ట్రీ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. నా క్యారెక్టర్ వచ్చేసి 'సీత'. ఫ్యామిలీలో అందరిముందు చాలా వినయంగా ఉంటూ, రామ్ ఏది చెప్తే అదీ అన్నట్టుగా ఉంటాను. బయట మాత్రం చాలా డామినేటింగ్‌గా ఉంటాను. మా కాంబినేషన్‌లో వుండే సీన్స్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటాయి.

ఒక్క భాషలోనే కాదు..

నాకైతే ఒకే భాషలోనే సినిమా చేయాలని లేదు. గ్లోబల్ ఆడియెన్స్‌ని ఎంటర్‌టైన్ చేయాలి. లాంగ్వేజ్ ఏదైనా, స్క్రిప్ట్ బావుంటే అది డిజిటల్ ఫ్లాట్‌ఫామ్ అయినా 'నో' చెప్పను.

భరత్ కంటే ముందు..

'భరత్ అనే నేను'కి ముందు నమ్రతా నన్ను వేరే సినిమాల కోసం అప్రోచ్ అయ్యారు. కానీ అపుడు డేట్స్ అడ్జెస్ట్ అవ్వకపోవడంవల్ల కుదరలేదు. ఎప్పుడైతే భరత్ అనే నేను ఆఫర్ వచ్చిందో.. ఎలాగైనా చేసేయాలనుకున్నాను. ఆ సినిమాతో నా లైఫ్ మారిపోయింది.

అర్జున్‌రెడ్డి రీమేక్‌లో..

అర్జున్‌రెడ్డి రీమేక్‌లో నటిస్తున్నందుకు చాలా ఎగ్జైటెట్‌గా ఉన్నాను. సినిమాలో లాస్ట్ సీన్ నుండి షూటింగ్ స్టార్ట్ చేశారు. సినిమాలో నేటివిటీకి తగ్గట్టు ఛేంజెస్ చేశారు. సినిమా ఢిల్లీ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. నాకు ఆ సినిమా చాలా నచ్చింది. దాంతోపాటు విజయ్ దేవరకొండ నటన అద్భుతం. నేను అతనికి ఫ్యాన్ అయ్యాను.

నెక్స్ట్ సినిమాలు..

ప్రస్తుతం హిందీలో కబీర్ సింగ్‌తోపాటు లవ్‌స్టోరీ చేస్తున్నా. తెలుగులోనూ రెండు మూడు చర్చల్లో వున్నాయి. త్వరలో వివరాలు తెలియజేస్తా.

-శ్రీ





షారుక్.. ఓ క్రేజీ

బాలీవుడ్ బాద్షా షారుక్‌ఖాన్ నటించిన తాజా చిత్రం 'జీరో' భారీ అంచనాలమధ్య ఇటీవల విడుదలై బాక్సాఫీస్‌వద్ద చతికిలపడింది. అయితే షారుక్, అనుష్క శర్మల నటనకు ప్రశంసలు దక్కాయి. ఇక షారుక్ ఈ చిత్రం తరువాత బయోపిక్‌లో నటించడానికి సిద్ధమవుతున్నాడు. ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త రాకేశ్‌శర్మ జీవితం ఆధారంగా 'సెల్యూట్'అనే చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రంలో షారుక్, రాకేష్‌శర్మ పాత్రలో కనిపించనున్నాడు. మహేష్ మతాహి తెరకెక్కించనున్న ఈ చిత్రం ఫిబ్రవరిలో ప్రారంభంకానుంది. ఇప్పటికే ఈ చిత్రంయొక్క ఫస్ట్‌లుక్ షెడ్యూల్‌కోసం ముంబైలోని ఫిలింసిటీలో భారీ సెట్‌ను నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో సిద్ధార్థరాయ్ కపర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇక ఈ చిత్రంకోసం పూర్తిగా కొత్త లుక్‌లోకి మారనున్నాడట షారుక్.



రామ సక్కని సీత

ఇంద్ర, సుకృత వాగ్లే జంటగా శ్రీహర్ష మండ తెరకెక్కిస్తున్న చిత్రం రామ సక్కని సీత. ఇంద్ర ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నారు. మహాకవి వాల్మీకి రాసుకున్న రామాయణం నిజం అయితే తన కథ కూడా నిజమే అంటున్నాడు దర్శకుడు శ్రీ హర్ష మండ. ఆయన తెరకెక్కిస్తున్న రామ సక్కని సీత షూటింగ్ ఇప్పటికే 70శాతం పూర్తయింది. క్రొకోడైల్ క్రియేషన్స్ మరియు లియో సెల్యులాయిడ్స్ బ్యానర్స్‌పై విశాలక్ష్మి మండ, జి.ఎల్.ఫణికాంత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సినిమా ఆద్యంతం వినోదాత్మకంగా అన్నివర్గాలను ఆకట్టుకునేలా ఉంటుందని చెబుతున్నారు దర్శక నిర్మాతలు. జనవరి 1 నూతన సంవత్సరం సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్ విడుదలచేశారు. ఇందులో ప్రియదర్శి, కాశీవిశ్వనాథ్, అభయ్, బుల్లెట్ భాస్కర్, జబర్దస్త్ అప్పారావు, మధుమణి, రాహుల్ సిప్లిగంజ్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. కేశవ కిరణ్ సంగీతం అందిస్తుండగా.. మురుగన్ గోపాల్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. గ్యారీ బిహెచ్ ఎడిటింగ్ చేస్తున్నారు.



కమల్ రెడీ అయ్యాడు

'2.ఓ' సక్సెస్ శంకర్‌కి బిగ్ బూస్ట్. ఈ విజయం 'భారతీయుడు 2' కిక్ స్టార్ట్‌కి పెద్ద సాయమవుతోందనే చెప్పాలి. ఇప్పటికే కథ రెడీ చేసిన శంకర్ సినిమా లొకేషన్లపై కసరత్తు చేస్తున్నాడు. ఇండియా సహా ఉక్రెయిన్- తైవాన్ ఎగ్జోటిక్ లొకేషన్లను శంకర్ బృందం ఫైనల్ చేసిందట. హైదరాబాద్ రామోజీ ఫిలింసిటీ- చెన్నయ్- పొలాచ్చి లాంటిచోట్ల కీలకంగా షూటింగ్ జరగనుంది. అయితే ఈపాటికే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కావాల్సిఉన్నా, రకరకాల కారణాలతో ఇప్పటికే పలుమార్లు వాయిదాపడిన సంగతి తెలిసిందే. ఓవైపు విశ్వనటుడు కమల్‌హాసన్ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉండటంతో ప్రాజెక్టు ఆలస్యమైంది. అయితే ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని శంకర్ భావిస్తున్నారట. దాదాపుగా స్క్రిప్టు, లొకేషన్స్‌పరంగా క్లారిటీ వచ్చేసింది. అనిరుధ్ సంగీత దర్శకుడిగా ఇప్పటికే బాణీల కసరత్తులో ఉన్నాడు. కథానాయికగా చందమామ కాజల్‌ని ఫైనల్ చేసేశారు. ఇతర పాత్రలకు ఎంపికలు సాగుతున్నాయి. ఆ క్రమంలోనే హైదరాబాద్ రామోజీ ఫిలింసిటీలో వేసిన భారీ సెట్స్‌లో నెలాఖరునుంచి షూటింగ్ ప్రారంభించాలని భావిస్తున్నారట. 2.ఓ చిత్రాన్ని నిర్మించిన ప్రతిష్ఠాత్మక లైకా ప్రొడక్షన్స్ సంస్థే ఈ చిత్రాన్నీ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించనుంది. ఇక భారతీయుడు కథతో పోలికలేని కొత్త కథతో సినిమాని శంకర్ తెరకెక్కించనున్నాడు. లంచగొండితనం అవినీతి కామన్ బ్యాక్‌డ్రాప్ అయినా ఇప్పటి రాజకీయాలు- సామాజిక పరిస్థితులకు అనుగుణంగానే కథను మలిచారని తెలుస్తోంది.

'ఏబిసిడి 3'లో సారా?

బాలీవుడ్ యువ హీరో వరుణ్ ధావన్ నటించనున్న 'ఏబిసిడి 3' చిత్రంలో సారా అలీఖాన్ కథానాయికగా నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతకుముందు ఈ పాత్రకోసం కత్రినాకైఫ్‌ను తీసుకోవాలనుకున్నా ఆమె డేట్స్ అడ్జెస్ట్ కాకపోవడంతో ఇప్పుడు ఈ అవకాశం సారాను వరించిందని సమాచారం. ఇక సారా 'ఖేదర్నాథ్, సింబా' చిత్రాలతో వరస విజయాలను సొంతం చేసుకుంది. రెమో డిసౌజా తెరకెక్కించనున్న ఈ చిత్రం కోసం వరుణ్ ఏకంగా 21 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకుంటున్నాడట. త్వరలో సెట్స్ మీదకు వెళ్లనున్న ఈ చిత్రాన్ని 2డితో పాటు 3డిలో కూడా తెరకెక్కించనున్నారు.



'షకీలా' ఇలా..

మలయాళంలో 80-90 దశకంలో 'షకీలా' సినిమా విడుదల అవుతుందంటే చాలు యువత ఎగబడేవారు. ఆమె చిత్రాలను పోటీపడి మరీ చూసేవారు. అలాంటి 'షకీలా' జీవిత కథ త్వరలో సినిమాగా రాబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే సినిమా షూటింగ్ పూర్తి చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ ముగింపులో ఉంది. ఈ ఏడాది సమ్మర్‌లో చిత్రం విడుదలవుతుందని చిత్ర బృందం స్పష్టం చేసింది. కాగా, 'షకీలా' పాత్రలో బాలీవుడ్ బ్యూటీ రిచా చద్దా నటిస్తోంది. ఇప్పటి వరకూ విడుదల చేసిన చిత్రం లుక్‌లు ఆకట్టుకుంటే -తాజాగా మందు గ్లాసులో నిలబడిన రిచా చద్దా మరో లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. షకీలా కథలోని మెటీరియర్ అర్థమయ్యే రీతిలో విడుదల చేసిన లుక్ ఆకట్టుకుంటోంది. చిత్రానికి మలయాళ దర్శకుడు ఇంద్రజిత్ లంకేష్ దర్శకత్వం వహించారు. చిత్రంలో షకీలా అతిథి పాత్రలో కనిపించనుంది. తన బయోపిక్ గురించి ఇటీవలే ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో షకీలా మాట్లాడుతూ తన జీవితంలోని అతి ముఖ్యమైన తప్పులు, ఒప్పులు ఉంటాయని ప్రకటించటం తెలిసిందే.





రత్తాలు.. కేక

ఎంఎస్ ధోని ప్రేయసిగా కలకలం రేపిన తర్వాతనే రాయ్‌లక్ష్మి పాపులారిటీ స్కైని టచ్ చేసింది. తర్వాత వరుసగా సినిమా ఆఫర్లువచ్చాయి. తలా అజిత్ అంతటివాడు గ్యాంబ్లర్ సినిమాలో ఛాన్సిచ్చాడు. లారెన్స్ కాంచన చిత్రంలోనూ రాయ్‌లక్ష్మి నటన అబ్బురపర్చింది. తర్వాత మెగాబాస్ చిరంజీవి రాయ్‌లక్ష్మిని పిలిచి రత్తాలుగా మార్చేశాడు. అయితే ఇటీవల ఈ అమ్మడు మరీ నల్లపూస అయిపోతోంది. ఇటు టాలీవుడ్‌లో అమ్మడి జోరు ఏమంత కనిపించలేదు. కానీ స్పెషల్ నంబర్లు, స్పెషల్ క్యారెక్టర్లతో మాత్రం సౌత్‌లో ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. 2017లో బాలీవుడ్‌లో జూలీగా నటించిన లక్ష్మిరాయ్‌కి ఆ సినిమా పరాజయాన్నే మిగిల్చడంతో బాలీవుడ్ ఊసే ఎత్తలేదు. 2018లో మాత్రం ఈ అమ్మడు పలు ఆసక్తికరమైన చిత్రాల్లో నటిస్తోంది. తన బ్రాండ్‌లో గ్లామర్ ఎలివేషన్‌తోపాటు హారర్ టెర్రర్ కాన్సెప్టు చిత్రాల్లోనూ రాయ్‌లక్ష్మి నటిస్తోంది. ప్రస్తుతం తమిళంలో నీయ 2 సెట్స్‌పై ఉంది. అలానే మమ్ముట్టి నటిస్తున్న 'ఒరు కూట్టందాన్‌బ్లాగ్' అనే చిత్రంలోనూ నటిస్తోంది. ఈ హ్యాపీతో అభిమానులకు సామాజిక మాధ్యమాల్లో స్పెషల్ ట్రీట్ ప్లాన్ చేసింది. కొత్త ఏడాదిలో కొత్త ఫొటో షూట్‌తో టచ్‌లోకి వచ్చింది. రాక్ సాలిడ్ భవంతిలో లక్ష్మిరాయ్ ఇచ్చిన ఫోజు కుర్రకారు కంటిపై కునుకు పట్టనీయడం లేదట. అదే ఇది.